
మంగళవారం
15•08•2017
కరీంనగర్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 49
• పేజీలు : 12 + 4 + 20

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
71వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





నవభారతానికి ప్రతినబూనుదాం

- 2022నాటికి సరికొత్త భారత్ ఆవిష్కృతం కావాలి
- కరుణ, మానవతతో కూడిన అభివృద్ధి అవసరం
- ప్రభుత్వ సంకల్పానికి ప్రజల భాగస్వామ్యమూ తోడవ్వాలి
- జీఎస్టీని ప్రజలు సంతోషంగా అంగీకరించారు
- నోట్లరద్దును అపారమైన సహనంతో అర్థం చేసుకున్నారు
- 71వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి కోవింద్

5



విదేశీ గడ్డపై 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టుగా రికార్డు
చివరిటెస్టులో శ్రీలంకపై ఇన్నింగ్స్ విజయం

మహాన్ భారత్

విరాట్‌సేన నయా చరిత్ర

టీమ్ ఇండియా చరిత్ర సృష్టించింది. శ్రీలంకతో జరిగిన చివరిదైన మూడో టెస్టులో ఇన్నింగ్స్ 171 పరుగుల తేడాతో గెలుపొంది సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ గెలుపుతో విదేశీ గడ్డపై మూడు లేదా అంతకంటే ఎక్కువ టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా విరాట్ సేన సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. శ్రీలంకతో తొలి రెండు టెస్టులను నాలుగురోజుల్లో ముగించిన కోహ్లీబృందం.. మూడోటెస్టును మాత్రం మూడురోజుల్లోనే ముగించింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కగా, సిరీస్‌లో రెండు సెంచరీలతో అదరగొట్టిన శిఖర్ ధవన్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు.

> వివరాలు ఖేల్ లో

ప్రజాహితానికి పట్టం





వాకాటి కరుణ



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సీవీ ఆనంద్



ఎండీ షఫీవుల్లా

వాకాటి కరుణ, ప్రవీణ్‌కుమార్, సీవీ ఆనంద్, షఫీవుల్లా ఎంపిక

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నేడు సత్కారం

నలుగురు ఆలిండియా సర్వీసు అధికారులకు సేవా పురస్కారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అవిరళ కృషిచేస్తున్న ఆలిండియా సర్వీసు అధికారులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సన్మానించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. విశిష్ట సేవా పురస్కారాల కింద సివిల్ సర్వీసెస్ అధికారులను ఎంపిక చేశారు. కేసీఆర్ కిట్ల పథకాన్ని సక్సెస్ చేయడంలో, సర్కార్ దవాఖాన పనితీరు మెరుగుపర్చడంలో విశేష కృషిచేసిన వాకాటి కరుణను విశిష్ట సేవలు అందించిన ఐఏఎస్ అధికారిగా గుర్తించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సమర్థంగా నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పౌరసరఫరాల వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్న సీవీ ఆనంద్‌ను ఐపీఎస్ క్యాటగిరిలో ఎంపిక చేశారు. మైనారిటీ గురుకుల పాఠశాలలను విజయవంతంగా నిర్వహిస్తున్న

> మిగతా 2వ పేజీలో

ఐదుగురికి కీర్తిచక్ర

- 17 మందికి శౌర్యచక్ర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 112 మందికి రాష్ట్రపతి గ్యాలెంట్రీ పురస్కారాలు

5

హైదరాబాద్ మహిళా జైలు చీఫ్ వార్డర్‌కు

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం



ప్రమీలాబాయి

- రాష్ట్ర పోలీసు విభాగానికి 13 పతకాలు
- సీవీ ఆనంద్, డీసీపీ బాలకృష్ణలకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు

న్యూఢిల్లీ/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని ప్రత్యేక మహిళా జైలు చీఫ్ హెడ్ వార్డర్ ప్రమీలాబాయికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం లభించింది. ఖైదీలను సంస్కరించడానికి ప్రమీలాబాయి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జైళ్ల విభాగంలో దేశవ్యాప్తంగా ప్రకటించిన

> మిగతా 2వ పేజీలో

త్వరలో 2,500 ఇంజినీర్

పోస్టుల భర్తీ

- రేపోమాపో అటవీశాఖలో రెండువేల ఉద్యోగాలకు నోటిఫికేషన్
- 800 ఏఈవో పోస్టులనూ భర్తీ చేస్తాం
- డీఎస్సీపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి వెల్లడి

వైరా, నమస్తే తెలంగాణ:

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలం అష్ణగుర్తి గ్రామంలో సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో భవిష్యత్‌లో ఉద్యోగాలకు కొదువ లేదన్నారు. త్వరలో 2,500 ఇంజినీర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇప్పటివరకు టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో 26 నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. డీఎస్సీ నిర్వహణపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే 8వేల పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉన్నదని చెప్పారు. గ్రూపు-2 ఉద్యోగాల నియామక అంశం కోర్టు పరిధిలో ఉన్నదన్నారు. ఇది కూడా త్వరలో పరిష్కారం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖలోని 800 ఏఈవో పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. రెండు, మూడు రోజుల్లో అటవీశాఖలో రెండు వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్

> మిగతా 9వ పేజీలో







సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ జెండాలతో ప్రదర్శన. (ఇన్‌సెట్) సీపీ దుగ్గల్‌కు వరల్డ్ రికార్డు పత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధి జ్యోతి

జయహో!

పెద్దపల్లిలో 20వేలకుపైగా జాతీయ పతాకాలతో 3.250 కిలోమీటర్ల ప్రదర్శన

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య దినోత్సవానికి దేశం సిద్ధమవుతున్న వేళ పెద్దపల్లి జిల్లా ప్రజలు వరల్డ్ రికార్డు సాధించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. ఇరువైవేల మందికి పైగా విద్యార్థులు, ప్రజలు జాతీయ పతాకాలను చేత పట్టుకొని 3కిలో మీటర్ల 250 మీటర్ల ప్రదర్శన నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ ప్రదర్శనకు 'వండర్ రికార్డ్స్ ఆఫ్ వరల్డ్' గుర్తింపు లభించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు గుర్తింపు పత్రంతో పాటు మెడల్‌ను రామగుండం సీపీ దుగ్గల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్ జిత్ దుగ్గల్, ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీలో పెరుగనున్న పోస్టులు

2017 ఖాళీలనూ చేర్చాలని సీఎం ఆదేశం

8,792 పోస్టులకు అదనంగా మరో నాలుగువేలు

టీఎస్ పీఎస్సీ ద్వారా పోస్టుల భర్తీ.. ఒకటి లేదా రెండు డీఎస్సీలపై త్వరలో నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డీఎస్సీలో టీచర్ పోస్టులు పెరుగనున్నాయి. విడుదలకు సిద్ధమవుతున్న డీఎస్సీ (టీచర్స్ రిక్రూట్‌మెంట్) నోటిఫికేషన్‌లో 2017 వరకు ఉన్న ఖాళీలను కూడా చేర్చాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. ప్రస్తుతం డీఎస్సీలో 8,792 పోస్టుల భర్తీకోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ఇందులో 2015 నాటికి ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే 2017 జూన్ వరకు ఏర్పడిన టీచర్ల పోస్టుల ఖాళీలను కూడా ఇదే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే విషయమై డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితో సీఎం కేసీఆర్ చర్చించినట్లు తెలిసింది. ఈ ఖాళీలను ఒక డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలా? లేక రెండు డీఎస్సీల ద్వారా భర్తీ చేయాలా? అనే అంశంమీద కొంత చర్చ అనంతరం, రెండింటిమీద పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో 31 జిల్లాల్లో నాలుగు వేల టీచర్ పోస్టులు పెంచే అవకాశం ఉందని తెలిసింది. కొత్తగా ఏర్పాటైన ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో ఇంగ్లిషు టీచర్ల పోస్టులను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే విషయాన్నీ పరిశీలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. వచ్చే వారానికల్లా పూర్తి ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని కడియం శ్రీహరిని, విద్యాశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

పంద్రాగస్టు వెలుగులు



పంద్రాగస్టు సందర్భంగా సోమవారం రాత్రి విద్యుత్ దీపాల వెలుగుల్లో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్తూపం

గోల్కొండ జిలుగులు



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని గోల్కొండ కోట వద్ద సోమవారం కొనసాగుతున్న ఏర్పాట్లు

జిల్లాల్లో 97 మందికి నేడు ఇన్సెంటివ్ అవార్డుల ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన 97 మంది ఉద్యోగులను తెలంగాణ స్టేట్ ఇన్సెంటివ్ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రూప్ 1, 2, 3, 4 క్యాటగిరీల ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి పరిశీలన జరిపిన తర్వాత తుది జాబితాను ప్రకటించింది. జిల్లాస్థాయి ఇన్సెంటివ్ అవార్డులకు ఎంపికైన ఉద్యోగులకు వన్‌టైమ్ ఇంక్రిమెంట్‌తోపాటు ప్రశంసాపత్రం ఇస్తారు. ఉత్తమ ఉద్యోగిగా సర్వీస్ రికార్డులో ఎంట్రీ చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన 12 మందికి సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రశంసాపత్రంతోపాటు నగదుపురస్కారాన్ని అందజేస్తారు.

పంచాయతీరాజ్ అధికారులకు అవార్డులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్న పలువురు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ అవార్డులను ప్రకటించింది. అవార్డుగ్రహీతల్లో సీ సురేశ్‌బాబు (సిద్దిపేట-డీపీవో), వీ సురేశ్‌మోహన్ (మేడ్చల్- డీపీవో), వీ వెంకటేశ్వర్లు (సంగారెడ్డి- డీపీవో), టీ నాగిరెడ్డి (సూర్యాపేట-ఎంపీడీవో), జీ సంతోష్‌కుమార్ (జగిత్యాల- ఈవో), మహమ్మద్ అత్తర్ పర్వేజ్ (యాదాద్రి - సీనియర్ అసిస్టెంట్), బానోతు స్వామి (సూర్యాపేట- వాచ్‌మన్), కూచన ప్రకాశ్ (వరంగల్- పంచాయతీ కార్యదర్శి) ఉన్నారు.



హమీల్‌పూర్ అర్జున్



వీరగోని సుధాకర్



రాజు



కందిమల్ల వెంకటేశ్వర్లు

ఫైర్ సర్వీసెస్‌కు శౌర్య, విశిష్ట సేవా పతకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రప్రభుత్వం రాష్ట్ర అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బందికి అవార్డులు ప్రకటించింది. హమీల్‌పూర్ అర్జున్, వీరగోని సుధాకర్ (ఇద్దరు ఫైర్‌మన్లే)లకు శౌర్య పతకాలు లభించాయి. రాజు (స్టేషన్ ఫైర్ ఆఫీసర్), ఎస్‌హెచ్ కందిమళ్ల వెంకటేశ్వర్లు (డ్రైవర్/ఆపరేటర్) ప్రెసిడెంట్స్ ఫైర్ సర్వీసెస్ మెడల్ ఫర్ డిస్టింగిష్ సర్వీస్ (విశిష్ట సేవా) అవార్డులు దక్కాయి.

గవర్నర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ 71వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ సమగ్రత కోసం మనందరం పాటుపడాలని సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరుల సేవలను ఆయన స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది ప్రాణాలర్పించారని, వారి త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని పేర్కొన్నారు.

ప్రజాహితానికి పట్టం

మొదటిపేజీ తరువాయి...

ఎండి షఫివుల్లాను ఐఎఫ్‌ఎస్ అధికారుల క్యాటగిరిలో ఎంపిక చేశారు. ఈ నలుగురిని మంగళవారం గోల్కొండకోటలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సత్కరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రత్యేకంగా సన్మానించడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. కాగా, కుటుంబ సంక్షేమశాఖ, టీవీవీపీ కమిషనర్‌గా పనిచేస్తున్న వాకాటి కరుణకు విశిష్ట గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి అభినందనలు తెలిపారు.

వైద్య సేవలకు గుర్తింపు

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అందించిన వైద్యసేవలకు గుర్తింపుగా నాకు ఈ అవార్డు దక్కింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో మరింతగా ప్రజలకు సేవలనందిస్తాను. ప్రభుత్వం వైద్య, ఆరోగ్యరంగాల్లో వినూత్న మార్పులు తీసుకొస్తున్నది. ఇందుకు అనుగుణంగా ఆయా విభాగాలు పనిచేస్తున్నందువల్లే నాకు ప్రత్యేక గౌరవం దక్కిందని భావిస్తున్నారు.

- వాకాటి కరుణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్

గురుకులాల ప్రగతికి మరింత కృషిచేస్తా..

రాష్ట్ర ప్రభుత్వం ఆలిండియా సర్వీసు అధికారులను గుర్తించి సన్మానించడం హర్షణీయం. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు మాత్రమే సాధ్యమైంది. ప్రభుత్వానికి నాపై ఉన్న నమ్మకానికి ధన్యవాదాలు. సీఎం కేసీఆర్‌కు మాపై ఉన్న నమ్మకమే గొప్ప రివార్డు. ప్రభుత్వం అందిస్తున్న అవార్డు నాకు ఇచ్చినట్లు కాదు.. అన్ని గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులకు ఇచ్చినట్లుగా భావిస్తున్నాను. గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా సీఎం కేసీఆర్ తెలంగాణకు కొత్త తరాన్ని తయారుచేసే అవకాశం కల్పించారు. గురుకులాల ప్రగతికి మరింత కృషి చేస్తా.

- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి, టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్

రెండూ రావటం నా అదృష్టం

ఒకవైపు కేంద్ర ప్రెసిడెంట్ మెడల్, మరోవైపు రాష్ట్ర అవార్డు ఇలా ఒకేసారి రావడం నా అదృష్టం. చాలా సంతోషంగా ఉంది. 25 ఏండ్లపాటు పోలీసు విభాగంలో సేవలందించాను. 2002లో గ్యాలంట్రీ మెడల్ అందుకున్నాను. ప్రస్తుతం ప్రెసిడెంట్ పోలీసు మెడల్ వచ్చింది. ప్రభుత్వం ఇచ్చే ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికవటం నాకు ఎక్కువ ఆనందం కలిగిస్తున్నది. ఐపీఎస్‌గా ఉన్న నన్ను సీఎం కేసీఆర్ పరిపాలన విభాగంలోకి తీసుకొచ్చారు. గొప్ప అవకాశం ఇచ్చారు. నిజాయితీగా కృషి చేశాను. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించటం గొప్ప అనుభూతి. పరిపాలన విభాగంలో రాణించాననే సంతృప్తి కలుగుతున్నది. నా బాధ్యత మరింత పెరిగింది.

-సీవీ ఆనంద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్

అవార్డు ఉత్సాహం, నైతికస్థైర్యం పెంచింది

అవార్డు రావడం నాతోపాటు మైనారిటీ గురుకులాల విజయవంతానికి కృషిచేస్తున్న సొసైటీ అధికారులు, ఉద్యోగుల్లో మరింత ఉత్సాహం, నైతిక స్థైర్యాన్ని పెంచింది. అధికారులు, సిబ్బందికి ఈ అవార్డు అంకితం. ఈ స్కూళ్లను సమర్థంగా సక్రమంగా నిర్వహించడానికి, బంగారు తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ కన్న కలలను నిజం చేయడానికి కృషిచేస్తా.

-తెలంగాణ రాష్ట్ర మైనారిటీల రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ(టెమ్రీస్) కార్యదర్శి షఫివుల్లా



డీసీపీ బాలకృష్ణ



జోగుల నర్సయ్య



పాక గిరిరాజు



మిర్యాల ప్రభాకర్



రెగట్టే జగదీశ్వర్‌రెడ్డి



బూర్గుల మహేందర్

హైదరాబాద్ మహిళా జైలు చీఫ్‌వార్డర్‌కు

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం

మొదటిపేజీ తరువాయి...

ఏకైక రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం తెలంగాణకు చెందిన ప్రమీలాబాయికి లభించడం విశేషం. మిగిలిన 19 ఉత్తమ సేవా అవార్డులు వివిధ రాష్ట్రాలకు లభించాయి. పోలీసు విభాగంలో ఏకైక రాష్ట్రపతి శౌర్యపతకం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్లాటూన్ కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం లభించింది. తెలంగాణ పౌర సరఫరాల విభాగం కమిషనర్, ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌కు, హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు డీసీపీ బాలకృష్ణకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి.

పోలీస్‌విభాగంలో 11 ఉత్తమసేవాపతకాలు


రాష్ట్రంలోని 11 మంది పోలీసు సిబ్బందికి ఉత్తమ సేవా పోలీసు అవార్డులు లభించాయి. వారి వివరాలు: జోగుల నర్సయ్య-ఏసీపీ చిక్కడపల్లి డివిజన్ (సెంట్రల్ జోన్ హైదరాబాద్); మిర్యాల ప్రభాకర్- డీఎస్పీ (ఏసీబీ, మహబూబ్‌నగర్); రెగట్టే జగదీశ్వర్‌రెడ్డి-డీఎస్పీ (ఇంటెలిజెన్స్, హైదరాబాద్); పాక గిరిరాజు- ఏసీపీ (సిటీ ట్రైనింగ్‌సెంటర్, పేట్లబుర్జు, హైదరాబాద్); తాళ్లూరి రాజరాజేశ్వరలక్ష్మి-ఇన్‌స్పెక్టర్ (సీఐసెల్ ఇంటెలిజెన్స్, హైదరాబాద్); పాకనాటి భూపాల్‌రెడ్డి-ఆర్‌ఐ (గ్రేహౌండ్స్, హైదరాబాద్); బూర్గుల మహేందర్- ఏఎస్‌ఐ (కాజీపేట); తుడి ప్రభాకర్- ఏఆర్‌ఎస్‌ఐ (17వ బెటాలియన్, టీఎస్‌ఎస్పీ, కరీంనగర్); ముద్దం రఘుపతిరావు-హెడ్ కానిస్టేబుల్ 4711 (ఇంటెలిజెన్స్, హైదరాబాద్); మహ్మద్ ఖైరుద్దీన్- హెడ్‌కానిస్టేబుల్ (ఎస్‌ఏఆర్ సీపీఎల్, అంబర్‌పేట, హైదరాబాద్); పంజాయుదం జీవనందం-హెడ్‌కానిస్టేబుల్ 7581 (సీఐసెల్, ఇంటెలిజెన్స్, హైదరాబాద్). కాగా, అవార్డులు సాధించిన రాష్ట్ర పోలీసు సిబ్బందిని రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా మొత్తం 990 అవార్డు లను ప్రకటించింది. వీటిల్లో ఒకటి రాష్ట్రపతి శౌర్య పతకం కాగా, 93 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 190 పోలీసు శౌర్య పతకాలు, 706 ఉత్తమ సేవా పతకాలు. గతేడాది తెలంగాణకు మొత్తం 38 అవార్డులు లభించగా ఈ సారి 14 మాత్రమే లభించాయి. రాష్ట్రాలవారీగా పరిగణనలోకి తీసుకుంటే గరిష్టంగా ఆంధ్రప్రదేశ్‌కు 52 శౌర్య పతకాలు, ఆ తర్వాత జమ్ముకశ్మీర్‌కు 25, ఒడిశాకు 17, మహారాష్ట్రకు 12 చొప్పున లభించాయి. మణుగూరులోని భారజల కర్మాగారంలో పనిచేస్తున్న సీనియర్ కమాండెంట్ శితాంగుశేఖర్ మిశ్రాకు, వరంగల్ హన్మకొండలోని 58వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ సెకండ్ కమాండెంట్ రమేశ్ కబాడి, హైదరాబాద్ సీఆర్పీఎఫ్ రేంజ్ హెడ్‌క్వార్టర్స్ ఇన్‌స్పెక్టర్ అన్బళగన్ తదితర పలువురికి పోలీసు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలోని హెడ్‌కానిస్టేబుల్ జీ అబ్బయ్య, కానిస్టేబుల్ వీసీఎస్ రెడ్డిలకు కూడా ఉత్తమ పోలీసు సేవా పతకాలు లభించాయి.

నాపై మరింత బాధ్యత పెరిగింది

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం లభించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ పురస్కారంతో నాపై బాధ్యత మరింత పెరిగింది. 30 ఏండ్లుగా జైళ్లశాఖలో పనిచేస్తూ ఎంతోమంది ఖైదీల జీవితాల్లో సత్ప్రవర్తన తీసుకురావడానికి కృషి చేస్తున్నాను. క్షణికావేశంలో చేసిన నేరాలతో విలువైన జీవితం ఎలా దుర్భరంగా మారుతున్నదో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్నాను.

-ప్రమీలాబాయి, ప్రత్యేక మహిళా జైలు చీఫ్ వార్డర్, హైదరాబాద్

లోకం పోకడ



రికార్డులు తిరుగరాసిన మిడ్‌మానేరు

అత్యంత వేగంగా పూర్తయిన ఘనత

పదేండ్లలో జరుగని పనులు 13 నెలల్లోనే..

ఎస్‌ఈ శ్రీకాంత్‌రావుకు ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిడ్‌మానేరు పనులు రికార్డు సమయంలో పూర్తి చేసి చరిత్ర తిరుగరాసిన అధికారుల కృషికి ప్రభుత్వ గుర్తింపు దక్కింది. ఈ పనుల్లో కీలక పాత్ర పోషించిన సూపరింటెండెంట్ ఇంజినీర్ మున్నలూరి శ్రీకాంత్‌రావుకు రాష్ట్ర ఎక్సలెన్స్ అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. మంగళవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా శ్రీకాంత్‌రావు ఈ అవార్డును అందుకోనున్నారు. 2006లో కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు పనులు ఆ ప్రభుత్వం కొనసాగిన ఎనిమిదేండ్లపాటు నత్తనడకన సాగాయి. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి పనుల్లో వేగాన్ని పెంచింది. ఫలితంగా ఈ ఏడాది పది టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు సిద్ధమైంది. సాగునీటి రంగంలో కాంక్రీట్, మట్టి పనుల పరంగా మిడ్ మానేరు చరిత్రను తిరుగరాసింది. కాంగ్రెస్ హయాంలో ఎనిమిదేండ్లపాటు జరిగిన పనికన్నా గత మూడేండ్లలో అందునా గత 13 నెలల్లోనే అనేక రెట్లు అధికంగా పనులు జరిగాయి. మొన్నటి వరకు ఎప్పటికి పూర్తవుతుందో తెలియని అయోమయం నెలకొన్న ఈప్రాజెక్టును ఈయేడాది 10 టీఎంసీల నీటిని నిల్వచేసే స్థాయికి చేర్చారు.

సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది...

చాలా సంతోషంగా ఉంది. సాగునీటి ప్రాజెక్టులను తొందరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు తాపత్రయపడుతున్నారు. దానికనుగుణంగా పని చేస్తేనే మన తెలంగాణకు మేలు కలుగుతుందనే లక్ష్యంతో పని చేశాం. గత పదేండ్లలో జరిగిన దానికన్నా అనేక రెట్ల పనులు జరిగాయంటే అది ఇంజినీర్లందరి సమష్టి కృషిగా చెప్పాలి. మంత్రి హరీశ్‌రావు పనుల పురోగతిమీద సమీక్షలు జరిపి, వాట్సప్‌గ్రూప్‌లో సందే శాలు, సూచనలిస్తూ ముందుకు నడిపించారు. చేసిన పనికి గుర్తింపు లభించింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు.



- మున్నలూరి శ్రీకాంత్‌రావు, అవార్డు గ్రహీత (ఎస్‌ఈ, వరద కాల్వ సర్కిల్, ఎల్ఎండీ కాలనీ, కరీంనగర్)


మిడ్ మానేరు ప్రాజెక్టు ఒక విజయగాథ ఇది..

అంశం	ప్రాజెక్టు మొత్తం పని	2006 నుంచి 2014 వరకు	3 సంవత్సరాల 2 నెలల్లో	గత 13 నెలల్లో
మట్టి పని	128 లక్షల క్యూ.మీ.	47 లక్షల క్యూ.మీ.	76 లక్షల క్యూ.మీ.	61 లక్షల క్యూ.మీ.
కాంక్రీట్ పని	4.80 లక్షల క్యూ.మీ.	52 వేల క్యూ.మీ.	3.84 లక్షల క్యూ.మీ.	1.51 లక్షల క్యూ.మీ.
గేట్లు	3500 మెట్రిక్ టన్నులు	0	3100 మెట్రిక్ టన్నులు	2200 మెట్రిక్ టన్నులు

ముహూర్తం



సూర్యోదయం: 6.03 గంటలకు



సూర్యాస్తమయం: 6.38 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం అష్టమి సాయంత్రం 5.42 వరకు, తదుపరి నవమి. నక్షత్రం: భరణి తె.3.57 వరకు, తదుపరి కృత్తిక. అమృత ఘడియలు : లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 3.29 నుంచి 5.04 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.26 నుంచి 3.17 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.15 నుంచి 4.51 వరకు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలిఫోర్నియాలోని బేలో శకటంపై చేనేత దుస్తులను ప్రదర్శిస్తూ ఏర్పాటుచేసిన మొబైల్ హ్యాండ్‌లూమ్

అమెరికాలో భారత స్వాతంత్ర్య వేడుకలు

తెలంగాణ చేనేత శకటం ప్రదర్శన


ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం దేశప్రముఖులతోపాటు ప్రవాస భారతీయులను సైతం ఆకట్టుకుంటున్నది. అమెరికాలోని పలువురు ప్రవాస తెలంగాణవాసులు చేనేతకు చేయూతగా నిలిచారు. మనదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలిఫోర్నియాలోని బే ప్రాంతంలో ప్రత్యేకంగా రూపొందించిన శకటంపై తెలంగాణ చేనేత దుస్తులను ప్రదర్శిస్తూ మొబైల్ హ్యాండ్‌లూమ్ స్టోర్ ఏర్పాటుచేశారు. ఈ చిత్రాలను మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పంచుకున్నారు. 'అమెరికాలో చేనేత దుస్తులకు దక్కుతున్న ప్రత్యేక ఆదరణ బాగుంది. ప్రవాస తెలంగాణ వాసులందరికీ ధన్యవాదాలు. చేనేత దుస్తులను ధరించుదాం' అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

కిలిమంజారోపై తెలంగాణ గిరిజన తేజం

పర్వత శిఖరాన్ని అధిరోహించిన గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి మల్లేశ్ నైనీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి మల్లేశ్ నైనీ ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించాడు. 5,895 మీటర్ల ఎత్తు గల ఈ పర్వతాన్ని అధిరోహించడానికి ఆగస్టు 10న బయల్దేరిన 13 మంది సభ్యుల బృందంలో మల్లేష్ నైనీ ఒకరు. పర్వతారోహకుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో కిలిమంజారో పర్వతాన్ని సోమవారం అధిరోహించారు. అనంతరం పర్వత శిఖరంపై వంద అడుగుల భారత త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి.. జాతీయగీతాన్ని ఆలపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోను ప్రదర్శించారు. 2014లో పూర్ణతోపాటు ఎవరెస్టును అధిరోహించిన ఆనంద్‌కుమార్ ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులాల సొసైటీ సెక్రటరీ డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహాయ, సహకారాలతో విద్యార్థులు చారిత్రాత్మక విజయాలను సాధించగలుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి చందులాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేజీ టు పీజీ పథకం ద్వారా రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేస్తున్న ప్రభుత్వానికి ప్రవీణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



కిలిమంజారో పర్వతంపై సీఎం కేసీఆర్ చిత్రపటంతో మల్లేశ్ నైనీ



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రైతు బజార్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు తదితరులు



ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టికొడుతున్న మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ హయాంలో ఇసుకపై రూ.4 కోట్ల ఆదాయం

టీఆర్‌ఎస్ హయాంలో రూ.400 కోట్లు

మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీ ప్రపంచ చరిత్రలోనే రికార్డు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మాఫియాలకు కేరాఫ్ కాంగ్రెస్

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'మాఫియాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ.. ఇసుక మాఫియాను పెంచి పోషించింది మీరు కాదా..? పేకాట క్లబ్‌లను ప్రోత్సహించి పేద ప్రజల ప్రాణాలు తీయలేదా..?, నకిలీ విత్తనాలు, ఎరువుల మాఫియాను తయారు చేసింది మీరు కదా..?' అని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ఇసుక మాఫియాను, పేకాట క్లబ్‌లను బంద్ చేయించామన్నారు. 'ప్రాజెక్టులు కట్టొందంటూ అడ్డం పడుతున్నారు.. మీరు ప్రాజెక్టులు కడితే మేం సున్నాలేశామా..?, రండి లెక్కలు తీద్దాం.. మీరెన్ని పనులు చేశారో.., ఈ మూడేండ్ల కాలంలో మేమెంత చేశామో.. చూద్దామా..' అంటూ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. గోదావరి నదిపై మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను రికార్డు స్థాయిలో పూర్తి చేస్తున్నామని, ప్రపంచ చరిత్రలోనే 18 నెలల్లో పూర్తి చేయనున్నామని మంత్రి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హుస్నాబాద్ మహాగండి సముద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇసుక మీద ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.4 కోట్లు మాత్రమే కాగా, టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని పారదర్శకంగా చేయడంతో రూ.400 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, మా పాలనకు రూ.396 కోట్ల తేడా ఉన్నదని, ఈ మొత్తం ఏ కాంగ్రెస్ నాయకుడి జేబులోకి వెళ్లిందని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ పాలనలో ఇసుక, పేకాట, నకిలీ ఎరువులు, విత్తనాలు, గుడుంబాను బంద్ చేయించినట్టు చెప్పారు. మిడ్‌మానేర్ ప్రాజెక్టు వరద కాల్వ 2005లో ప్రారంభమైందని, తెలంగాణ వచ్చేవరకు ఈ తొమ్మిదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. 'వాళ్లు ప్రాజెక్టులు కడితే.. మేం సున్నాలేస్తున్నామని' కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి మాట్లాడటంపై మండిపడ్డారు. 2005-2014 వరకు తొమ్మిదేండ్ల కాంగ్రెస్ పార్టీ పాలనలో రూ.826 కోట్లు ఖర్చు చేస్తే ఈ మూడేండ్లలో ఇప్పటివరకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1,300 కోట్లు వెచ్చించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇంకా పదేండ్లు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చినా కట్టేది కాదని విమర్శించారు. ఈ ఏడాది మిడ్‌మానేరు నింపి 80 వేల ఎకరాలకు కాల్వల ద్వారా నీళ్లందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో మిడ్‌మానేరు ప్రాజెక్టులో 47 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని చేస్తే, టీఆర్‌ఎస్ ప్రభుత్వం 87 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేసిందన్నారు. సిమెంట్, కాంక్రీట్ పనిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 51 వేల క్యూబిక్ మీటర్లు చేస్తే, ఈ మూడేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం 3 లక్షల 81 వేల క్యూబిక్ మీటర్ల పని చేసిందని వివరించారు.

కోదండరాం మేధావేనా..?

'భూములు ఇయ్యకండి.. పనులు ఆపుండ్రి అని ఇవాళ అడ్డుపడుతుండు కోదండరాం.. ఆయన మేధావి అనుకోవాలా?.. లేదా ఇంక ఏమన్న అనుకోవాలో అర్థం కావడం లేదు' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'నిజంగా మీరు మేధావి అయితే.. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారే అయితే.. ప్రాజెక్టులు అడ్డుకోకూడదు' అని హరీశ్‌రావు సూచించారు. రాజకీయాల కోసమైతే తమను తిట్టాలని, ప్రాజెక్టులకు అడ్డుపడటం సరికాదన్నారు.

ఈ బీజేపీ నాయకులా మాట్లాడేది..?

రుణాలు మాఫీ చేయాలని మధ్యప్రదేశ్‌లో రైతులు కోరితే, అక్కడి బీజేపీ ప్రభుత్వం పిట్టల్లా కాల్చి చంపిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌లో చిన్నారులు చనిపోయారు. ఇది బీజేపీ ప్రభుత్వాల పాలనకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులకు రుణాలు మాఫీ చేశామని, ఎరువులు, విత్తనాలు ఇచ్చామని, కరెంట్ కొరతలు లేకుండా అవసరమైన మేరకు కొనుగోలు చేశామని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. అంతకుముందు హరీశ్‌రావు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని ఉట్టికొట్టారు.

రూ.350 కోట్లతో 1,400 బస్సులు కొన్నాం: మంత్రి మహేందర్‌రెడ్డి

రాష్ట్రంలో రూ.350 కోట్లతో 1,400 బస్సులను కొనుగోలు చేసి నడిపిస్తున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. 96 డిపోల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కోసం రూ.60 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. స్థలం ఉన్న చోట ప్రత్యేక భవనాలు నిర్మించడానికి రూ.50 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సిరిసిల్లలో రూ.18 కోట్లతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో జిల్లాకో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సులు వెళ్లని 1,400 గ్రామాలకు మినీ బస్సులు నడుపుతామని చెప్పారు.

మరో నాలుగు రోజులు వర్షాలే!

సిరిసిల్ల, కోహెడలో అత్యధికంగా 10 సెం.మీ. వర్షపాతం

కామారెడ్డి, ఎల్లారెడ్డి, తాడ్వాయిల్లో 8 సెం.మీ.

ఆయకట్టు ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరం

జలకళను సంతరించుకొంటున్న చెరువులు, కుంటలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ మీదుగా ద్రోణి ఏర్పడిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్రమంతటా ఓ మోస్తరుగా.. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. ద్రోణితోపాటు బంగాళాఖాతంలో కోస్తా తీరం వెంబడి సముద్ర మట్టానికి 2.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొని ఉన్నది. ఈ ప్రభావంతో మంగళవారం సాధారణ వర్షాలు, బుధ, గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావాలతో నైరుతి రుతుపవనాలు గడిచిన 24 గంటల నుంచి రాష్ట్రంలో చురుకుగా కదులుతున్నాయని చెప్పారు. గత ఆరురోజులుగా వర్షాలు పుంజుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ వర్షాలతో పంటలు జీవం పోసుకుంటున్నాయి. ముఖ్యంగా పత్తి, మక్కజొన్న, సోయా, కంది తదితర పంటలకు ప్రాణం పోసినట్టయింది. వరిసాగుపై ఇప్పటివరకు సందిగ్ధంలో ఉన్న ఆయకట్టు రైతులు మూడు రోజులుగా నాట్లు ముమ్మరం చేశారు.

రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో భారీ వానలు

గడిచిన 24 గంటల్లో పాత కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, ఖమ్మం జిల్లా కోయిదలో అత్యధికంగా 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పాత నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, తాడ్వాయిల్లో 8 సెం.మీ., బాన్సువాడలో 6, ఆదిలాబాద్‌లో 6, రెంజల్, నిజాంసాగర్, సదాశివనగర్, ఖానాపూర్, గూడూరు, ఇల్లందు ప్రాంతాల్లో 6, గాంధారి, లింగంపేట, మాచారెడ్డి, జుక్కల్, చెన్నారావుపేట, హసన్‌పర్తి, బయ్యారం, చింతకాని, బోథ్, ఉట్నూర్‌లలో 5 సెం.మీ., మహబూబాబాద్, సత్తుపల్లి, జక్రాన్‌పల్లి, నందిపేట, నాగిరెడ్డిపల్లి, ఎడపల్లి, నర్సంపేటలో 4 సెం.మీ., సూర్యాపేట, దేవరకొండ, కొత్తగూడెం, ధర్మపురి, బిక్నూర్, ఇబ్రహీంపట్నం, నిర్మల్‌లో 3 సెం.మీ., కాళేశ్వరం, బెజ్జంకి, సుల్తానాబాద్, గుండాల, గార్ల, నల్లబెల్లి, జాఫర్‌ఘడ్, వెంకటపూర్, మెదక్‌లో 2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. టేకులపల్లి, భద్రాచలం, అశ్వరావుపేట, పినపాక, దుమ్ముగూడెం, బూరుగుపాడు, ములకలపల్లి, కూసుమంచి, కొత్తగూడెం, కంపసాగర్, మెట్‌పల్లి, మాగనూర్, భీమగల్, వర్నీ, నర్మెట్ట, పాలకుర్తి, హైదరాబాద్ నగరంలో 1 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.



మనం మన జాతిని, దేశాన్ని కాపాడుకుందాం. రాష్ట్రాన్ని ఐక్యంగా ఉంచుకోవటం ద్వారా దేశ భద్రతకు హామీగా ఉందాం. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, సిక్కిం, ఇప్పుడు చైనా మనవైపు చొచ్చుకుని వస్తున్నాయి.

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

చైనా, పాకిస్థాన్‌ల స్నేహబంధం అనేక సంక్లిష్టమైన సమయాల్లో వేళ్లానుకొని వికసించింది. చైనా-పాక్ అనుబంధం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. మన స్నేహానుబంధం ఉక్కుకన్నా గట్టిది, తేనె కన్నాతీయనిది.

వాంగ్ యంగ్, చైనా ఉపాధ్యక్షుడు, పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథి.



చరిత్రలో నేడు




1843

ప్రపంచంలోనే అతి ప్రాచీన పార్కుల్లో రెండవదైన టివోలీ అమ్యూజ్‌మెంట్ పార్కు కొపెన్‌హెగెన్‌లో ప్రారంభం.

1971

బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన బహ్రెయిన్.





1989

దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఎఫ్.డబ్ల్యూ. డీ క్లార్క్.

ఆలస్యంగానైనా ఒక మంచి నిర్ణయం జరిగింది. అనేక వర్గాల నుంచి, సినీ రంగ ప్రముఖులు, మేధావుల నుంచి వెల్లువలా వచ్చిన విజ్ఞప్తులకు కేంద్రం స్పందించింది. సీబీఎఫ్‌సీ చైర్‌పర్సన్ పహ్లజ్ విహలానిని పదవి నుంచి తప్పించి, ఆయన స్థానంలో ప్రసూన్ జోషిని నియమించింది. రచయిత, కవి అయిన జోషీ ఆధ్వర్యంలో సీబీఎఫ్‌సీ కేవలం కత్తెరకే పనిచెప్పకుండా భావాత్మకంగా పనిచేస్తుందనే విశ్వాసమున్నది. ఇప్పటికైనా సెన్సారింగ్, సర్టిఫికేషన్‌లో శ్యాంబెనగల్ కమిటీ సూచనలను సెన్సార్ బోర్డు పాటించాలి. ఈ నేపథ్యంలో సినిమాల, సెన్సార్ బోర్డు ఔన్నత్యం పెరుగుతుంది.

ది టైమ్స్ఆఫ్ ఇండియా

ఉత్తర కొరియా విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడు చేష్టలు, దుందుడుకు మాటలు పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. అణ్వాయుధాల తయారీ, ప్రయోగం నిలిపివేయకుంటే తగిన శాస్తి తప్పదన్న ట్రంప్ హెచ్చరికలు బాధ్యతాయుతంగా లేవు. ఇప్పటికైనా అమెరికా సంయమనం పాటించి, రెచ్చగొట్టే మాటలు ఆపాలి. ఈ క్రమంలో కొరియా అమెరికా లక్ష్యంగా చేసుకొని తయారుచేసిన క్షిపణుల పరీక్షలు ఆపాలి. ఇరు దేశాలూ చర్చలతో సమస్యలను పరిష్కరించాలి. ప్రపంచంపై యుద్ధాన్ని రుద్దే చర్యలు ఇరుదేశాలూ నిలిపివేయాలి.

ది హిందూ

గోరఖ్‌పూర్ ఘోరం

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ వైద్య కళాశాల దవాఖానలో ఐదురోజుల వ్యవధిలో అరువై మందికి పైగా పిల్లలు మరణించడం దిగ్భ్రాంతికరం. ప్రకృతి వైపరీత్యాల వల్లనో, అనూహ్యంగా ప్రబలిన మహమ్మారి వల్లనో కాకుండా, మానవ తప్పిదాల వల్ల పసి ప్రాణాలు గాలిలో కలువడం ఆవేదన కలిగిస్తున్నది. దవాఖానలోని నవజాత శిశువులు ఉండే వార్డు, మెదడు వాపు వ్యాధిగ్రస్తులు ఉండే వార్డులలోనే మరణాలు సంభవించాయి. ఆక్సిజన్ సరఫరా ఏర్పాటు లేకపోవడం వల్ల పిల్లలు మరణించారనే ఆరోపణలు ఉన్నాయి. రోగులకు ప్రాణ వాయువును సరఫరా చేసే ప్రైవేటు సంస్థకు దవాఖాన నిర్వాహకులు వెంటదివెంట బిల్లులు చెల్లించడం లేదు. 68 లక్షల రూపాయల మేరకు బాకీ పెరుగడంతో, ఇక సరఫరా ఆపివేయవలసి వస్తుందని ఆ సంస్థ పదేపదే హెచ్చరించింది. అయినా దవాఖాన నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఆ సంస్థ ఆక్సిజన్ సరఫరాను నిలిపివేసింది. ఈ పరిణామానికి ఆందోళన చెందిన ఆయా వార్డులలోని సిబ్బందిని యాజమాన్యానికి పరిస్థితిని ఒకరోజు ముందే వివరించారు. అయినా నిర్వాహకులు పట్టించుకోలేదు. ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో రోగగ్రస్థులైన పిల్లలు మరణించారు. ఈ దారుణానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. దవాఖాన నిర్వాహకులు ఏ మాత్రం మానవీయంగా స్పందించినా ఇంతటి దారుణం సంభవించకపోయేది. దేశవ్యాప్తంగా ప్రజలకు వైద్య సదుపాయాలు అందడం లేదనడానికి గోరఖ్‌పూర్ ఉదంతం తాజా ఉదాహరణ.

గోరఖ్‌పూర్ దుర్ఘటన జరిగిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన ఏ మాత్రం బాధ్యతాయుతంగా లేదు. పిల్లల మరణాలు ఆక్సిజన్ కొరత వల్ల జరుగలేదని, వేర్వేరు వ్యాధుల వల్ల మరణించారని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. దవాఖాన నిర్వాహకులు కూడా ఇదే మాట అంటున్నారు. కానీ పిల్లల మరణాల పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో దవాఖాన నిర్వాహకులు ఆక్సిజన్ సరఫరా చేసే సంస్థకు 21 లక్షల రూపాయలు చెల్లించినట్టు తెలుస్తున్నది. మొదటే అప్రమత్తమైతే ఈ ఘోరం జరుగకపోయేది. గోరఖ్‌పూర్‌లోని ఇదే బీఆర్డీ వైద్య కళాశాల దవాఖానలో 2012 నుంచి మూడువేల మంది పిల్లలు మరణించారని ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. అయినా ఈ దవాఖానలో సదుపాయాల గురించి ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. పసిపిల్లలు మరణాలకు రెండురోజుల ముందే ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ బీఆర్డీ కళాశాల దవాఖానను సందర్శించి, సౌకర్యాలు ఎట్లా ఉన్నాయో ఆరాతీశారు. ముఖ్యమంత్రి స్వయంగా సందర్శించిన తరువాత కూడా దవాఖాన పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నదంటే, ఈ పర్యటనలు, సమీక్షలు ఎంత మొక్కుబడిగా సాగుతున్నాయో తెలుస్తున్నది. ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా ఇటీవలే అధికారం చేపట్టి ఉండవచ్చు. కానీ ఆయనకు గోరఖ్‌పూర్ నియోజకవర్గంతో ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. 1998 నుంచి వరుసగా ఐదు పర్యాయాలు పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలకు వైద్య సదుపాయాలు ఏమేర ఉన్నాయో ఇప్పటికే ఆయనకు అవగాహన ఏర్పరుచుకోవలసింది. పిల్లలు మరణించారనే వార్తలు రాగానే అధికారులపై చర్యలు తీసుకోవడం, దర్యాప్తులకు ఆదేశించడం వరకు బాగానే ఉన్నది. కానీ మూల కారణాలను అన్వేషిస్తే నాయకుల బాధ్యతారాహిత్యమే ప్రధానమైనదిగా కనిపిస్తుంది.

> **పేదరికం, పోషకాహార లోపం, గృహవసతి, పారిశుద్ధ్య వసతులు లేకపోవడం, మురికి నీరు బాటలలో పారడం వంటి అనేక కారణాల వల్ల పిల్లలు రోగాల బారిన పడి మరణిస్తున్నారు. యూపీ పెద్ద రాష్ట్రమైనందువల్ల తూర్పు ప్రాంతం గొంతు వినిపించలేక అణచివేతకు గురవుతున్నది. దేశవ్యాప్తంగానే వైద్య సదుపాయాలు చక్కగా లేవు. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో మరింత దారుణంగా ఉన్నది. పేదలకు కనీస వైద్య వసతులు కల్పించడం ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావించాలె.**

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉన్నది కనుక ఇతర రాజకీయపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తుంటే, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నది. కానీ ఉత్తరప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలు ఇంత అధ్వాన్నంగా మారడానికి బీజేపీతో పాటు అన్ని పార్టీల బాధ్యతా ఉన్నది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఇప్పటివరకు ఏ పార్టీ పట్టించుకోలేదు. దవాఖానలో ఐదు రోజుల్లోనే భారీగా మరణాలు సంభవించడం వల్ల అదొక సంచలనవార్తగా మారింది. కానీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో, అందులోనూ తూర్పు ప్రాంత జిల్లాలలో రోగాలు ప్రబలడం, మరణాలు సంభవించడం ఏటా జరుగుతూనే ఉన్నది. తూర్పు ఉత్తరప్రదేశ్ (పూర్వాంచల్‌గా ప్రసిద్ధి)లో గత మూడు దశాబ్దాల కాలంలో యాభై వేల మందికి పైగా పిల్లలు మెదడు వాపు వల్ల మరణించారు. ఇందులో గోరఖ్‌పూర్ పరిస్థితి మరింత దిగజారిపోయి ఉన్నది. పేదరికం, పోషకాహార లోపం, గృహవసతి, పారిశుద్ధ్య వసతులు లేకపోవడం, మురికి నీరు బాటలలో పారడం వంటి అనేక కారణాల వల్ల పిల్లలు రోగాల బారిన పడి మరణిస్తున్నారు. యూపీ పెద్ద రాష్ట్రమైనందువల్ల తూర్పు ప్రాంతం గొంతు వినిపించలేక అణచివేతకు గురవుతున్నది. దేశవ్యాప్తంగానే వైద్య సదుపాయాలు చక్కగా లేవు. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో మరింత దారుణంగా ఉన్నది. పేదలకు కనీస వైద్య వసతులు కల్పించడం ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావించాలె. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం ద్వారా వ్యాధులు రాకుండానే అరికట్టవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే సర్కారు దవాఖానలను పటిష్ఠం చేయడానికి, జీవన ప్రమాణాలను పెంచడానికి ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గమనార్హమైనవి.

జనగళం

జాతి సంకేతనం



అదిగో.. అదిగది గదిగో
అదిగో.. అదిగది గదిగో ||అదిగో||

ప్రజ్ఞ ప్రాభవ కీర్తి కేతనం
దీక్షా దక్షత దివ్య కేతనం
ధీశాలురు సృష్టించిన భవ్య చరిత కేతనం
విజయాలను రుచిచూపిన వీర త్యాగ కేతనం ||అదిగో||

మబ్బులలో తళుకుమని
తళ తళ తళ తళుకు మని
కులుకులున్న మెరుపువోలే
మువ్వన్నెల సింగారు శోభ ||అదిగో||
అపార దేశభక్తి అజరామర కీర్తి
అమర సమర స్ఫూర్తి భరత జాతి విముక్తికై

ఆంగ్లేయుల నిలదీసిన శౌర్యధనుల కేతనం
అవిశ్రాంతి పోరులో అలుపెరుగని కేతనం
||అదిగో||

అనాదినే స్వేచ్ఛకు పునాది
సమత మమతకే వారధి
స్వాతంత్ర సమరాన్ని అలరించిన సారథి
మోకరిల్లి అందించు వందనం
వందనం.. వందనం... అభి వందనం..

- కూరాకు వెంకటేశ్వర్లు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

తెలంగాణ పంద్రాగస్టు

విశ్లేషణ



ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ

బ్రిటిష్ వలసపాలన నుంచి భారతదేశం ఆగస్టు 15న స్వాంతంత్ర్యం పొంది చీకటి నుంచి వెలుగులోకి ప్రవేశించింది. కానీ హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంత ప్రజలు నిజాం నిరంకుశ, భూస్వామ్య దోపిడీ పాలనలోనే కొనసాగారు. దానికి కారణం దేశంలో బ్రిటిష్ పాలన అంతమైన తర్వాత ఇండియన్ యూనియన్‌లో చేరకుండా స్వతంత్రంగా ఉంటానని నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1947 జూన్‌లో ప్రకటించుకున్నాడు.

దానికి అనుగుణంగా ఆయన మద్దతుదారులు 'ఆజాద్ హైదరాబాద్' నినాదాన్ని లేవనెత్తారు. దానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌స్టేట్ కాంగ్రెస్ 1947 ఆగస్టు 7న నిజాం రాజ్యాన్ని స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయాలని 'జాయిన్ ఇండియా' దినోత్సవాన్ని పాటించింది. స్వంతంత్ర భారతదేశం ఏర్పడిన నాడు హైదరాబాద్ రాజ్యంలో జాతీయ జెండాను ఎగురవేయడాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ నిషేధాజ్ఞలను ధిక్కరించి హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ ప్రాంతమంతటా ప్రజలు జాతీయ జెండాను ఎగురవేయడానికి సంసిద్ధులయ్యారు. యావత్ దేశం జెండా పండుగను జరుపుకుంటున్న తరుణంలో హైదరాబాద్ రాజ్యంలో మాత్రం జెండా ఎగురవేస్తే నిజాం పోలీసులు, రజాకార్లు గుండ్ల వర్షం కురిపించారు. కానీ తెలంగాణ ప్రజానీకం సాహసించి, ప్రాణత్యాగాలు చేసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తమ స్వంతంత్ర ఆకాంక్షను చాటారు. 1947ఆగస్టులో ప్రారంభమైన హైదరాబాద్ మలిదశ విముక్తి పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక మరుపు రాని ఘట్టం.

భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులు, బాధ్యతాయుత, ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా సాగిన తెలంగాణ జాతీయ ఉద్యమం ఆధునిక భారతదేశ చరిత్రలో ప్రత్యేకతను సంతరించుకున్నది.1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వస్తే, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం నిజాం పాలన నుంచి విముక్తి పొందింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ కలలుగన్న ఆజాద్ హైదరాబాద్, ఉస్మానిస్థాన్ భావనను తెలంగాణ సమాజం తిరస్కరించింది. స్వతంత్ర భారతంలో అంతర్భాగమైనది.

చారిత్రకంగా దేశ స్వాతంత్ర్య పోరాటానికి హైదరాబాద్ రాజ్య విముక్తి ఉద్యమానికి మధ్య కొన్ని మౌలిక భేదాలున్నాయి. బ్రిటిష్ ఇండియాలో జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం, స్వదేశీ ఉద్యమం, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా పోరాటాలు హైదరాబాద్ రాజ్యంపై ప్రభావం కలిగించాయి. అయితే హైదరాబాద్ సంస్థానంలోని రాజకీయ, పాలనావ్యవస్థ, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, రాజకీయ పార్టీల నిర్మాణం బ్రిటిష్ ఇండియా కంటే భిన్నంగా ఉన్నాయి. అందువల్ల 1920-30 దశకం వరకు తెలంగాణలో రాజకీయ చైతన్యం, ప్రజాస్వామిక ఉద్యమాలు చెప్పుకోదగిన స్థాయిలో జరుగలేదు. నిజాం ప్రభుత్వం 'గస్తీనిషాన్' ద్వారా ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను, రాజకీయ పార్టీలను నిషేధించింది. అయినప్పటికీ ఆంధ్ర మహాసభ, ఆర్యసమాజ్, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ, కామ్రేడ్స్ అసోసియేషన్, జాతీయవాద, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సంఘటిత ప్రజా ఉద్యమం 1940 దశకంలో తెలంగాణ ప్రాంతమంతటా చెలరేగింది. కుల, వర్గ, లింగ, మత భేదాలు లేకుండా తెలంగాణ సమాజం నిజాం వ్యతిరేక ఉద్యమాలను నిర్మించిందన్నది చారిత్రక వాస్తవం.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక హైదరాబాద్ సంస్థానంలో విముక్తి పోరాటం ఉధృతమైంది. ముఖ్యంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన 'జాయిన్ ఇండియా' ఉద్యమం నూతన ఒరవడిని సృష్టించింది. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమానికి 1946లో ప్రారంభమైన రైతాంగ సాయుధ పోరాటం సహకరించింది. నిరంకుశ, ఫ్యూడల్ శక్తులపై రైతాంగం తిరుగుబాటు చేసింది. అందువల్ల ఆజాద్ హైదరాబాద్ నినాదాన్ని వ్యతిరేకించి నిరసన ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహించబడినాయి. తెలంగాణ స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన అనేక నూతన ఆధారాలు ఈ మధ్య కాలంలో లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా ఆధునిక తెలంగాణ చరిత్రను తిరుగరాయడానికి అవకాశం కలుగుతుంది.

భారతదేశం బ్రిటిష్ వలసపాలన నుంచి విముక్తి పొందిన నాటికి దేశంలో దాదాపు 560 సంస్థానాలున్నాయి. వాటన్నింటిలో అతి పెద్దది అయిన హైదరాబాద్ సంస్థానంలో ప్రజలు నిరంకుశ పాలన, బానిసత్వంలో కొనసాగారు. తమ తోటి భారతీయుల్లాగా తెలంగాణ ప్రజలు స్వాతంత్ర్య ఆకాంక్షను జెండా పండుగలు జరుపుకుంటున్న సందర్భంలో నిజాం ప్రభుత్వ పోలీసులు, రజాకార్లు వారిపై విరుచుకుపడ్డారు. రక్తపుటేరులు పారించారు. అయినా ప్రజలు సాహసించి ఎదురుతిరిగి స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తపరిచారు. వేల సంఖ్యలో సామాన్య ప్రజానీకం అనుభవించిన నిర్బంధాలకు ప్రతీకగా నాటి వరంగల్ జిల్లా ఘటనలు చెప్పుకోవచ్చు.

మొగిలయ్యగౌడ్ ఖిల్లా వరంగల్ నివాసి. తన కులవృత్తి చేసుకుంటూ స్థానిక యువకులతో కలిసి స్వచ్ఛంద దళాన్ని ఏర్పాటుచేశాడు. వారితో కలిసి ఆర్య సమాజ్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కాళోజీ నారాయణ రావు, హయగ్రీవాచారిల ప్రభావంతో జాతీయ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. 1946లో గాంధీ జీ వరంగల్ పట్టణాన్ని సందర్శించారు. అక్కడ జరిగిన మీటింగ్‌లో ఆయన ఉపన్యాసం యువకులను ఉత్తేజపరిచింది. దానికితోడు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిర్ణయం ప్రకారం 1947 ఆగస్టు 15న జెండా వందనం చేయడానికి స్థానికులు సిద్ధమయ్యారు. వందల సంఖ్యలో జనం గుమిగూడారు. భారత్ మాతాకీ జై, మహాత్మాగాంధీకి జై, స్టేట్ కాంగ్రెస్ జిందాబాద్ నినాదాల మధ్య మొగిలయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. ఖిల్లా వరంగల్‌లో జెండా వందనం జరుగుతున్నదన్న విషయాన్ని పసిగట్టిన స్థానిక రజాకార్లు లక్ష్మీ పహిల్వాన్ ఆధ్వర్యంలో మొగిలయ్యపై దాడిచేసి హతమార్చారు. మొగిలయ్య హత్య దావానలంలాగా తెలంగాణ అంతటా వ్యాపించి యువకులను ప్రేరేపించింది. తత్ఫలితంగా రజాకార్ల రాక్షసత్వాన్ని అంతం చేయటానికి యాదవరెడ్డి లాంటి యువకులు ముందుండి నిజాం వ్యతిరేక ఉద్యమాలను నడిపించారు.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో స్థానిక నాయకత్వ పాత్రను గురించి తెలుసుకోవడానికి మడికొండ గ్రామ ఉదంతం ప్రత్యక్ష సాక్ష్యం. ఈ గ్రామంలోని ప్రముఖ కాంగ్రెస్ కార్యకర్త టంకశాల నర్సింహారావు (సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్ తండ్రి గారు) స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర నిర్వహించినందుకు గాను నిజాం పోలీసులు ఆయన ఇంటిని దహనం చేసి దోచుకున్నారు. ఆయన వృత్తిరీత్యా బ్రిటిష్ ఇండియాలోని పూణె ప్రాంతంలో సైనిక ఆయుధగారంలో హవల్దార్‌గా పనిచేశాడు. ఆ తర్వాత తిలక్, గాంధీ బోధనల ప్రభావంతో జాతీయ ఉద్యమ కాలంలో నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరి, కారాగార శిక్షను అనుభవించాడు. 1947 ఆగస్టు 7న ప్రారంభమైన 'జాయిన్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని, సరిహద్దు క్యాంపు కార్యకలాపాల్లో వాలంటీర్లకు శిక్షణ ఇచ్చాడు. ఖమ్మం-కృష్ణా జిల్లా సరిహద్దు గ్రామం పోలంపల్లి క్యాంపునకు ఆయన మొదటి మిలిటరీ కమాండర్‌గా వ్యవహరించారు. 'జాయిన్ ఇండియా' ఉద్యమంలో మిలిటెంట్ పాత్ర వహించిన జమలాపురం కేశవరావు, జలగం వెంగళరావు, హయగ్రీవాచారి, హీరాలాల్ మోరియా లాంటి వారితో కలిసి పనిచేశాడు. తెలంగాణ విముక్తి పోరాటంలో ఆయన తన వంతు పాత్ర నిర్వహించాడు. స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ స్వాతంత్ర్య సమరంలో మొగిలయ్య, నర్సింహారావు లాంటి వేలాదిమంది కార్యకర్తలు నిర్వహించిన పాత్ర ఆమోఘమైనది. భూమి, భుక్తి, విముక్తి కోసం వారు సాగిన బాట ఆదర్శప్రాయమైనది. ఆ క్రమంలోనే 1947-48 సంవత్సరాలలో కొనసాగిన తెలంగాణ విముక్తి పోరాటంలో దళిత, బహుజన, సబ్బండ వర్ణాల త్యాగం మరువరానిది. ఆ అమరుల త్యాగాలను స్మరించుకొని నవ తెలంగాణ నిర్మాణానికి కృషిచేయడం మన అందరి బాధ్యత.

> స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ స్వాతంత్ర్య సమరంలో మొగిలయ్య, నర్సింహారావు లాంటి వేలాదిమంది కార్యకర్తలు నిర్వహించిన పాత్ర ఆమోఘమైనది. భూమి, భుక్తి, విముక్తి కోసం వారు సాగిన బాట ఆదర్శప్రాయమైనది. ఆ క్రమంలోనే 1947-48 సంవత్సరాలలో కొనసాగిన తెలంగాణ విముక్తి పోరాటంలో దళిత, బహుజన, సబ్బండ వర్ణాల త్యాగం మరువరానిది. ఆ అమరుల త్యాగాలను స్మరించుకొని నవ తెలంగాణ నిర్మాణానికి కృషిచేయడం మన అందరి బాధ్యత.

(వ్యాసకర్త: ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్)

అమరభాషలో ఆధునికుడు


సందర్భం



వారాల ఆనంద్

తెలంగాణమున కవులు శూన్యం అన్న మాటపడ్డ తెలంగాణ 'గోలకొండ కవుల సంచిక'తో సమాధానమిచ్చింది. మీ తెలంగాణలో ఇంత మంచి సంస్కృత పండితులున్నారా అన్న శివతాండవ కవి మాటలకు చిన్న నవ్వుతో బదులిచ్చి తన అవిశ్రాంత సంస్కృత సృజనను కొనసాగించిన సృజనశీలి పండితుడు శ్రీ భాష్యం విజయసారథి. సంస్కృతమే తన భాషగా, వ్యక్తీకరణగా తనకు తానే నిర్దేశించుకొని వందకు పైగా సంస్కృత గ్రంథాలు రాసి జాతీయస్థాయిలో తెలంగాణ ధ్వజాన్ని నిలిపిన ప్రతిభావంతుడు విజయసారథి. ఆయన ప్రతిభ, పరిశోధన, విశ్లేషణ, వ్యాఖ్యాన రీతుల్లో దేశవ్యాప్తంగా ఖ్యాతి పొందింది. కవిగా ఆయన ఎన్ని ఉన్నతమైన రచనలు చేశారో వ్యాఖ్యానమూర్తిగా అంతే ప్రతిష్ఠ పొందారు.

ఉర్దూ అధికార భాషగా ఉండి విద్యాలయాల్లో ఉర్దూ మాధ్యమానికే పెద్దపీట వేసిన నిజాంకాలంలో సంస్కృతాన్ని చదువుకొని తన సృజనను సంస్కృతంలోనే చేయాలని నిర్దేశించుకొని ఆ దిశలో ఉన్నత స్థానాన్ని పొందారు. సంస్కృతమంటే దేవతల పూజలు పురాణ కథలు అనుకుంటున్న స్థితిలో సామాజిక అంశాలను తీసుకొని సృజన చేసిన కవి విజయసారథి. సంప్రదాయ రూపంలో ఆధునిక భావాలను, ప్రయోగశీలతను ఆవిష్కరిస్తూ ఆయన రచనలు ముందుకుసాగాయి. అందుకే ఆయన అమర భాషలో ఆధునికుడు.



ఆయన రాసిన 'భారత భారతి' కవితా సంపుటిలో అరువై శ్లోకాలున్నాయి. ఈ కావ్యం మొత్తం ఆధునిక సామాజిక సమస్యలను చిత్రించడంతో పాటు వాటికి పరిష్కారాలను కూడా సూచిస్తున్నది. దేశ స్వాతంత్ర్యాన్ని, సమగ్రతను పరిరక్షించడం కోసం ముందుండాలని సూచిస్తుందీ కావ్యం. ప్రజాస్వామ్య భావనను ఆవిష్కరిస్తుంది. 'భారత భారతి' ఆయనను ఆధునిక కవిగా నిలబెడుతుంది.

అఖిల భారతస్థాయిలో ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, నాగ్‌పూర్, ఢిల్లీ ఇలా అనేక నగరాల్లో జరిగిన అనేకానేక కవి సమ్మేళనాల్లో పాల్గొని తెలంగాణ ఖ్యాతిని చాటిన గొప్ప సంస్కృత కవి విజయసారథి. 'మందాకిని' కవిగా మన్ననలు పొందిన ఆయన రాసిన వందకు పైగా కావ్యాల్లో సుప్రభాతాలూ, స్తోత్రాలు, దేశభక్తి రచనలు, అధిక్షేప కవితలు, ఆప్త లేఖలు (లేఖా రచన), ఖండకావ్య పరంపర, ప్రహేళికలు, విమర్శ, అనువాద రచనలు, వర్ణనా కావ్యాలు, మంత్రమాయా రచనలున్నాయి. సంస్కృతంలో ఖండకావ్య ఒరవడిని ప్రారంభించిన కవి ఆయనే. లేఖా సాహిత్యంలో కూడా ఆయన చూపిన దారి విలక్షణమైనదే. ఇక ఆయన 'మందాకిని' పంచమాత్రక గుణాలతో పాడుకొనేందుకు వీలుగా గేయకావ్యంగా రచించి సంస్కృత రచనల్లో నూతన ఒరవడిని సృష్టించారు. ఇందులో వాడిన ధాతు ప్రయోగాలు విశేషమైన విలక్షణతను సంతరించుకున్నాయి. మందాకిని నదిని కావ్య వస్తువుగా తీసుకొని సాగిన ఈ కావ్యం నిండా అత్యధిక ధాతు ప్రయోగాలుండి విశిష్ఠ ప్రయోగంగా నిలిచింది. శ్రీ భాష్యం రాసిన సాహిత్యంలో ఆధునిక భావాలతో కూడిన భారతీయ సాంస్కృతిక చారిత్రక సంపదను, వాటి గొప్పదనాన్ని విశ్లేషిస్తూ రాశారు. ఆయన రచనల్లో స్పష్టత, సూటిదనం పాఠకులను ఆకర్శిస్తాయి. ఆయన రచించిన రసకేళి నాట్యశాస్త్రాన్ని అధ్యయనం చేసిన వారిని కూడా ఆకర్శించింది. ఆయన సంగీత మాధవం సంగీతకృతిగా మన్ననలు అందుకున్నది.

ఇప్పటివరకు ఆయన 25కు పైగా సుప్రభాతాలు రాశారు. ఇప్పుడు కూడా బాసర సరస్వతీ ఆలయంలో, వరంగల్ భద్రకాళి ఆలయంలో, ఇల్లంతకుంట రామాలయంలో, హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలో శ్రీ భాష్యం రాసిన సుప్రభాతాలే వినిపిస్తారు. ఆయన రాసిన దేశభక్తి గీతాలు, సుప్రభాతాలు, స్తుతి గీతాలు, నృత్యగీతాలు సీడీల రూపంలో కూడా విడుదలయ్యాయి.

శ్రీ భాష్యం విజయసారథి 1937 మార్చి 10న కరీంనగర్ జిల్లా చేగుర్తి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. అమ్మ నుంచి సంస్కృత భాష, సంగీతాలను నేర్చుకున్న ఆయన మొదట ప్రతి విషయాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టారు. హేతువాదిగా ఒకింత తీవ్రంగానే వాదించేవారు. ఆకాలంలో ఒకవైపు రజాకార్ల ఆగడాలు మరోవైపు కమ్యూనిస్టు భావజాలంతో విప్లవ ధోరణి నెలకొన్న స్థితి. ఆ నేపథ్యంలో ఆయన విప్లవ వాదం వైపు, హేతువాదం వైపు మొగ్గారు. ఒకస్థాయిలో నిజాం పోలీసులు తమ లిస్టులో కూడా చేర్చారు. వీటన్నిటిని గమనించిన వారి అన్న విజయ సారథిని వరంగల్‌లో ఉన్న శ్రీవిశ్వేశ్వరయ్య సంస్కృత కళాశాలలో అప్పటిదాకా ఉన్న పార్థసారథి పేరును మార్చి చేర్పించారు. అక్కడ మొదలైన సంస్కృత భాషా పరిచయం దానికి తోడుగా స్వతసిద్ధంగా ఉన్న కవితాశక్తి జతకూడి కవిగా దశాబ్దాలపాటు తన సృజనయాత్ర కొనసాగించారు. పదకొండేళ్ల వయసులోనే శారదా పదకింకిని, పదహారేండ్లకు శబరీ పరివేదనం, పదిహేడవ ఏట మనోహరం లాంటి రచనలు చేశారు.

వరంగల్ సంస్కృత కళాశాలలో సాగిన ఆయన విద్యాభ్యాసం అనంతరం కాశీ వరకు చేరింది. తర్వాత అదే కళాశాలలో అధ్యాపక వృత్తిని చేపట్టి అక్కడే పదవీ విరమణ పొందారు. పలు విశ్వవిద్యాలయాలతో పాటు అనేక జాతీయ కవిసమ్మేళనాల్లో తన కవితా గానంతో ఆకట్టుకున్న విజయసారథి అయ్యదేవర కాళేశ్వరరావు చేతుల మీదుగా మహాకవి బిరుదును, కలకత్తాలో జరిగిన జాతీయ సంస్కృత కవి పండిత సమ్మేళనంలో 'యుగకవి' బిరుదును పొందారు. జైపూర్‌లో బిర్లా ఫౌండేషన్ వారి వచస్పతి బిరుదును అందుకున్నారు. ఇంకా వశ్యవాక్, రాష్ట్రకవి తదితర బిరుదులను అందుకున్నారు. గవర్నర్ కృష్ణకాంత్ ద్వారా స్వర్ణ కంకణాన్ని, సాహిత్య పరిషత్ నుంచి క్రియేటివ్ సంస్కృట్ పోయెట్, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ సంస్కృత స్కాలర్ లాంటి పురస్కారాలు అందుకున్నారు.

శ్రీభాష్యం విజయసారథి 1978లో కాశీ వెళ్లారు. అక్కడ కరపత్ర స్వామి విజయసారథి ప్రతిభను, సాంస్కృత పాండిత్యాన్నీ గుర్తించి భారతీయ ప్రాచీన జ్యోతిష్య శాస్త్రం, వాస్తు శాస్త్రాలను పలువురు తమ స్వార్థానికి ఉపయోగిస్తున్నారని, వారికి భిన్నంగా ఆ శాస్త్రాలను అధ్యయనం చేసి స్వార్థరహితంగా ఉపయోగించమని శ్రీభాష్యానికి సూచించగా అందుకు ఆయన ఆ శాస్త్రాలను అధ్యయనం చేయడం ప్రారంభించారు. అనంతరం నేపాల్‌లో పశుపతనాథ శాస్త్రి సూచనల మేరకు సర్వ వైదిక సంస్థానాన్ని ఏర్పాటుచేసి భారతీయ సంస్కృతిని భద్రపరుస్తూ విశేష ప్రచారానికి పూనుకున్నారు. అందులో భాగంగానే మానేరు నదీతీరాన కరీంనగర్‌లో బొమ్మకల్ రోడ్డులో యజ్ఞవరాహ క్షేత్రాన్ని ఏర్పాటుచేసి గత ముప్పై ఏళ్లుగా విశేషకృషి చేస్తున్నారు. వేదాల్లోని మౌలిక జ్ఞానాన్ని ప్రాచుర్యంలోకి తెస్తున్నారు. వరాహ క్షేత్రంలో వరాహస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలను ఏర్పాటుచేసి ఏటా బ్రహ్మోత్సవాలతోపాటు సెమినార్లు, ప్రచురణలు నిర్వహిస్తున్నారు.

హేతువాద, అభ్యుదయ భావాల అనంతరం ఇవ్వాళ తాను మానవతావాదానికి కట్టుబడి ఉన్నారు. మనుషులు ఆనందం పొందడానికి అనేక దారులున్నాయని అందులో భారతీయ సాహిత్యం సంస్కృతి ప్రధానమైన రహదారి అని ఆయన వివరిస్తున్నారు. హింస లేని సౌభ్రాతృత్వం కలిగిన సమాజం ఏర్పడాలని చెబుతున్నారు. తెలంగాణ ప్రాంతం గొప్ప చారిత్రక సాంస్కృతిక చరిత్ర కలిగిన ప్రాంతమని ఇక్కడ ప్రతిభావంతులైన వాళ్ళు ఎంతోమంది ఉన్నారంటారు. ప్రాచుర్యం ప్రోత్సాహం లేక తెలంగాణ సృజనాత్మక ప్రతిభ ఎల్లలు దాటలేదంటారు. 2008లో శాతవాహన కళోత్సవాల్లో కరీంనగర్ జిల్లా ప్రాశస్త్యం గురించి పుస్తకం రాసిన ఆయన తన 82ఏళ్ల వయస్సులో ఇంకా సృజన చేస్తూనే ఉన్నారు. తెలంగాణ సంస్కృత వాచస్పతి శ్రీ భాష్యం విజయ సారథి.

(స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీభాష్యం విజయసారథికి రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట సాహిత్య పురస్కారం అందజేస్తున్న సందర్భంగా..)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కోర్టుల్లో సీసీటీవీ కెమెరాలు

- న్యాయవిచారణలో పారదర్శకత కోసం ఏర్పాటు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న కోర్టులు, ట్రిబ్యునళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. కోర్టుల్లో పలికే ప్రతిపదాన్ని రికార్డు చేయాలని, న్యాయ విచారణ ప్రక్రియలో పారదర్శకతకు ఈ చర్య ఎంతో అవసరమని జస్టిస్‌లు ఆదర్శ్ కే గోయెల్, ఉదయ్ యూ లలిత్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. కోర్టు గదులతోపాటు, ప్రాంగణాల్లో కూడా కెమెరాలు పెట్టాలని తెలిపింది. వాస్తవానికి సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను సుప్రీంకోర్టు గత మార్చిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఇప్పుడు దేశం అంతటికీ విస్తరించాలని తలపెట్టింది. మొదట కేవలం వీడియా రికార్డింగ్ మాత్రమే చేయించినా, ఇకపై ఆడియో కూడా అవసరమేనని తెలిపింది. ఇందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించి వీలైనంత త్వరగా కెమెరాలను ఏర్పాటు చేయాలని హైకోర్టులకు నిర్దేశించింది. కెమెరాల ధరలు, వాటి నాణ్యతాప్రమాణాల గురించి నెలలోగా తెలియజేయాలని కేంద్రన్యాయ, ఐటీ మంత్రిత్వశాఖలకు సూచించింది. అయితే హైకోర్టు అనుమతి లేకుండా ఎవరూ విచారణ దృశ్యాలను రికార్డు చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి రికార్డింగులను నిర్ణీత గడువు తరువాత తొలిగించాలని, వాటిని ఇతరులకు ఇవ్వరాదని పేర్కొన్నది. న్యాయ ప్రక్రియల్లో పారదర్శకత, మెరుగైన నిర్వహణ కోసం విచారణల రికార్డింగ్ విషయమై 2013 ఆగస్టు నుంచి కేంద్ర న్యాయశాఖ మంత్రులు కనీసం మూడుసార్లు భారత ప్రధానన్యాయమూర్తులకు లేఖలు రాశారు. ఈ అంశంపై పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కూడా దాఖలయ్యాయి. లా కమిషన్ సైతం సిఫారసు చేసినా సుప్రీంకోర్టు మొదట అంగీకరించలేదు. విస్తృత సంప్రదింపుల తరువాత ఈ నిర్ణయానికి అంగీకరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ముద్దులొలికిన వెన్న దొంగలు



కృష్ణాష్టమి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లో చిన్నికృష్ణుడి వేషధారణలో అలరించిన పిల్లలు

తెలుగులో గూగుల్ వాయిస్ సెర్చ్

న్యూఢిల్లీ: గూగుల్ సెర్చ్‌లో తెలుగులో మాట్లాడే అవకాశాన్ని ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులకు కల్పిస్తున్నట్లు గూగుల్ సంస్థ సోమవారం వెల్లడించింది. తెలుగుతో సహా ఎనిమిది భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు తెలుగు, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మలయాళం, తమిళం, ఉర్దూ భాషల్లో మాటల ఆధారంగా సెర్చ్ చేయొచ్చు. ఇప్పటివరకు ఈ అవకాశం హిందీ, ఇంగ్లిష్ భాషలకు మాత్రమే ఉండేది. ప్రస్తుతం దీనిని మరో 8 భారతీయ భాషలకు విస్తరించారు. ఆయా భాషలకు చెందిన ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్‌లోని జీబోర్డ్ లేదా గూగుల్ యాప్ ద్వారా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని గూగుల్ పేర్కొంది. తద్వారా భారతీయులు తమకు అనుకూలంగా ఉన్న భాషలోనే ఇంటర్నెట్‌తో అనుసంధానం కావొచ్చని తెలిపింది. ఈ సౌకర్యం ద్వారా కీబోర్డుపై టైప్ చేయకుండానే తమకు కావాల్సిన సమాచారం అత్యంత సులభంగా పొందొచ్చని వివరించింది. వినియోగదారులు వాయిస్ సెర్చ్ సౌకర్యాన్ని ఎంచుకోవాలని వినియోగించుకునేందుకు గూగుల్ యాప్‌లోని వాయిస్ సెట్టింగ్స్‌లో వారి భాషను ఎన్నుకోవాలని చెప్పింది. 'ప్రపంచవ్యాప్తంగా 119 భాషలకు వాయిస్ సెర్చ్ అవకాశం ఉన్నది. ప్రస్తుతం మరో 30 భాషలకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. ఇందులో 8 భారతీయ భాషలు కూడా ఉన్నాయి. వాయిస్ సెర్చ్ చేసేందుకు ఆండ్రాయిడ్ ఫోన్ల స్క్రీన్‌పై కనిపించే మైక్రోఫోన్ గుర్తును తాకితే సరిపోతుంది' అని గూగుల్ టెక్నికల్ ప్రోగ్రాం మేనేజర్ డాన్ వాన్ ఎస్చ్ తెలిపారు.

పంద్రాగస్టుకు పటిష్ఠ భద్రత

భద్రతావలయంలో రాజధాని



ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలో పలు అంచెల్లో పోలీసు, పారామిలిటరీ భద్రత ఏర్పాటయ్యింది. నగరంలోకి దారితీసే అన్ని రహదారులపై పోలీసు భద్రతను పెంచటంతోపాటు చెక్‌పోస్టులను నెలకొల్పారు. నిఘా విభాగం హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్ స్టేషన్లలో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. నగరంలోకి దారితీసే రహదారులపై నాలుగు రోజులుగా 24 గంటల నిఘా కొనసాగుతున్నది. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకావిష్కరణ చేసే ఎర్రకోట చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసు భద్రతతో పాటు సీసీటీవీ కెమెరాల నిఘా కొనసాగుతున్నది. ఢిల్లీకి వచ్చే విమానాలన్నింటిలో ప్రయాణికులను ఆయా విమానాశ్రయాల్లోనే మూడు దఫాలుగా తనిఖీ చేస్తున్నారు. ఢిల్లీ పోలీసు యంత్రాంగం మాత్రమే కాకుండా పారా మిలిటరీ బలగాలు, త్రివిధ దళాలకు చెందినవారు నిఘా విధుల్లో నిమగ్నమయ్యారు. ఎర్రకోట పరిసర ప్రాంతాలన్నింటినీ 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు. ఢిల్లీ నగరంలో అత్యంత వీఐపీ జోన్‌గా ఉన్న 'ల్యూటెన్స్ జోన్'లో భద్రత కట్టుదిట్టం చేశారు.

గతేడాది కంటే ఎక్కువగా..

గతేడాది కంటే పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేసిన కేంద్ర హోంశాఖ, ఢిల్లీ పోలీసు విభాగాలు ఈసారి అదనంగా 14 'పరాక్రమ్' వాహనాలను సిద్ధం చేశాయి. ఎలాంటి సంఘటన ఎదురైనా దీటుగా ఎదుర్కోవడానికి, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో నైపుణ్యం ఉన్న ప్రత్యేక దళాలను సిద్ధం చేశారు.ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


రాకపోకలపై నిషేధం

జాతీయ పతాకాన్ని ఎర్రకోటపై ప్రధాని ఆవిష్కరించే కార్యక్రమానికి కొన్ని గంటల ముందు నుంచే పలు మార్గాల్లో వాహనాల రాకపోకలను ఢిల్లీ పోలీసులు నిషేధించారు, ఇంద్రప్రస్థ, మండీహౌజ్ మెట్రో మార్గంలో పతాకావిష్కరణ, ఆ తర్వాత జరిగే కవాతును దృష్టిలో పెట్టుకుని రైలు సర్వీసులపై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆంక్షలు విధించారు. ఎర్రకోటలో ప్రధాని ప్రసంగం తర్వాత జాతీయ గీతాలాపన కోసం 3000 మంది బాలికలు, 5500 మంది బాలురతో పాటు ఢిల్లీ నగరంలోని పలు విద్యా సంస్థల్లోని ఎన్‌సీసీ విద్యార్థుల్ని నిర్వాహకులు సమీకరించారు. వీరంతా వివిధ భాషల్లో జాతీయగీతాన్ని బృందగానం చేయనున్నారు.

నవభారతానికి ప్రతినబూనుదాం

న్యూఢిల్లీ, ఆగస్టు 14:

- 2022నాటికి సరికొత్త భారత్ ఆవిష్కృతం కావాలి
- ప్రభుత్వ సంకల్పానికి ప్రజల భాగస్వామ్యమూ తోడవ్వాలి
- జీఎస్టీని ప్రజలు సంతోషంగా అంగీకరించారు
- నోట్లరద్దును అపారమైన సహనంతో అర్థం చేసుకున్నారు
- 71వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి కోవింద్



పేదరికానికి తావులేని నవభారతాన్ని నిర్మిద్దామని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. అందుకు ప్రభుత్వాల సంకల్పం ఒక్కటే సరిపోదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. జాతి మూలాల్లోని కరుణ, మానవతను కాపాడుకుంటూనే 2022నాటికి నవభారతాన్ని తయారు చేయాలని పిలుపునిచ్చారు. 71వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన సోమవారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారి త్యాగాలు వెలకట్టలేనివని, మహనీయుల త్యాగనిరతి చిరస్మరణీయమని కోవింద్ అన్నారు. జాతి ఘన వారసత్వాన్ని జవహర్‌లాల్ నెహ్రూ మనందరికి చేరువ చేశారని చెప్పారు. సర్దార్ పటేల్ జాతిని ఏకం చేశారని, దేశ ఐక్యత ఆవశ్యకతను చాటిచెప్పారని ఆయన తెలిపారు. గాంధీజీ నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, ఆ మహనీయుల స్ఫూర్తిని ప్రేరణగా తీసుకొని మరింత ముందుకెళ్లాలని రాష్ట్రపతి సూచించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని పుణికిపుచ్చుకొని వినూత్న రాజకీయ, సామాజిక ఆలోచనలతో నవభారత నిర్మాణానికి యువత సిద్ధంకావాలని కోరారు. 'విధానం-ఆచరణల్లోని నైతికత, ఐక్యత-క్రమశిక్షణపై నమ్మకం, వారసత్వ విలువలు-శాస్త్రజ్ఞానంపై విశ్వాసం, చట్టాల అమలు-విద్యకు ప్రోత్సాహం.. ఇవన్నీ ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంలోనే నిలదొక్కుకుంటాయి. ప్రభుత్వానికీ ప్రజలకూ మధ్య, వ్యక్తికీ సమాజానికీ మధ్య, కుటుంబానికీ వర్గానికీ మధ్య భాగస్వామ్యంతోనే నవీన భారతం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. చట్టాలను రూపొందించి అమలు పరచడం, వాటిని బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ఆ చట్టాలకు లోబడి ఉండటం ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలని అన్నారు. పన్నులు చెల్లించడాన్ని ప్రతి ఒక్కరూ తమ విధిగా గుర్తెరగాలని సూచించారు. ముఖ్యమైన లక్ష్యాలతో నవభారతాన్ని నిర్మించుకునేందుకు ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. జీఎస్టీని దేశ ప్రజలు సంతోషంగా అంగీకరించడం ఆనందదాయకమని అన్నారు. పెద్దనోట్ల రద్దు తర్వాత దేశ ప్రజలు అపారమైన సహనశీలతను ప్రదర్శించారని, నల్లధనం నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలకు సంపూర్ణ మద్దతు పలికారని రాష్ట్రపతి తెలిపారు. దివ్యాంగులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛభారత్‌తో దేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని కోవింద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో కోటి కుటుంబాలకుపైగా స్వచ్ఛందంగా గ్యాస్ సబ్సిడీని వదులుకునేందుకు ముందుకు రావడంతో వంటగ్యాస్‌ను దేశంలోని అనేక వంటగదులకు చేరువ చేయగలిగామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరేలా కలసికట్టుగా పనిచేయాలని కోరారు. '2022లో దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోనున్నది. అప్పటికల్లా నవభారత్‌ను ఆవిష్కరించుకునేలా చేరుకోవాల్సిన లక్ష్యాలను అందరం నిర్దేశించుకోవాలి' అని కోవింద్ కోరారు. నిజాయితీ గల సమాజాన్ని తయారుచేసుకోవాలని కాంక్షించారు. సహచర భారతీయులకు సహాయపడేలా ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలని, కనీసం ఒక పిల్లవాడిని చదివించడంలో, వారి ఫీజులు చెల్లించడంలో, పుస్తకాలు కొనుగోలులో సహాయపడాలని ప్రజల్ని కోరారు.

ఐదుగురికి కీర్తిచక్ర

17మందికి శౌర్యచక్ర ప్రకటించిన ప్రభుత్వం • 112మందికి రాష్ట్రపతి గ్యాలెంట్రీ పురస్కారాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14: శాంతిభద్రతలకు సంబంధించి ప్రదానం చేసే రెండవ అత్యున్నత పురస్కారం కీర్తిచక్రను 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐదుగురికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో 17 శౌర్యచక్ర, 85 సేవా పతకాలు, 3 నవ్‌సేన, 2 వాయుసేన పతకాలను ప్రకటించింది. సాయుధ, పారామిలిటరీ బలగాల సిబ్బందికి 112 గ్యాలెంట్రీ అవార్డులు ఇచ్చేందుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. దేశ అత్యున్న గ్యాలెంట్రీ పురస్కారం అశోక్‌చక్రకు ఈసారి ఎవరినీ ఎంపిక చేయలేదు.

కేంద్రం కీర్తిచక్ర పురస్కారాలు ప్రకటించిన ఐదుగురిలో ముగ్గురు మరణానంతరం ఎంపికైయారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన హవల్దార్ గిరీస్ గురుంగ్ (గూర్ఖా రైఫిల్స్), మేజర్ డేవిడ్ మాన్లున్ (నాగా రెజిమెంట్), ప్రమోద్‌కుమార్ (సీఆర్‌పీఎఫ్ 49బెటాలియన్)లకు కీర్తిచక్ర ప్రకటించారు. మే20న కశ్మీర్‌లోని కుప్వారాలో జరిగిన ఉగ్రవాదుల్ని ఏరివేసే ఆపరేషన్‌లో హవల్దార్ గురుంగ్ అమరుడయ్యారు. తీవ్రంగా గాయపడి ప్రాణాలు పోతున్న తరుణంలోనూ ఓ ఉగ్రవాదిని కాల్చిచంపిన అసమాన సాహసి ఆయన. ఇక జూన్6న నాగాలాండ్‌లోని మాన్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మేజర్ మాన్లున్ నేలకొరిగాడు. వీరుకాకుండా మేజర్ ప్రీతమ్‌సింగ్ కున్వర్ (గర్వాల్ రైఫిల్స్), చేతన్‌కుమార్ చీటా (సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారి)కూ కీర్తిచక్ర ప్రదానం చేయనున్నారు. మే25న ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరోచితంగాపోరాడిన మేజర్ ప్రీతమ్‌సింగ్ కున్వర్ ముగ్గురు కరడుగట్టిన ఉగ్రవాదుల్ని హతమార్చారు. చేతన్‌కుమార్ చీటా ఈ ఏడాది ప్రారంభంలో కశ్మీర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో బుల్లెట్ గాయాలై, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆయనిప్పటికీ కోమాలోనే ఉన్నారు. భారత వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్లు సుభాష్ సింగ్‌రావ్, రవీందర్ అహ్లావట్‌లకు వాయుసేన పురస్కారాలను ప్రకటించారు. భారత నౌకాదళానికి చెందిన ముగ్గురు పుష్పేంద్ర త్యాగి, జస్కరణ్‌సింగ్, అజార్ అజారుద్దీన్‌లకు ప్రభుత్వం నౌసేనా అవార్డులను ప్రకటించింది. ఇక భారత తీర గస్తీ దళానికి సంబంధించిన పురస్కారాలకూ రాష్ట్రపతి కోవింద్ ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి తత్రక్షక్ మెడల్‌కు ఒకరిని, తత్రక్షక్ గ్యాలెంట్రీ పురస్కారానికి నలుగురిని, తత్రక్షక్ విశిష్ట సేవాపురస్కారానికి ఇద్దరిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇక రాష్ట్రపతి పోలీస్ మెడల్స్‌కు ఎంపికైన వారిలో 29మంది కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్)కు చెందిన అధికారులు ఉన్నారు.



ప్రభుత్వం కీర్తిచక్ర పురస్కారం ప్రకటించిన మేజర్ డేవిడ్ మాన్లున్

మోదీని కలిసిన పన్నీర్ సెల్వం

- అన్నాడీఎంకే చీలిక గ్రూపుల విలీనం దిశగా అడుగులు
- పార్టీ అంతర్గత విషయాల్లో ప్రధాని జోక్యం లేదు : మైత్రేయన్



న్యూఢిల్లీ: అన్నాడీఎంకే వర్గాల విలీనం దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ప్రధాని నరేంద్ర మోదీని సోమవారంనాడు ఢిల్లీలో కలుసుకున్నారు. పార్టీలో విలీన ప్రక్రియ, తమిళనాట రాజకీయ సంక్షోభ నివారణపై వారు చర్చించినట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే రెండు గ్రూపులుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఒక వర్గం, మాజీ సీఎం పన్నీర్ సెల్వం నేతృత్వంలో మరో వర్గం కొనసాగుతున్నాయి. పార్టీలోని రెండు గ్రూపులూ విలీనమై.. మున్ముందు ఎన్డీయేకు అన్నాడీఎంకే మద్దతుగా నిలిచేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్‌ను వ్యతిరేకిస్తున్న ఈ రెండు గ్రూపులు ఏకంకావడం ద్వారా పార్టీ నాయకత్వాన్ని తామే నిర్ణయించుకునేందుకు సిద్ధమయ్యాయి. బీజేపీ మధ్యవర్తిత్వం నెరుపుతున్న ఈ వ్యవహారంలో నిజంగానే రెండు గ్రూపులు ఏకమైతే.. పళనిస్వామి ముఖ్యమంత్రిగానే కొనసాగనుండగా, పన్నీర్ సెల్వానికి ఉపముఖ్యమంత్రి పదవి దక్కనుందని ప్రచారం జరుగుతున్నది. తనకు మద్దతిస్తున్నట్లు చెప్తున్న 16మంది ఎమ్మెల్యేలను దినకరన్ లాగేస్తే తమిళనాడు అన్నాడీఎంకే గ్రూపుల విలీనం జరుగకపోవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పన్నీర్ సెల్వం అరగంటకుపైగా ప్రధానితో సమావేశమయ్యారు. పన్నీర్ వెంట రాజ్యసభ ఎంపీ వీ మైత్రేయన్, మాజీ మంత్రి కేపీ మునుస్వామి, రాజ్యసభ మాజీ సభ్యుడు మనోజ్ పాండ్యన్ కూడా ఉన్నారు. కాగా, ఏఐడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో ప్రధాని మోదీ జోక్యం చేసుకుంటున్నారన్న వార్తలను మైత్రేయన్ కొట్టివేశారు. 'మరో పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ప్రధాని జోక్యం చేసుకుంటున్నారనడం అర్థరహిత ప్రచారమే' అని మైత్రేయన్ చెప్పారు.

దేశం విడిచి వెళ్లొద్దు

కార్తి చిదంబరానికి సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, ఆగస్టు 14: కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం దేశం విడిచి వెళ్లకుండా సీబీఐ జారీ చేసిన 'లుక్‌అవుట్' నోటీసులను సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. అంతకుముందు లుక్‌అవుట్ నోటీసులపై మద్రాస్ హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులను రద్దు చేసింది. విదేశీ పెట్టుబడులకు సంబంధించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సీబీఐ కార్తి చిదంబరంతోపాటు మరికొంత మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కార్తి విచారణకు హాజరుకాకపోవడంతో సీబీఐ లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసింది. దీంతో ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం సీబీఐ వాదనను సమర్థించడంతోపాటు కార్తి చిదంబరం సహా ఇతరులు దేశం విడిచి వెళ్లకూడదని నోటీసులు జారీ చేసింది. కార్తి సీబీఐ విచారణకు హాజరుకాకపోవడంతోపాటు ఎటువంటి ముందస్తు బెయిల్ కోరలేదని ధర్మాసనం పేర్కొంది.

అక్రమ నివాసితుల జాడ కనిపెట్టండి

- రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 14: భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న మయన్మార్‌దేశానికి చెందిన రోహింగ్యా ముస్లింల వంటి వారి జాడ కనిపెట్టి వారి దేశాలకు పంపించాలని కేంద్రహోంమంత్రిత్వశాఖ రాష్ట్రాలకు సూచించింది. రాజకీయ పరిస్థితులు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలవల్ల పొరుగుదేశాలకు చెందినవారు ఇండియాలోకి అనుమతి లేకుండా ప్రవేశిస్తున్నారని, వారిని ఇండియన్ ముజాహిదీన్, లష్కరే తాయిబా వంటి సంస్థలు ఉగ్రవాదులుగా మార్చుతున్నామని తెలిపింది. అక్రమ చొరబాటుదారుల వల్ల భారతీయుల హక్కులకు భంగంవాటిల్లడమే గాకుండా, దేశానికి భద్రతాపరమైన సమస్యలు కూడా ఎదురవుతున్నాయని కేంద్రం హెచ్చరిస్తూ ఈ నెల 8న రాష్ట్రాలకు వర్తమానం పంపించింది. అటువంటి వారిని గుర్తించి వెనుకకు పంపించడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక దళాలను ఏర్పాటుచేయాలని హోంశాఖ సలహా ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్ లెక్కల ప్రకారం దాదాపు 14 వేల మంది రోహింగ్యాలు మన దేశంలో శరణార్థులుగా ఉన్నారని హోంశాఖ సహాయమంత్రి కిరన్ రిజిజు గతవారం పార్లమెంటుకు తెలిపారు.

గోరఖ్‌పూర్ విషాదంపై విచారణకు సుప్రీం నో



న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రభుత్వ దవాఖానలో పెద్ద సంఖ్యలో పసిపిల్లలు మరణిస్తున్న ఉదంతంపై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ఓ న్యాయవాది ప్రస్తావించినప్పుడు, మీ సమస్యపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లండి అని వ్యాఖ్యానించింది. గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ దవాఖానలో 70 మందికి పైగా బాలలు మరణించడంపై దర్యాప్తుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని కూడా సదరు న్యాయవాది కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, అక్కడి పరిస్థితిని ఇప్పటికే అధికారులు పర్యవేక్షిస్తున్నారని, ఏమైనా సమస్యలుంటే సంబంధిత హైకోర్టును సంప్రదించాలని సూచించింది.

ఆర్టికల్ 35ఏపై విస్తృత ధర్మాసనం విచారణ?

న్యూఢిల్లీ, ఆగస్టు 14: జమ్ముకశ్మీర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక హక్కులను కల్పించే ఆర్టికల్ 35ఏ వివాదాస్పదమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆర్టికల్ 35ఏ మౌలిక నిర్మాణ సూత్రాలను ఉల్లంఘిస్తున్నదా, లింగ వివక్షతో కూడినదా అన్న అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆర్టికల్ 35ఏను రాజ్యాంగంలో చేర్చారు. జమ్ముకశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులను కల్పిస్తున్న ఈ అధికరణం రాష్ట్రానికి చెందిన మహిళ రాష్ట్రేతర వ్యక్తిని పెండ్లి చేసుకుంటే ఆమెకు ఆస్తి హక్కును నిరాకరిస్తుంది. ఈ నేపథ్యంలో ఆ అధికరణం రాజ్యాంగ మౌలిక నిర్మాణ సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పరిశీలిస్తుందని తెలిపింది.

హీరోనే బలిపశువా?

- గోరఖ్‌పూర్ ఘటనలో డాక్టర్ కఫీల్‌పై చర్యల వెనుక మర్మం
- ప్రజల దృష్టి మళ్లించేందుకేనని అనుమానం
- ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై విమర్శలు
- మరో ఆరుగురు చిన్నారుల మృతి



గోరఖ్‌పూర్ దవాఖానలో మృతిచెందిన చిన్నారిని తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు



డాక్టర్ కఫీల్ అహ్మద్

గోరఖ్‌పూర్/న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో జరిగిన దుర్ఘటనలో పిల్లల విభాగం అధిపతి డాక్టర్ కఫీల్ అహ్మద్‌ను రాష్ట్ర ప్రభుత్వం విధుల నుంచి తొలిగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆయన్ను బలిపశువును చేశారని డాక్టర్లు, వైద్యసిబ్బంది ఆరోపిస్తున్నారు. బీఆర్‌డీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో ఆక్సిజన్ అందక చిన్నారులు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే వారిని కాపాడేందుకు డాక్టర్ కఫీల్ అహ్మద్ శాయశక్తులా ప్రయత్నించి ప్రజలందరి దృష్టిలో హీరోగా మారారు. ఆయన సొంత డబ్బు ఖర్చుపెట్టి, తీవ్రంగా శ్రమించి ప్రైవేట్ హాస్పిటళ్లు, తెలిసిన డాక్టర్ల వద్ద నుంచి ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులను బతికించేందుకు ఆయన చేసిన కృషిని పిల్లల తల్లిదండ్రులు, హాస్పిటల్ సిబ్బంది వేనోళ్లా పొగుడుతున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రాష్ట్రప్రభుత్వం అతడిని విధుల నుంచి తప్పించింది. ఇందుకు ప్రభుత్వం నిర్దిష్ట కారణాలేవీ చెప్పడం లేదు. వైద్యవిద్య డైరెక్టర్ జనరల్ కేకే గుప్తా మాత్రం డాక్టర్ కఫీల్ అహ్మద్ సొంతగా ప్రైవేట్ హాస్పిటల్ నడుపుతున్నారని, అక్కడి నుంచే ఆక్సిజన్ సిలిండర్లను తెచ్చారని ఆరోపించారు. అయితే ప్రభుత్వ వాదన తప్పు అని చెప్పడంతోపాటు, డాక్టర్ కఫీల్ చేసిన కృషిని వివరించే పక్కా ఆధారాలు బయటికి వచ్చాయి. 10వ తేదీన ఆయన సిలిండర్లను సేకరించేందుకు సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) సహాయం తీసుకున్నారని తేలింది. ఎస్ఎస్‌బీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఓపీ సాహు తెలిపిన వివరాల మేరకు.. ఆగస్టు 10వ తేదీన డాక్టర్ కఫీల్ ఎస్ఎస్‌బీ డీఐజీని కలిశారు. పరిస్థితిని వివరించి వివిధ హాస్పిటళ్ల నుంచి ఆక్సిజన్ సిలిండర్లను సేకరించడానికి ట్రక్ కావాలని కోరారు. దీంతో డీఐజీ స్పందించి ఓ ట్రక్‌తోపాటు మెడికల్ వింగ్‌కు చెందిన 11 జవాన్లను సహాయం కోసం పంపించారు. వారు ట్రక్‌లో నాలుగు గంటలపాటు నగరంలో తిరిగి పలు హాస్పిటళ్ల నుంచి ఆక్సిజన్ సిలిండర్లు సేకరించారు. హాస్పిటల్ కొనుగోలు కమిటీలో ఆయన సభ్యుడు కాకపోయినప్పటికీ పసిప్రాణాలు రక్షించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయినా అకారణంగా యోగి ప్రభుత్వం డాక్టర్ కఫీల్‌ను బలిపశువును చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ డాక్టర్లు.. ప్రైవేట్ దవాఖానలు..

గోరఖ్‌పూర్ ఘటనలో డాక్టర్ కఫీల్‌ను విధుల నుంచి తొలిగించేందుకు ప్రభుత్వం చూపించిన ప్రధాన కారణం.. 'ఆయన ప్రైవేట్ హాస్పిటల్‌ను నడుపుతున్నారు'. అయితే బీఆర్‌డీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న డాక్టర్లందరూ సొంతంగా ప్రైవేట్ హాస్పిటల్ నడుపుతున్నారని, కొందరు మరో అడుగు ముందుకేసి రెండు మూడు దవాఖానలకు కన్సల్టెంట్లుగా పనిచేస్తున్నారని తేలింది. ముఖ్యంగా డాక్టర్ల కోసం కేటాయించిన క్వార్టర్లన్నీ మినీ క్లినిక్‌లుగా చెలామణి అవుతుండగా, ఒక్కో క్వార్టర్ ముందు దర్జాగా బోర్డులు పెట్టేసుకున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. బీఆర్‌డీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కే మిశ్రా ఏకంగా క్యాంపస్‌లోనే ప్రైవేట్ దవాఖాన నడుపుతూ, శ్రీరాం పాథాలజీ సెంటర్‌లో భాగస్వామిగా ఉన్నారు. డాక్టర్ మిశ్రా క్వార్టర్ పక్కనే ఉండే డాక్టర్ లలిత్ మోహన్ ఇంటి ముందు ఏకంగా ఐదు బోర్డులు కనిపిస్తాయి. ఆయనతోపాటు భార్య రేణుమోహన్, వారి కొడుకు డాక్టర్ ఎస్ మోహన్, మరో ఇద్దరు డాక్టర్లు ప్రైవేట్‌గా వైద్యం చేస్తున్నారు. డాక్టర్ మోహన్ కుటుంబం మొత్తం బీఆర్‌డీ మెడికల్ కాలేజ్ ఉద్యోగులే కావడం గమనార్హం.

మరో ఆరుగురు చిన్నారుల మృతి

గోరఖ్‌పూర్ బీఆర్‌డీ దవాఖానలో పిల్లల మరణాలు ఆగడంలేదు. మంగళవారం పిల్లల వైద్యవిభాగంలో మెదడువాపు చికిత్స పొందుతున్న ఆరుగురు చిన్నారులు మృతిచెందారు.

ఎన్‌హెచ్చార్సీ సీరియస్

గోరఖ్‌పూర్ దుర్ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. చిన్నారుల మృతిపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా కేసును సుమోటోగా తీసుకున్నది. వివరణ ఇవ్వాలంటూ యూపీ ప్రభుత్వానికి సోమవారం నోటీసులు జారీ చేసింది. ఘటనకు గల కారణాలను, దుర్ఘటన తర్వాత తీసుకున్న చర్యలను పేర్కొంటూ పూర్తి వివరాలతో నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నిర్లక్ష్యం వల్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోవడమంటే వారి జీవించే హక్కును కాలరాయడమేనని అభిప్రాయపడింది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో గూడుకట్టిన కాఠిన్యతకు ఈ ఘటన అద్దం పడుతున్నదని వ్యాఖ్యానించింది.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడులు

జగిత్యాల, నమస్తే తెలంగాణ: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న ఇంట్లో లరహస్యంగా నిర్వహిస్తున్న హుక్కా కేంద్రంపై సోమవారం దాడి చేసి, హుక్కా సేవిస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ అనంతశర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అరవిందనగర్‌లో ఏవరూ లేని ఇంట్లో గత కొద్ది రోజులుగా యువకులు హుక్కా సేవిస్తున్నారని సమాచారం మేరకు టౌన్ ఎస్సై ప్రసాద్‌ను పంపించి హుక్కా సెంటర్‌ను గుర్తించామన్నారు. ఐదుగురు యువకులు హుక్కా సేవిస్తున్నారన్న సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరికి హుక్కాతో పాటు గంజాయి, డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందన్న అనుమానంతో వైద్య పరీక్షల నిమిత్తం దవాఖానకు తరలించినట్టు చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ – ఖమ్మం జిల్లా

ఫారం – C

నోటిఫికేషన్

(భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నం.21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు 10A మినహాయింపు అనుసరించి)

(రూల్ 6/12 చూడుము)

కలెక్టర్ ఫైల్ నెం.జి 1/2782/2017 — **తేది : 12.08.2017**
RDO/LAO KMM File No. C1/1812/2017 — **తేది : 10.08.2017**
GAZETTE No. 52/2017 — **తేది : 12.08.2017**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్ధిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలములోని బందంపల్లి, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, జల్లేపల్లి, హస్నాబాద్ మరియు హైదర్‌సాయిపేట గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.03.38 గు. ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్ట్ స్టేజి –11 క్రింద కాలువ నిర్మాణము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలములోని బందంపల్లి, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, జల్లేపల్లి, హస్నాబాద్ మరియు హైదర్‌సాయిపేట గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.03.38 గు. గల భూమి యొక్క వివరములు. ఈ క్రింద చూపిన వారి నుండి భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామము : బందంపల్లి — మండలము : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	32/ఇ1	పట్టా	మెట్ట	01.01	గుండాపుల్లయ్య, తండ్రి. లక్ష్మయ్య (ప) రామనబోయిన శ్రీరాములు తండ్రి. పెద్ద గురవయ్య (అ)	తూ.32/1 ద.182/1 ఉ.32/1 ప.32/1	లేవు
2	32/ఇ2	పట్టా	మెట్ట		గుండా వెంకటరెడ్డి, తండ్రి. లక్ష్మయ్య (ప) రామనబోయిన శ్రీరాములు తండ్రి. పెద్ద గురవయ్య (అ)	తూ.32/1 ద.182/1 ఉ.32/1 ప.32/1	లేవు
			మొత్తం	ఎ.1.01.గు			

గ్రామము : తిరుమలాయపాలెం — మండలము : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	243/ఆ 3	పట్టా	మెట్ట	0.00 3/4	ఇప్పలవెంకటయ్య, తండ్రి. సీతారామయ్య (ప) రామావత్ హర్జ, తండ్రి.బిక్య (అ)	తూ.243/1 ద. 243/1 ఉ. 243/1 ప. 243/1	లేవు
2	243/అ/1	పట్టా	మెట్ట	0.00 1/2	నేలపట్ల రమేష్ తండ్రి. అప్పయ్య (ప & అ)	తూ.243/1 ద. 243/1 ఉ.243/1 ప. 243/1	లేవు
3	243/ఆ/2	పట్టా	మెట్ట	0.02 1/4	దేవిశెట్టి వెంకటేశ్వర్లు, తండ్రి. పిచ్చయ్య (ప & అ)	తూ.243/1 ద. 243/1 ఉ. 243/1 ప. 243/1	లేవు
			మొత్తం	ఎ.0.03 1/2 గు			

గ్రామము : కొక్కిరేణి — మండలము : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	42/a1	పట్టా	మెట్ట	0.13	వూడుగు కొండలరావు తండ్రి.రామయ్య (ప&అ)	తూ.42/1 ద.42/1 ఉ.42/1 ప. 42/1	లేవు
			మొత్తం	ఎ.0.13గు			

గ్రామము : జల్లేపల్లి — మండలము : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	131/ఆ	పట్టా	మెట్ట	0.14	పోట్ల రాజయ్య, తండ్రి. రామయ్య (ప) బుద్ద వీరయ్య, తండ్రి. వెంకటేశ్వర్లు (అ)	తూ.131/1 ద.130 ఉ. 131/1 ప. 131/1	లేవు
2	131/ఆ/2	పట్టా	మెట్ట	0.08	పోట్ల నీలిమ, భర్త. వాసుదేవరావు (ప&అ)	తూ.131/1 ద. 130 ఉ. 131/1 ప. 131/1	లేవు
3	370as per SDR 371/ఇ as per pahani	పట్టా	మెట్ట	1.00	కేసా కొమరయ్య, తండ్రి. మల్లయ్య (ప & అ)	తూ.117 ద. 370/1 ఉ.370/1 ప. 370/1	లేవు
			మొత్తం	ఎ.1.22గు.			

గ్రామము : హస్నాబాద్ — మండలం : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	134/అ/5	సీలింగ్	మెట్ట	0.04	మూడు వెంకన్న తండ్రి : రేక్యా (ప) మూడు లచ్చిరాం తండ్రి : రేక్యా (అ)	తూ: 134/1 ద. 134/1 ఉ: 135/2 ప : 134/1	లేవు
2.	135/ఆ	సీలింగ్	మెట్ట	0.29 1/2	మూడు లచ్చిరాం తండ్రి : రేక్యా (ప & అ)	తూ: 135/1 ద. 135/1 ఉ: 135/2 ప : 135/1	లేవు
			మొత్తం	ఎ. 0.33 గు.			

గ్రామము : హైదర్‌సాయిపేట — మండలం : తిరుమలాయపాలెం — జిల్లా : ఖమ్మం

వరుస సం.	సర్వే నెంబర్	టైటిల్ రకము	భూమి రకము	భూసేకరణ చేయు విస్తీరణము	భూమి పట్టాదారు, అనుభవదారు, ఆసక్తిదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు	హద్దులు	ప్రదేశముపై ఉన్న చెట్లు, కట్టడములు ఇతరములు
1	241/అ2	పట్టా	మెట్ట	0.02	ఇస్లావత్ నామా తండ్రి : హచ్య (ప & అ)	తూ: 241/1 ద. 241/1 ఉ: 241/1 ప : 241/1	
2	240/ఇ/1	పట్టా	మెట్ట	0.03	భూక్యా నాన్య బాలు తండ్రి : హచ్య (ప & అ)	తూ: 240/1 ద. 240/1 ఉ: 240/1 ప : 240/1	
			మొత్తం	ఎ.0.05 గు.			

ఇట్టి ప్రకటన భూ సేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నం.21/2017) ద్వారా సవరించబడిన భూ సేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యాజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, ఖమ్మం మరియు భూ సేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలో తనికి చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, ఖమ్మం వారు, భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి ఖమ్మం వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్–12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, ఖమ్మం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు/అమ్మకాలు/తాకట్లకు మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్–(15) ప్రకారం జిల్లా కలెక్టర్, ఖమ్మం/ భూ సేకరణ అధికారి & రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవాల్సి యున్నది.

భూసేకరణ అధికారి / రెవిన్యూ డివిజనల్ అధికారి, ఖమ్మం. — జాయింట్ కలెక్టర్ ఖమ్మం జిల్లా — కలెక్టర్ ఖమ్మం జిల్లా

'కోటి' వైపు వడివడిగా..



నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

హెచ్‌ఎండీఏ పరిధిలో జోరుగా మూడో విడుత హరితహారం

50 లక్షల మొక్కలు నాటిన అధికారులు.. రేపటి నుంచి రంగంలోకి ప్రైవేట్ బృందాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణకు హరితహారంలో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టిన మూడో విడుత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. కోటీ 10 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా హెచ్‌ఎండీఏ అధికార యంత్రాంగం గత నెల 12వ తేదీన మూడో విడుత హరితహారానికి శ్రీకారం చుట్టింది. అన్ని విభాగాల అధికారులు చురుగ్గా పాల్గొంటూ మొక్కలు నాటే ప్రక్రియను వేగంగా కొనసాగిస్తున్నారు. సంస్థ పరిధిలో పచ్చదనాన్ని మరింత పెంపొందించాలన్న ఏకైక లక్ష్యంతో రంగంలోకి దిగిన అధికారులు సోమవారంనాటికి 50 లక్షల మొక్కలను నాటినట్టు హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలిపారు. అంటే దాదాపు నెల రోజుల్లోనే 50శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారన్నమాట. ఈ నెలాఖరునాటికి మరో 20 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విడుతలో ఔటర్‌పైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన వాతావరణంలో ప్రయాణం సాగేలా ఔటర్ చుట్టూ భారీగా మొక్కలు నాటుతున్నారు. మెయిన్ క్యారేజ్ వే (ఎంసీడబ్ల్యూ), రైల్వే కారిడార్, ఇంటర్ చేంజ్‌ల వద్ద, మీడియన్స్ ఇంటర్ చేంజ్స్, ఔటర్ మీడియన్స్/స్క్రబ్స్/గ్రౌండ్ కవర్స్/హెడ్జ్స్, సర్వీస్ రోడ్ వెంబడి విస్తృతంగా మొక్కలు నాటుతున్నారు.

రేపటి నుంచి ప్రైవేట్ బృందాలు

మూడో విడుత హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కమిషనర్ చిరంజీవులు ఈ ఏడాది అర్బన్ ఫారెస్ట్రీ అధికారులకు తోడు హెచ్‌ఎండీఏలోని అన్ని విభాగాల అధికారులను భాగస్వాములను చేశారు. ప్లానింగ్, ఫైనాన్స్, ఎస్టేట్, ఇంజినీరింగ్, ఔటర్ విభాగం ముఖ్య అధికారులను రంగంలోకి దింపారు. 158 కిలోమీటర్ల ఔటర్‌లో ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో అధికారికి దత్తత ఇచ్చారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించే బాధ్యతలను వారికి అదనంగా అప్పగించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు ఔటర్‌లో కలియదిరుగుతూ అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసే క్రమంలో తాజాగా ఎన్–ఫ్యానెల్‌మెంట్ సభ్యుల (ఔట్‌సోర్సింగ్ ఎజెన్సీ)ను రంగంలోకి దింపారు. ఔటర్‌లోని రైల్వే కారిడార్లలో మొక్క లు నాటడం, నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయించి ఈ మేరకు టెండర్లను ఆహ్వానించారు. 53 మంది ఎన్–ఫ్యానెల్‌మెంట్ సభ్యులు దరఖాస్తులు చేసుకోగా ఇందులో 34 మంది అర్హత సాధించారు. కమిషనర్ చిరంజీవులు సోమవారం అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏడీలు సత్యనారాయణ, మాధవరావు, ఎన్–ఫ్యానెల్‌మెంట్ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బుధవారం నుంచి రైల్వే కారిడార్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అర్బన్‌ఫారెస్ట్రీ అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడం, నిర్వహణలో హెచ్‌ఎండీఏకు తోడుగా ఔట్‌సోర్సింగ్ ఎజెన్సీలు రంగంలోకి దిగడంతో గడువులోగా హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేస్తామని అధికారవర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



పర్యావరణ పరిరక్షణలో భాగంగా వచ్చే ఏడాది నుంచి కుమ్మరి కులస్తులకు విగ్రహాల తయారీలో శిక్షణ అందించి, వారికి ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నగర మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. హైదరాబాద్ శివారులోని గండిపేట మండలం నార్సింగిలో దశాబ్దకాలంగా 'సేవ్' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి గణపతుల తయారీ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యేలు టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీతో కలిసి ఆయన సందర్శించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు.

- మణికొండ, నమస్తే తెలంగాణ

ఓడీఎఫ్ ప్రాథమిక నోటిఫికేషన్ సిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆగస్టు 15లోపు రాష్ట్రంలోని పట్టణాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్) పట్టణాలుగా తీర్చిదిద్దాలని మంత్రి కే తారకరామారావు ఆదేశించిన నేపథ్యంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులు ఈ కార్యక్రమంపై దృష్టి సారించారు. గత వారంరోజుల వ్యవధిలో జీహెచ్‌ఎంసీతో సహా 73 పట్టణ స్థానిక సంస్థలు.. ఓడీఎఫ్‌కు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేశాయి. తమ పట్టణాలు ఓడీఎఫ్ స్థాయికి చేరుకున్నాయని ప్రకటించాయి. స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం 15 రోజుల్లోగా అభ్యంతరాలు, సలహా లు, సూచనలను పట్టణ స్థానిక సంస్థలు ఆహ్వానించాయి. అంతాసవ్యంగా ఉం దనుకుంటే ఆయా మున్సిపాలిటీ లేదా నగర పంచాయతీని ఓడీఎఫ్‌గా గుర్తిస్తారు. ఎక్కడైనా పొరపాట్లుంటే మళ్లీ ఆయా ప్రాంతాల్లో కావాల్సిన పనులను చేపడుతారు. వెనుకబడిన కొన్ని పట్టణాల్లో ఈ పనిని సమర్థంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఒక్కో అధికారికి రెండు లేదా మూడు పట్టణాల్లో ఓడీఎఫ్ పనులను పూర్తి చేసే బాధ్యతను అప్పగించారు. కొంతకాలం ప్రతి పట్టణంలో ఓడీఎఫ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. స్కూళ్లు, కాలేజీ విద్యార్థుల నుంచి వ్యక్తిగత మరుగుదొడ్లపై వివరాలు సేకరించారు. ఉపాధ్యాయులను ఇందులో భాగస్వాములను చేశారు. ఆయా ప్రాంతాలకు చెందినవారు మరుగుదొడ్లను వినియోగిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తెలుసుకున్నారు. ప్రతివార్డులో స్వయం సహాయక బృందాలు, పొదుపు సంఘాలు ఓడీఎఫ్‌కు సంబంధించిన నివేదికలను రూపొందించా యి. రాష్ట్రంలోని 73పట్టణ స్థాని క సంస్థలు ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశాయి.

నగరం చుట్టూ మినీ టౌన్‌లు

- **గ్రోత్ కారిడార్‌కు ఇరువైపులా 5 కి.మీ. మేర సమగ్ర అధ్యయనం**
- **రేపటి నుంచి క్షేత్రస్థాయి సర్వే**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలు (మినీ టౌన్‌లు/టీవోజీసీ), టౌన్‌షిప్‌లు, పరిశ్రమలు, కంపెనీల ఏర్పాటే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించింది. ఔటర్ చుట్టూ ఉన్న గ్రోత్ కారిడార్‌కు ఇరువైపులా ఐదు కిలోమీటర్ల మేర భూ వినియోగంపై సమగ్ర నివేదిక అందజేయాలని సీఎం కేసీఆర్ ఇటీవల హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులును ఆదేశించారు. దీంతో 5కి.మీ. పరిధిలో భూమి కేటగిరి, వినియోగం, జోనింగ్ రెగ్యులరైజేషన్ (జోనింగ్ విధానం), భవిష్యత్‌లో అభివృద్ధికి అవకాశం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు బుధవారం నుంచి అధికారుల బృందాన్ని పంపాలని కమిషనర్ నిర్ణయించారు. పది రోజుల్లో సమగ్ర నివేదికను రూపొందించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

ల్యాండ్ పూలింగ్ స్కీం అమలుపై కసరత్తు

ఔటర్ రింగ్ రోడ్‌కు ఇరువైపులా కిలోమీటర్ వరకు అంటే 158 కి.మీ. ఔటర్ పొడవునా మొత్తం 316 చ.కి.మీల విస్తీర్ణాన్ని గతంలో గ్రోత్ కారిడార్‌గా నిర్ణయించారు. ఇప్పుడు ఈ గ్రోత్ కారిడార్‌ను అదనంగా మరికొన్ని కిలోమీటర్లు పెంచి మినీ టౌన్లను సృష్టించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా గ్రోత్ కారిడార్ పరిధిని పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ మేరకు గ్రోత్ కారిడార్‌కు ఇరువైపులా ఐదు కిలోమీటర్ల మేర భూ వినియోగంపై అధ్యయనం చేయనున్నారు. ఆ తర్వాత ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు సేకరించనున్నారు. నివేదిక అందిన తర్వాత శ్రీశైలం, సంగారెడ్డి, వరంగల్, శామీర్‌పేట (కీసర) వైపు 50 హెక్టార్లు.. ఆపైన భూములకు ఏకకాలంలో భూ సమీకరణ పథకం అమలు చేసే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. ఓవైపు ఔటర్ రింగ్ రోడ్‌కు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతాన్ని ప్రత్యేక ఆర్థిక మండళ్లుగా పరిగణిస్తుండడం, మరోవైపు గ్రోత్ కారిడార్ పరిధిని పెంచనుండడంతో భవిష్యత్‌లో ఔటర్ వేదికగా అభివృద్ధి కేంద్రీకృతం కానున్నదని హెచ్‌ఎండీఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

హత్యకేసుల్లో డీఎన్ఏ టెస్ట్ తప్పనిసరి

- **రక్తనమూనాలు, తలవెంట్రుకలు విధిగా సేకరించాలి**
- **తెలంగాణ, ఏపీ డీజీపీలకు ఉమ్మడి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హత్య, అనుమానాస్పద మృతి కేసుల్లో మృతదేహాల గుర్తింపు కోసం తప్పనిసరిగా డీఎన్ఏ పరీక్షలు చేయించాలని ఉమ్మడి హైకోర్టు పోలీసులను ఆదేశించింది. డీఎన్ఏ పరీక్ష నిమిత్తం మృతుల రక్తం, కణజాలాలు, తలవెంట్రుకలు తదితర నమూనాలను తప్పనిసరిగా సేకరించి భద్రపర్చేలా దర్యాప్తు అధికారులకు ఆదేశాలు జారీచేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల డీజీపీలకు హైకోర్టు సూచించింది. ఈ మేరకు తాము వెలువరిస్తున్న ఉత్తర్వులను ఇతర రాష్ట్రాల డీజీపీలకు అందజేయాలని హైకోర్టు రిజిస్ట్రీకి స్పష్టంచేసింది. మృతదేహాలను గుర్తించడా నికే కాకుండా ఇతర క్రిమినల్ కేసులైన లైంగికదాడులు, హత్యలు, కిడ్నాపింగ్, పిల్లల మార్పిడి, శిశు హత్య, పిల్లల విక్రయం, అబార్షన్లు, మాతృత్వ వివాదాలు, వలసలు, వారసత్వం తదితర కేసుల్లో శాస్త్రీయమైన దర్యాప్తు కోసం డీఎన్ఏ పరీక్ష ఉపయోగపడుతుందని పేర్కొన్నది. ప్రత్యక్ష సాక్షులు లేని క్రిమినల్ కేసుల్లో ఘటనాస్థలంలో లభించిన ఆధారాలను బట్టి నిందితులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్ష సహాయపడుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. పాత వరంగల్ జిల్లా కొమురవెల్లికి చెందిన బీ లక్ష్మి అనే మహిళ హత్య కేసు విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. లక్ష్మిని ఆమె అల్లుడు వ్యవసాయ బావిలోకి తోసి హత్య చేసినట్టు అభియోగాలున్నాయి. దిగువ కోర్టు అతడికి జీవితఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశాడు. కాగా, బావిలో లభించిన మృతదేహం లక్ష్మిదేనని ఆమె కుమార్తె, సోదరుడు సైతం గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని, ఇలాంటి పరిస్థితుల్లో తగిన సాక్షాధారాలు లేనందు వల్ల నిందితుడిని నేరస్థుడిగా ప్రకటించలేమని హైకోర్టు పేర్కొన్నది. నిందితుడు శ్రీనివాసరెడ్డికి కింది కోర్టు విధించిన జీవితఖైదును రద్దు చేసింది.


అక్రమంగా విదేశీ సిగరెట్ల అమ్మకం

ఇద్దరి అరెస్ట్.. రూ.19.2 లక్షల సరుకు సీజ్

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: విదేశాలకు చెందిన సిగరెట్లను నగరంలో అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, రూ.19.2 లక్షల విలువైన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో డీసీపీ లింబారెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బేగంబజార్‌కు చెందిన మహ్మద్ హస్నుద్దీన్ 'ఎస్ఎస్ కిరాణషాపు'ను నిర్వహిస్తున్నాడు. అతడు బంగ్లాదేశ్ నుంచి ఫారిన్ సిగరెట్లను అక్రమంగా తెప్పించి చార్మినార్ నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన అజాజ్ అలీ(42), డబీర్‌పురా మిరాలం మండికి చెందిన ఆటోడ్రైవర్ అలీరాజా(48) సహాయంతో ఇతర వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. సోమవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన 48 వేల ఫారిన్ సిగరెట్ల ప్యాకెట్లను వీరిద్దరూ తీసుకొని ఆటోలో తరలిస్తుండగా వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అజాజ్‌అలీ, అలీరాజాను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు హస్నుద్దీన్ పరారీలో ఉన్నాడు. విదేశాల్లో అమ్మకాలు నిలిపివేసిన సిగరెట్లను హస్నుద్దీన్ బంగ్లాదేశ్ నుంచి కలకత్తా మీదుగా హైదరాబాద్‌కు రైళ్లలో తెప్పిస్తుండగా, అజాజ్‌అలీ, అలీరాజా వాటిని తరలిస్తుంటారు. హస్నుద్దీన్ ఒక్కో ప్యాకెట్‌ను రూ.20 చొప్పున అజాజ్‌అలీ, అలీరాజాకు విక్రయిస్తుండగా, వారు వ్యాపారులకు రూ.30 చొప్పున అందజేస్తారు. వ్యాపారులు రూ.40 చొప్పున వినియోగదారులకు అమ్ముతుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి కస్టమ్స్ డ్యూటీ, జీఎస్టీని చెల్లించకుండా ఎగ్గొడుతున్నారు. ఈ సిగరెట్లలో వాడే పొగాకు నాణ్యమైనది కాకపోవడంతో వినియోగదారులకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్సై మల్లికార్జున్, కానిస్టేబుల్ సత్యనారాయణను డీసీపీ అభినందించారు. వారికి రివార్డు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్ రాజావెంకట్‌రెడ్డి, ఎస్సైలు పీ మల్లికార్జున్, వీ కిశోర్, ఎల్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ లింబారెడ్డి



హబీబ్ వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్

దొంగను పట్టించిన వేలిముద్రలు

- **22 ఏండ్ల తర్వాత చిక్కిన హబీబ్.. వీడిన 26 కేసుల మిస్టరీ**
- **కిలో బంగారం, రెండున్నర కిలోల వెండి స్వాధీనం**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వేలిముద్రల సహాయంతో రాచకొండ సీసీఎస్ పోలీసులు 22 ఏండ్ల నుంచి తప్పించుకు తిరుగుతున్న దొంగను సోమవారం అరెస్ట్ చేశారు. అతడి అరెస్ట్‌తో 26 కేసుల మిస్టరీ వీడిపోయింది. సీపీ మహేశ్ భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసులో పోలీసులకు కొన్ని వేలిముద్రలు లభించాయి. ఇటీవలే 'పాపిలాన్ టెక్నాలజీ'తో దొంగల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు అనుసంధానం చేశారు. మీర్‌పేట్ పోలీసులు వారికి దొరికిన వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు పంపించారు. 1995లో హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ చోరీ కేసులో అరెస్టయిన హబీబ్ వేలిముద్రలతో ఇవి సరిపోయాయి. ఈ సమాచారంతో దొంగ ఆచూకీపై ఆరా తీసిన పోలీసులు హబీబ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, 26 చోరీలకు పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. అతని నుంచి కిలో బంగారం, రెండున్నర కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. బాలాపూర్, మీర్‌పేట్, పహాడిషరీఫ్, ఎల్బీనగర్, చైతన్యపురి, వనస్థలిపురం, నార్సింగి, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హబీబ్ చోరీలకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. హబీబ్ 22 ఏండ్లుగా చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు తెలిపారు. హబీబ్ 1995లో సంజయ్, సర్వర్, హర్షద్‌తో కలిసి హుమాయున్‌నగర్ పీఎస్ పరిధిలో చోరీ చేశాడు. అప్పుడు పోలీసులు అతని వేలుముద్రలు తీసుకుని జువైనల్ హోంకు తరలించారు. హోం నుంచి తిరిగి వచ్చిన హబీబ్ అనేక చోరీలు చేసినప్పటికీ పోలీసులకు 22 ఏండ్లుగా చిక్కలేదు. తాజాగా పాపిలాన్ టెక్నాలజీతో ఫింగర్ ప్రింట్స్ బ్యూరోలో మూడు కమిషనరేట్ల పరిధిలోని దొంగల వేలిముద్రలను భద్రపర్చారు. దీంతో పోలీసులు ఒక్క క్లిక్‌తో ఈ వేలిముద్రలను సరిచూడడంతో హబీబ్ నేర చరిత్ర బయటపడింది. హబీబ్ ప్రస్తుతం రాజేంద్రనగర్ ప్రాంతంలోని హసన్‌నగర్‌లో ఉంటున్నాడని, అతనిపై పీడీ యాక్ట్‌ను విధిస్తామని సీపీ చెప్పారు. పీడీ యాక్ట్‌లో ఉన్న నిందితుల కేసు ట్రయల్స్‌ను త్వరగా పూర్తి చేయాలని కోర్టులను విజ్ఞప్తి చేస్తూ లేఖ రాస్తున్నామని సీపీ వివరించారు.


త్వరలో సెటిల్మెంట్ పోలీసుల అరెస్ట్?

ప్రత్యేకాధికారి నివేదిక తర్వాత నిందితులపై చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రైవేట్ సెటిల్మెంట్ వ్యవహారంలో నిందితులుగా ఉన్న రాయదుర్గం పోలీస్ అధికారుల అరెస్ట్‌కు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ప్రత్యేకాధికారి విచారణ తర్వాత వారిపై వేటు పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ సెటిల్మెంట్ ఎవరికి లాభం? బాధితుడిని నిర్బంధించి డిమాండ్ చేసిన మొత్తంలో ఏ అధికారికి ఎంత వాటా? వంటి సందేహాలు పోలీస్ వర్గాలతో పాటు ప్రజల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. భూదందా సెటిల్మెంట్‌లో అదనపు డీసీపీ, సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఒకేసారి అడ్డంగా బుక్కవడం ఇదే మొదటిసారి. దీంతో ఈ కేసు దర్యాప్తు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మాదాపూర్ డీసీపీ ఆదేశాలతో ఈ కేసు విచారణ చేపట్టిన మాదాపూర్ ఏసీపీ రమణకుమార్.. సంగారెడ్డి జిల్లా ముత్తంగిలోని స్థల క్రయవిక్రయాలు, అగ్రిమెంట్ ఆఫ్ సేల్ గురించి ఆరా తీస్తున్నారు. బాధితుడు అబుబాకర్ ఇచ్చిన ఫొటోలు, ఇతర ఆధారాలను సరిచూసుకుంటున్నారు. ప్రాథమిక విచారణ మేరకు రాచకొండ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి ఆ భూమిని అమ్మితే వచ్చే లాభాల్లో తన వాటా రూ.60 లక్షలుగా అంచనా వేసుకొన్నాడని తేలినట్టు సమాచారం. ఆ మేరకు అబుబాకర్‌ను రాయదుర్గం పీఎస్‌లో నిర్బంధించి బలవంతంగా చెక్కులు, ఇతర కాగితాలపై సంతకాలు చేయించుకున్నాడని తెలుస్తున్నది.

అబుబాకర్‌కు రూ.25 లక్షలు

ముత్తంగి ప్రాంతంలోని 2.27 ఎకరాల స్థలాన్ని గంగాధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఇటీవలే కొనుగోలు చేశారు. ఆ స్థలంపై ఉన్న వివాదాలను తొలిగించుకునేందుకు మొత్తం రూ.2.5 కోట్లు ఖర్చుపెట్టారు. ఇందులో స్థల యజమానులైన రైతులకు రూ.80 లక్షలు, ఈ స్థలాన్ని మొదటగా అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకున్న ముజీబ్‌కు గుడ్‌విల్‌తోపాటు, అతను ఇచ్చిన అడ్వాన్స్ కలుపుకొని మొత్తం రూ.25 లక్షలు, అబుబాకర్‌కు రూ.25 లక్షలు ఇచ్చినట్టు సమాచారం. అబుబాకర్‌కు రూ.25 లక్షలు వచ్చినట్టు తెలుసుకున్న అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'నీ వల్ల అందరికీ నష్టం జరిగింది.. ఆ స్థలాన్ని కొని ఎకరా రూ.2 కోట్ల చొప్పున అమ్మితే రూ.4 కోట్లకుపైగా డబ్బు వచ్చేది.. ఖర్చులు తీసేసి మిగిలిన డబ్బును పంచుకొంటే నా వాటా రూ.60 లక్షలు వస్తుంది.. కాబట్టి ఆ డబ్బు కట్టాల్సిందే' అని పులిందర్‌రెడ్డి బెదిరించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు బలవంతంగా రూ.60 లక్షల చెక్కులపై సంతకాలు చేయించుకున్నాడని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మూడు రోజుల్లో తుది నివేదిక అందుతుందని, ఆ తర్వాత అరెస్ట్‌లు ఉంటాయని విశ్వసనీయ సమాచారం. పులిందర్‌రెడ్డిపై గతంలో ఉన్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించారని, వాటిపైనా సమాచారం సేకరిస్తున్నారని తెలిసింది. ఈ కేసులో దోషు లు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ స్పష్టంచేశారు. ఏసీపీ రమణకుమార్ నివేదిక వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు పంపిస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



81 లక్షల ఆధార్ నంబర్లు రద్దు!

న్యూఢిల్లీ, ఆగస్టు 14: యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఇప్పటివరకు దాదాపు 81 లక్షల ఆధార్ కార్డుల గుర్తింపును రద్దు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి గత శుక్రవారం ఈ విషయాన్ని రాజ్యసభకు తెలిపారు. ఆధార్ 12 అంకెలతో కూడిన వినూత్న గుర్తింపు నంబరు. ఇప్పటివరకు దేశంలో 115 కోట్ల మందికి ఆధార్ కార్డుల జారీ పూర్తయింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్యాస్ సబ్సిడీ వంటి పలు కార్యక్రమాలతోపాటు ఈ ఏడాది నుంచి పన్ను రిటర్నుల దాఖలుకు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేసింది కేంద్ర ప్రభుత్వం. పెద్ద సంఖ్యలో ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన నేపథ్యంలో ఆధార్ ప్రాజెక్టుకు చెందిన పోర్టల్ 'www.uidai.gov.in'లోకి లాగిన్నై మీ కార్డు పనిచేస్తుందో లేదో చెక్ చేసుకోవచ్చు. ఇందుకోసం వెబ్‌సైట్‌లోని హోమ్‌పేజీలో కుడివైపు కన్పించే 'వెరిఫై ఆధార్ నంబర్' లింక్‌ను క్లిక్ చేయాలి. తద్వారా ఓపెన్ అయ్యే పేజీలో మీ ఆధార్ నంబర్‌ను ఎంటర్ చేయడం ద్వారా కార్డు పనిచేస్తుందో లేదో తెలుసుకోవచ్చు.

ఇప్పటివరకు 1.8 కోట్ల చందాదారుల ఆధార్ వివరాలు అందాయ్: ఈపీఎఫ్‌వో

హైదరాబాద్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు (ఈపీఎఫ్‌వో) చెందిన 4.5 కోట్ల మంది చందాదారుల్లో ఇప్పటివరకు 1.8 కోట్ల మంది తమ పీఎఫ్ ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారు. 'ఇప్పటివరకు మాకు 1.8 కోట్ల మంది చందాదారుల ఆధార్ కార్డు వివరాలు అందాయి. అందులో 40 లక్షల కార్డులకు చెందిన పేర్లు, పుట్టిన తేదీ, ఇతర వివరాలను యూఐడీఏఐ డాటాబేస్‌లోని రికార్డులతో పోల్చి చూసుకోవడం జరిగింది' అని ఈపీఎఫ్‌వో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీపీ జోయ్ తెలిపారు.

సెన్సెక్స్

31,449

↘ 235

నిఫ్టీ

9,794

↘ 83

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,020
22 క్యారెట్లు	28,870
వెండి (కిలో)	38,810

ముడి చమురు (బ్రెంట్)

↘ 51.43

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.20	67.49
ఆస్ట్రేలియా డాలర్	46.02	53.24
బహ్రెయిన్ దినార్	157.71	180.63
యూరో	68.83	79.81
జపాన్ యెన్/100	53.20	61.70
కువైట్ దినార్	175.13	218.16
ఒమన్ రియాల్	154.32	176.60
సౌదీ రియాల్	15.48	18.35
సింగపూర్ డాలర్	42.78	50.69
స్టెర్లింగ్ పౌండ్	75.76	87.87
యూఏఈ దిర్హామ్	15.84	18.52

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	351-00	351-00
రంగారెడ్డి	351-00	351-00
మెదక్	351-00	351-00
కరీంనగర్	353-00	---
వరంగల్	353-00	---
రిటైల్ ప్రైస్	4-10	4-10

చికెన్ ధరలు

ఫారం ధర	72.00
రిటైల్ లైవ్	86.00
డ్రెస్డ్	120.00
స్కిన్‌లెస్	142.00

రూ.425కే ఎయిర్‌ఇండియా టిక్కెట్



న్యూఢిల్లీ, ఆగస్టు 14: ప్రైవేట్ విమానయాన సంస్థలకు పోటీగా ప్రభుత్వరంగ సంస్థ ఎయిర్ ఇండియా కూడా భారీ తగ్గింపు ఆఫర్‌ను ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఈ ఆఫర్ కింద దేశీయంగా ప్రారంభ విమాన టిక్కెట్ ధరను రూ.425గాను, అంతర్జాతీయ రూట్‌లో రూ.7 వేలుగా నిర్ణయించింది. ఈ నెల 20 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 16 నుంచి నవంబర్ 30లోగా, మళ్లీ వచ్చే ఏడాది జనవరి 25 నుంచి మార్చి 31, 2018 లోపు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చునని కంపెనీ తెలిపింది.

పన్నులు తగ్గించండి మహాప్రభో..!

జీఎస్టీ కౌన్సిల్‌కు పోటెత్తుతున్న అభ్యర్థనలు



న్యూఢిల్లీ, ఆగస్టు 14: కొత్త పరోక్ష పన్నుల చట్టం జీఎస్టీకి సంబంధించి విధానపరంగా సర్వోన్నత నిర్ణయాధికార మండలి జీఎస్టీ మండలికి అభ్యర్థనల వరద పోటెత్తుతున్నది. హెల్మెట్లు, గ్రానైట్ శ్లాబులు, హైబ్రిడ్ కార్లు, నమ్‌కీన్.. ఇలా పలు రంగాల వ్యాపారులు తమ ఉత్పత్తులపై పన్ను భారం తగ్గించాలని మండలిని వేడుకుంటున్నారు. ఇప్పటివరకు జీఎస్టీ కౌన్సిల్‌కు 133 రకాల ఉత్పత్తులపై పన్నురేటును తగ్గించాలని సంబంధిత వర్గాల నుంచి పెద్దసంఖ్యలో అభ్యర్థనలు అందాయని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జూలై 1 నుంచి కొత్త పరోక్ష పన్నుల చట్టం అమలులోకి వచ్చింది. జీఎస్టీ కౌన్సిల్ 1,200 రకాల వస్తువులను నాలుగు పన్ను శ్లాబుల్లో (5,12,18,28 శాతం) చేర్చింది. అయితే, కొంతమంది ప్రస్తుతం వర్తించే పన్నురేటుపై సంతృప్తిగా లేరని, భారాన్ని తగ్గించాలని వారు కోరుతున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.

పలు ఉత్పత్తులపై జీఎస్టీ కౌన్సిల్‌కు అందిన పన్ను తగ్గింపు అభ్యర్థనలు

వస్తువు	ప్రస్తుత పన్ను రేటు (%)	ఇండస్ట్రీ కోరుకుంటున్న పన్ను రేటు (%)
ఐటీ ప్రొడక్ట్స్	18	12
ఐటీ హార్డ్‌వేర్	28	18
హెల్మెట్లు	18	5
టెక్స్‌టైల్స్	5	0
ట్రాక్టర్లు	12	5
గ్రానైట్ శ్లాబులు	28	18
నమ్‌కీన్, బుజియా, చిప్స్	12	5
పాస్తా, నూడుల్స్	18	5
వాటర్ ప్యాకెట్లు, వాటర్ క్యాన్లు	18	0
చట్నీ పౌడర్	18	12
పచ్చళ్లు	12	5
శానిటరీ ప్యాడ్స్	12	0
ఎండు చేపలు	5	0
ప్లాస్టిక్ చెత్త	18	0
చేపలు పట్టే వల	12	5
ఫర్నీచర్	28	12 లేదా 18
అగ్రికల్చర్ ఇంప్లిమెంట్స్	12	0 లేదా 5
ముడి గ్రానైట్	12	5
ఫినిష్డ్ గ్రానైట్	28	12
ఫ్లై యాష్, ఫ్లైయాష్ ఇటుకలు	18	12
జీవ ఇంధనం	18	0 లేదా 5

ఆటో ఇండస్ట్రీ కూడా గరిష్ఠ పన్ను రేటుపై అదనంగా విధించే సెస్సు భారాన్ని తగ్గించాలని కోరుతున్నది. 350-500 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన మోటార్ సైకిళ్లపై 28 శాతం పన్నుతోపాటు విధించే 3 శాతం సెస్సును మినహాయించాలని ఇండస్ట్రీ అభ్యర్థిస్తున్నది. అలాగే హైబ్రిడ్ కార్లపై గరిష్ఠ పన్ను రేటుతోపాటు అదనంగా విధించే 15 శాతం సెస్సును 3 శాతానికి తగ్గించాలని కోరుతున్నది.

ఐడీబీఐ బ్యాంక్ నష్టం రూ.853 కోట్లు

ముంబై, ఆగస్టు 14: ప్రభుత్వరంగ సంస్థ ఐడీబీఐ బ్యాంక్ ఆర్థిక ఫలితాల్లో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో రూ.853 కోట్ల నష్టం వచ్చినట్లు బ్యాంక్ ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధిక స్థాయిలో నిధులు కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. సంస్థ నష్టాలను ప్రకటించడం వరుసగా ఇది మూడోసారి. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి బ్యాంక్ రూ.241.10 కోట్ల లాభాన్ని గడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.8,219.43 కోట్ల నుంచి రూ.6,730.88 కోట్లకు పడిపోయాయి. గడిచి త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.50,173.20 కోట్లు లేదా అడ్వాన్స్‌లో 24.11 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏ 5.59 శాతం నుంచి 9.87 శాతానికి చేరుకుంది.

అపోలో హాస్పిటల్స్ లాభంలో క్షీణత

హైదరాబాద్, ఆగస్టు 14: రాష్ర్టానికి చెందిన ఆరోగ్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.35.21 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.72.17 కోట్ల లాభంతో పోలిస్తే 51.21 శాతం క్షీణించింది. తరుగుదల అధికంగా ఉండటం, వ్యాపారాన్ని విస్తరించడానికి తీసుకున్న రుణాలకోసం అధికంగా వడ్డీలు చెల్లించాల్సి రావడంతో ఫలితాల్లో నిస్తేజం నెలకొందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో స్టాండ్‌లోన్ ఆదాయం రూ.1,648.46 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. గడిచిన మూడేండ్లలో 2,400 పడక గదులను ఏర్పాటు చేసినట్లు, న్యూరోసైన్స్, ట్రాన్స్‌ప్లాంట్స్, ఆర్థోపెడిక్స్‌కోసం ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పినట్లు అపోలో హాస్పిటల్స్ చైర్మన్ సీ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. హబిబుల్లా బాద్షా, రాజ్ కుమార్ మీనన్, రఫీఖ్ అహ్మద్‌లు తమ ఇండిపెండెంట్ డైరెక్టర్ల పదవికి రాజీనామా చేశారు. ఈ నిర్ణయానికి బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అలాగే సోమవారం నుంచి అమలులోకి వచ్చిన అదనపు డైరెక్టర్‌గా బీవీఆర్ మోహన్ రెడ్డి నియామకానికి బోర్డు అనుమతినిచ్చింది. కంపెనీ షేరు ధర 1.96 శాతం పతనం చెంది రూ.1,192.40 వద్ద స్థిరపడింది.

గ్రాన్యూల్స్ పావు శాతం మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్, ఆగస్టు 14: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.37 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. ఆదాయం విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.386 కోట్లుగా నమోదైంది. రూపాయి ముఖ విలువ కలిగిన షేరుకు పావుశాతం అంటే 25 పైసలు మధ్యంతర డివిడెండ్ ప్రకటనకు బోర్డు డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆశావాదంతో ప్రారంభమైందని, మిగతా వర్టికల్స్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

ధరలు మళ్లీ పైపైకి


న్యూఢిల్లీ, ఆగస్టు 14:

జూలైలో 2.36 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

మళ్లీ ధరల మోతమోగింది. గడిచిన కొన్ని నెలలుగా తగ్గుముఖం పట్టిన పలు ఆహార పదార్థాల ధరలు భగ్గుమనడంతో ద్రవ్యోల్బణ గణాంకాలు ఎగువముఖం పట్టాయి. జూలై నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ 2.36 శాతంగా నమోదైంది. చక్కెర, మిఠాయి, పాన్, తంబాకు, మత్తు పదార్థాలు ప్రియంకావడంతో గడిచిన నెలలో రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ పుంజుకోవడానికి కారణమైందని కేంద్ర గణాంక శాఖ వెల్లడించింది. అయినప్పటికీ ఆహార ద్రవ్యోల్బణం -0.29 శాతంగా నమోదవడం విశేషం. జూన్ నెలకుగాను సూచీ -2.12 శాతంగా ఉంది. జూన్ నెలకుగాను విడుదలైన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను 1.46 శాతానికి సవరించింది. జూలైలో చక్కెర, మిఠాయిలు 8.27 శాతం ప్రియమవగా, పాన్, తంబాకు, మత్తుపదార్థాలు 6.39 శాతం చొప్పున అధికమయ్యాయి. గృహ ఖర్చులు 4.98 శాతం చొప్పున పెరుగగా, చమురు, లైట్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఉత్పత్తులు 4.86 శాతం బలపడ్డాయి. వీటితోపాటు దుస్తులు, పాదరక్షల ధరలు 4.22 శాతం పెరిగాయి. కానీ పప్పు, ఇతర ఉత్పత్తుల ధరలు భారీగా తగ్గాయి. వీటితోపాటు కూరగాయల ధరలు -3.57 శాతం తగ్గగా, కోడిగుడ్లు -2.04 శాతం, సుగంధ ద్రవ్యాలు -1.67 శాతం మేర పతనమయ్యాయి. గ్రామీణ ద్రవ్యోల్బణ గణాంకాలు 2.41 శాతంగా నమోదయ్యాయి.

టోకు ధరల సూచీ మరింత పైకి..

టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం ఎగువముఖం పట్టింది. గడిచిన ఐదు నెలల్లో తొలిసారిగా జూలైలో 1.88 శాతంగా నమోదైంది. పలు ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ టోకు ధరల ద్రవ్యోల్బణం పెరుగడం విశేషం. జూన్‌లో డబ్ల్యూపీఐ సూచీ 0.90 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 0.63 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఆహార పదార్థాలు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. మార్చి నుంచి తగ్గుముఖం పట్టిన టోకు ధరల సూచీ గడిచిన నెలలో పెరుగుదల కనిపించింది. కూరగాయల ధరల సూచీ 21.16 శాతంగా నమోదవగా, తయారీ ఉత్పత్తుల సూచీ 2.18 శాతానికి పరిమితమైంది. చమురు, విద్యుత్ గణాంకాలు 5.28 శాతం నుంచి 4.37 శాతానికి తగ్గాయి. కూరగాయలు మినహా మిగతా ఆహార పదార్థాలైన కోడిగుడ్లు, మాంసం, చేపల ద్రవ్యోల్బణం 3.30 శాతంగా నమోదైంది. పండ్ల టోకు ధరల సూచీ 2.71 శాతంగాను, చిరుధాన్యాలు 0.63 శాతంగా ఉంది. చక్కెర ధరల సూచీ రికార్డు స్థాయి 8.44 శాతానికి చేరుకుంది. బంగాళాదుంప ధరలు 42.45 శాతం తగ్గగా, పప్పు దినుసులు 32.56 శాతం, ఉల్లి 9.50 శాతం చొప్పున తగ్గాయి.



ద్రవ్యోల్బణ గణాంకాలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. పరపతి సమీక్షలో ఆర్బీఐ తీసుకున్న నిర్ణయంతో ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు బలహీనంగా ఉన్నాయి. వచ్చే పండుగ సీజన్ కంటే ముందే సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించాల్సిన అవసరం ఉంది.

- పంకజ్ పటేల్, ఫిక్కీ ప్రెసిడెంట్

8 నెలల కనిష్ఠానికి ఎగుమతుల వృద్ధి

- జూలై నెలకు 3.94 శాతంగా నమోదు
- 1,144 కోట్ల డాలర్లకు పెరిగిన వాణిజ్యలోటు



గతనెలలో భారత ఎగుమతుల విలువ వార్షిక ప్రాతిపదికన 3.94 శాతం వృద్ధి చెంది 2,254 కోట్ల డాలర్లకు చేరుకుంది. గడిచిన ఎనిమిది నెలల్లో ఎగుమతులకు ఇదే కనిష్ఠ వృద్ధి. దిగుమతులు సైతం 15.42 శాతం పెరిగి 3,400 కోట్ల డాలర్లుగా నమోదైంది. ముడిచమురు, బంగారం దిగుమతులు పెరుగడం ఇందుకు ప్రధాన కారణమైంది. గత ఏడాది జూలైలో దేశంలోకి 2,945 కోట్ల డాలర్ల విలువైన వస్తువులు దిగుమతయ్యాయి. గతనెలలో విదేశీ వాణిజ్యలోటు (ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం కంటే దిగుమతుల కోసం చెల్లింపులు అధికంగా ఉండటం) 1,144 కోట్ల డాలర్లకు పెరిగింది. గతేడాది ఇదే నెలకు లోటు 776 కోట్ల డాలర్లుగా నమోదైందని సోమవారం విడుదల చేసిన డాటా నివేదికలో కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది. జూలైలో గోల్డ్ దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 95 శాతం పుంజుకొని 210 కోట్ల డాలర్లకు చేరుకోగా.. ముడిచమురు దిగుమతులు 15 శాతం పెరిగి 784 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన నాలుగు నెలల కాలానికి (ఏప్రిల్-జూలై) ఎగుమతులు 8.91 శాతం వృద్ధి చెంది 9,475 కోట్ల డాలర్లకు చేరుకోగా.. దిగుమతులు 28.30 శాతం పెరిగి 14,625 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

ఎట్టకేలకు లాభాల్లోకి

సెన్సెక్స్ 235 పాయింట్లు అప్



ముంబై, ఆగస్టు 14:

స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కుదుటపడ్డాయి. అమెరికా-ఉత్తర కొరియా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రస్తుతానికి సద్దుమనుగడంతో వరుసగా భారీగా నష్టపోయిన సూచీలు ఎట్టకేలకు లాభపడ్డాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలను తగ్గించడానికి చైనా అధ్యక్షుడు చేసిన ప్రయత్నం సత్ఫలితాలను ఇచ్చింది. దీంతో గడిచిన వారంలో భారీ నష్టాలను మూటగట్టుకున్న మార్కెట్లు మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 235.44 పాయింట్లు(0.75 శాతం) లాభపడి 31,449.03 వద్ద ముగిసింది. గడిచిన ఐదు సెషన్లలో సూచీ 1,111.82 పాయింట్లు కోల్పోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 83.35 పాయింట్లు(0.86 శాతం) పెరిగి 9,794.15 వద్ద స్థిరపడింది. యూఎస్-ఉత్తర కొరియాల మధ్య పరిస్థితులు సద్దుమనుగడంతోపాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు బలహీనంగా ఉండటంతో ఏ క్షణంలోనైనా వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లు ఎగువముఖం పట్టాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన యూరప్ స్టాక్ మార్కెట్లు లాభాల బాట పట్టడం కూడా సూచీలు మరింత బలోపేతం అవడానికి దోహదపడ్డాయి. అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడంతో సిప్లా షేరు ధర 5.03 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్ ఫార్మా, టాటా స్టీల్‌లు నాలుగు శాతానికి పైగా లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హీరోమోటోకార్ప్, లుపిన్, మారుతిలు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. రిలయన్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్‌ల షేర్లు లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. టీసీఎస్, ఎస్‌బీఐ, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్, విప్రో, ఐటీసీలు పతనం చెందాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్, పవర్ లాభాల్లో ముగిశాయి.

నేడు మార్కెట్లకు సెలవు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం స్టాక్ మార్కెట్లు మూసివేసివుంచనున్నారు. సూచీలతోపాటు ఫారెక్స్, కమోడిటీ ఫ్యూచర్, కమోడిటీ, బులియన్, మెటల్ మార్కెట్లలో కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.

సహారా ఆంబీ వ్యాలీ కనీస ధర 37 వేల కోట్లు



ముంబై, ఆగస్టు 14: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సహారా గ్రూపునకు చెందిన ఆంబీ వ్యాలీ రిసార్టు టౌన్ ఆస్తుల వేలం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. వేలంలో భాగంగా ఈ ఆస్తుల కనీస ధరను (రిజర్వ్ ప్రైస్) రూ.37,392 కోట్లుగా నిర్ణయించారు. సహారా గ్రూపు మాత్రం ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు పైమాటేనని అంటున్నది. వేలం ప్రక్రియ ఇప్పుడే మొదలైందని, ఆసక్తిగల వారిని నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ పత్రికా ప్రకటన జారీ చేసిన లిక్విడేటర్ మరో అడుగు ముందుకేసి వారి కేవైసీని పరిశీలిస్తారని సహారా అంటున్నది. కేసు తదుపరి విచారణ గడువు తేదీలోగా రూ.1,500 కోట్లు డిపాజిట్ చేస్తే ఆస్తుల విక్రయ నిలిచిపోనుందని సంస్థ తరపున న్యాయవాది గౌతం అవస్తీ ధీమా వ్యక్తం చేశారు. ఎందుకంటే, సహారా-సెబీ కేసుకు సంబంధించి గతవారం జరిగిన విచారణలో సుప్రీంకోర్టు బెంచ్.. లిక్విడేటర్‌కు వేలంలో మొదటి రెండు దశలను పూర్తి చేసేందుకు మాత్రమే అనుమతినిచ్చింది.

సుప్రీంకోర్టు ఈ ఆస్తుల వేలం బాధ్యతలను బాంబే హైకోర్టుకు చెందిన అధికారిక లిక్విడేటర్‌కు అప్పగించింది. వేలం ప్రకటనలో 'అల్ట్రా ఎక్స్‌క్లూజివ్ చార్టర్డ్ సిటీ'గా పేర్కొన్న ఆంబీ వ్యాలీలో చెక్క వసారాలు, ఆధునిక విల్లాలు, గోల్ఫ్ కోర్స్, హాస్పిటల్, స్కూల్, ఎయిర్‌పోర్ట్, ఇంకా మరెన్నో హంగులున్నాయి. మహారాష్ట్రలోని పుణె జిల్లాకు చెందిన లోనావాలా సమీపంలో ఉన్న కొండల మధ్య సహారా గ్రూపు 6,761.6 ఎకరాల విస్తీర్ణంలో ఆంబీ వ్యాలీని నిర్మించింది. ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌తోపాటు అక్కడ సహారాకు ఉన్న 1,700 ఎకరాల భూమిని కూడా వేలం వేయబోతున్నారు. ఆంబీ వ్యాలీలో 167 కోట్ల డాలర్లు (రూ.10,700 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు మారిషస్‌కు చెందిన రాయల్ పార్ట్‌నర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ముందుకు వచ్చింది. అయినప్పటికీ కోర్టు మాత్రం వేలం ప్రక్రియను మొదలు పెట్టింది. డిపాజిటర్లకు సొమ్ము తిరిగి చెల్లింపులకు సంబంధించి సెబీ-సహారా మధ్య చాలాకాలంగా కేసు కొనసాగుతున్నది. సెప్టెంబర్ 7 కల్లా సహారా-సెబీ ఖాతాలో రూ.1,500 కోట్లు డిపాజిట్ చేయాలని గత నెల 25న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సహారా చీఫ్ సుబ్రతా రాయ్‌ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 293.45(285.65)1504
Ace Software Exports 18.45(17.6)300
Aditya Spin 9.07(8.64)903
Agro Tech Foods 510.05(515.3)410
Aishwarya Telcom Ltd 3.95(4.0)7050
Alphageo 807.5(794.15)2179
Alufluoride 54.5(51.65)3423
Amara Raja 810.65(800.75)879940
Andhra Bank 49.95(49.75)287828
Andhra Cements 9.11(8.79)33911
Andhra Petroch 28.3(24.1)172724
Andhra Sugars 328.4(325.15)2487
Anjani Portl 207.75(203.05)1367
Astra Micro 123.75(119.9)26084
Aurobindo Phar 715.15(704.8)238970
Avantel 211.25(219.75)1237
Avanti Feeds 1901.1(1645.1)91209
Avon Organics 4.92(5.62)10435
B N Rathi Sec 32.45(29.65)4030
B2b Software 6.86(7.22)1200
Balaji Amines 313.05(308.55)6745
Bambino Agro 171.6(175.0)295
Bartronics India 14.15(14.05)16589
Bgr Energy Syst 129.0(126.0)20003
Bhagiradha Chem 171.0(174.95)311
Bhagyaind 21.15(22.2)1871
Bhagyanagar W. 23.85(25.0)582
Bnr Udyog 37.1(37.85)12121
Brilliant Sec.7.27(7.25)3008855
Cambridge Tech 67.05(65.95)24398
Ccl Products 278.7(279.85)6310
Celestial Labs 22.4(21.9)3486
Cil Securities 34.6(38.4)8601
Color Chips 49.6(48.45)3230
Coromandel Fert 425.5(407.05)12470
Country Club 13.2(13.01)67627
Cubex Tubings 16.65(15.9)521
Danlaw Tech. 49.0(48.9)1770
Deccan Cem's 1120.3(1089.65)2168
Denisons Hyd 1201.0(1229.25)111
Diamond Power Infrastructure Ltd 22.65(21.65)13439
Divi's Lab 639.0(626.85)79956
Divyashakti Gr 96.15(97.25)456
Dr Reddy`s 2001.75(2011.35)68643
Empee Sugars 5.5(5.4)4030
Everest Org 94.4(96.7)1882
Facor Alloys 3.85(3.85)152246
Fenoplast 62.85(65.95)495
Firstobj 15.75(15.85)8665
Fortune Info 85.95(84.55)15155
Four Soft 88.75(85.65)603
Gati 109.2(105.95)106524
Gayatri 8.97(9.07)132908
Gayatri Projects 160.6(155.15)7629
Gennex 4.04(3.99)126853
Gmr Infra 16.1(15.5)4018083
Godavari Drugs 35.0(34.35)2355
Goldinfra 112.65(107.3)10297
Goldstone Tech 10.49(11.04)17387
Granules Ind 116.45(109.35)301673
Gss America Info 19.9(19.85)924
Gulf Oil Corp 519.6(497.45)5412
Gvk Pwr 12.55(12.19)1755076
Hbl Power 44.9(43.55)13647
Heritage Food 1261.25(1217.5)1702
Hind Fluro 14.5(14.65)300
Hyderabad Ind 1090.2(1025.7)2635
I V R Cons 5.24(5.3)569348
I.c.s.a. 2.7(2.68)7338
Incap 55.9(53.25)3179
Infotech Ent 492.2(493.1)3298
Integrated Therm's 4.58(4.37)1300
Invinex Lab 118.3(124.5)2384
Ivrcl Infrastruc 5.24(5.3)569348
K C P 101.65(97.4)14778
Kabsons Ind 3.8(3.99)101
Kakatiya Cem. 342.05(319.95)3546
Kallam Spinning 28.1(27.6)25072
Kaveri Seed 535.05(524.55)136946
Kernex Mic. 32.6(32.7)21019
Knr Constructions 220.35(202.95)41258
Krebsbio 92.0(91.1)1129
Lanco Ind 358.95(348.4)13714
Lanco Infratech 0.91(0.95)1292245
Livewell Home Fin 69.0(66.25)521
Lokesh Mach 79.25(77.65)15712
Lotus Chocolate 31.0(32.6)100
Madhucon Projects 27.55(28.4)62540
Maytas Infra 41.45(39.6)6392
Mhril 354.7(343.75)5537
Mic Electronics 7.24(7.06)60197
Moldtek 51.2(49.8)3860
Moschip Semi 44.25(41.65)63200
Msr India Ltd 30.35(28.95)7266
N C L Ind 209.75(195.55)50839
Nagarjuna Agri 32.1(31.9)15790
Nagarjuna Con 86.25(82.85)333019
Natco Pharma 739.3(702.5)96053
National Min 120.95(117.6)289685
Nbventure 127.85(125.3)15296
Neha International 5.47(5.64)19885
Neha Inter' Ltd. 5.47(5.64)19885
Neocure Thera 3.4(3.26)22781
Nettlinx 102.95(99.95)9333
Neuland Lab 1285.9(1241.05)800
Niharinf 15.1(15.7)2548
Nile 585.4(591.8)23073
Oil Country 40.6(41.5)965
Online Media Solutions 0.49(0.51)100
P.m. Telelinnks 2.3(2.3)17
Padmalaya Tel 7.5(7.79)21421
Pankaj Polymers 11.5(11.03)100
Panyam Cem 59.15(57.95)19049
Pennar Ind 53.25(49.1)186192
Pflinfotc 5.77(5.74)2950
Phaarmasia 19.9(20.9)80
Phyto Chem 50.75(51.5)3002
Pitti Lamin 50.35(48.6)1200
Pokarna 1231.45(1195.3)2238
Prajay Eng 7.86(8.17)44895
Premier Expl 458.75(445.7)2015
Prism Cement 112.15(112.1)19015
Rain 120.15(115.8)209818
Raj Packaging 58.9(54.75)13390
Ram Informatics 46.5(39.15)356
Regency Ceramic 5.46(5.67)6063
Restile Ceramics 5.35(4.74)240
Roopa Industries 11.84(11.85)120
Sagar Cements 823.15(816.15)1553
Salguti Plast 18.05(19.0)2
Samkrg Pistons 254.1(250.25)8709
Sampre Nutritions 41.5(40.0)2602
Sanghi Ind 77.95(73.3)146516
Sanjeevni Industries 26.95(26.55)8267
Sark Sys 74.05(66.45)31580
Sathavahana Ispat 38.2(36.75)8403
Saven Tech. Ltd 22.3(22.0)17498
Sibar Auto 14.49(13.8)10
Sks Microfin 802.8(785.5)160455
Sms Pharma 72.0(68.85)5250
Softsol India 35.15(37.0)50
Southern Online 3.58(3.37)10170
Sr Ray Alkalies 26.9(26.05)120900
Sree Rayalaseema 123.3(121.0)9003
Srinivasa Shipp 57.5(57.85)4004
Starchik Sp 15.4(16.0)1
Steel Exchange 83.0(80.25)170384
Sujana 1.02(0.96)130515
Sujana Towers 4.25(4.09)9066
Sujanametal 1.76(1.64)31011
Surana Telecom 4.65(4.56)2005
Suryaamba 58.45(54.35)901
Suryachakra Power 1.18(1.1)102492
Suryalak Cott 100.7(98.65)2915
Suryalata Spin 124.4(128.7)1721
Suryavanshi Spin 8.57(9.0)185
Suvarna Cem 151.15(154.95)694
Suven 160.2(155.95)35202
Taj Gvk 160.95(159.0)1989
Tanla Solutions 31.85(30.2)61452
Tci Fin 21.5(20.85)9194
Transcorp Inter's19.05(18.3)6586
Transgene Biotek 2.18(2.08)1760
Transport Co 282.3(276.6)6424
Trendy Knitwear 0.19(0.2)66718
Tyche 59.85(49.9)6899
Unisocks 3.48(3.44)10818
Ushakiran Finance 4.77(4.55)199
Usher 6.76(6.6)10215
V & K Softech 4.35(4.5)25
V B C Ferro 37.8(39.6)2620
V S T Ind 2728.0(2622.35)76
Vamshi Rubber 61.5(57.0)22
Viceroy Hotels 16.55(16.55)57749
Vijay Textiles 56.0(55.05)14469
Vimta Labs 129.85(134.05)6670
Virat Crane 36.6(35.05)3048
Virnichiq 81.05(79.05)29754
Visaka Ind 511.5(440.2)47970
Vista Pharma 27.05(28.35)7725
Vivmed Labs 101.55(106.45)204679
Vivo Bio Tech 60.9(64.0)644
Vmf Softech 91.2(89.0)3205
Waterbase 109.55(107.85)300386
Xl Energy Ltd 1.8(1.8)3669
Ybrant Digital 6.92(6.59)44010
Zen Tech Ltd 49.45(49.45)9851
Zenotech 46.0(45.45)8908





ఎర్రమంజిల్‌లో..

విజయవంతంగా కొనసాగుతున్న 47 కేంద్రాలు

త్వరలో అవుట్‌లెట్ల సంఖ్య 100కు పెంపు

వచ్చేనెలలో పాతబస్తీలో, క్రమంగా ఇతర జిల్లాలకు విస్తరణ

వినియోగదారుల సంఖ్య పెరిగింది

మన కూర గాయల పథకం వినియోగదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. ఉద్యోగులు పెద్ద ఎత్తున కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రావడం లేదు.

–రాము, ఔట్‌లెట్ కేంద్రం సూపర్‌వైజర్

గిరాకీ ఎక్కువ..

ఉదయం, సాయంత్రం వేళల్లో వినియోగదారులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. తాజా కూరగాయలు లభిస్తున్నందున చాలామంది వస్తున్నారు. ధరల విషయంలో ఎవరి నుంచి ఎలాంటి పేచీలు ఉండటం లేదు. ఆశించిన మేర వ్యాపారం జరుగుతున్నది.

– సరిత, సేల్స్‌ఉమెన్

ప్రతిరోజూ తాజాగా..

'మన కూరగాయలు' సక్సెస్

హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన కూరగాయలను సరసమైన ధరలకు అందించేందుకు మార్కెటింగ్‌శాఖ ఏర్పాటు చేసిన 'మన కూరగాయలు' పథకానికి ఆదరణ పెరుగుతున్నది.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతుల సంక్షేమం, వినియోగదారుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్యానవన విభాగం సహకారంతో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ హైదరాబాద్– సికింద్రాబాద్ జంట నగరాలలో 47 చోట్ల అవుట్‌లెట్లను (విక్రయకేంద్రాలు) ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నది. కరివేపాకు నుంచి పుచ్చకాయ వరకు అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఒకే చోట లభిస్తున్నాయి. వీటికి డిమాండ్ పెరుగడంతో జిల్లాలకు కూడా పథకాన్ని విస్తరించాలని ప్రభు త్వం యోచిస్తున్నది. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని 2014 డిసెంబర్ 6వ తేదీన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఈ పథకం గురించి మొదట ప్రకటన చేశారు. గత ఏడాది జూన్ 6న మార్కెటింగ్‌శాఖమంత్రి టీ హరీశ్‌రావు ఈ పథకాన్ని మొదట నారాయణగూడలోని మెల్కోటే పార్క్ ప్రాంతంలోఅవుట్‌లెట్ ఏర్పాటుతో ప్రారంభించారు. ఈ పథకం వినియోగదారులకే కాదు, రైతులకు, వ్యాపారులకు కూడా లాభదాయం కావడంతో సక్సెస్ అయ్యింది. దీంతో సిటీలో ఔట్‌లెట్ల సంఖ్య క్ర మంగా 47కు పెంచారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రేటర్ కమ్యూనిటీ కాలనీలలో సైతం ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు విజ్ఞప్తులు అందుతున్నాయి. దీంతో పాత బస్తీతోపాటు, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, తార్నాక, హబ్సీగూడ వంటి ప్రాంతాల్లో వచ్చే నెలలో ఈ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



మోతీనగర్‌లో..



కొత్త కేంద్రాలు కావాలంటున్నారు..

మన కూరగాయల అవుట్‌లెట్లకు మంచి స్పందన లభిస్తున్నది. కొత్తవి ఏర్పాటు చేయాలని వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. డిమాండ్ ఉన్నందు వల్ల ఈ ఏడాది చివరి నాటికి 100 కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. పథకాన్ని కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లా కేంద్రాలకు విస్తరించే విషయాన్ని పరిశీలిస్తున్నాం. మంత్రి హరీశ్‌రావుతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– పద్మ హర్ష, మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్

ముందుగా నిర్దేశించిన విధంగా 2017 డిసెంబర్ చివరి నాటికి జంట నగరాల్లో 100 ఔట్‌లెట్ల ఏర్పాటు పూర్తయిన అనంతరం హైదరాబాద్ తరువాత రాష్ట్రంలో పెద్ద నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మంలకు ఈ పథకాన్ని విస్తరించాలని మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ లోని మన కూరగాయల కేంద్రాలకు మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 73వేల మంది రైతుల నుంచి ప్రతి రోజు వివిధ రకాలకు చెందిన 15 నుంచి 20 టన్నుల కూరగాయలు సరఫరా అవుతున్నాయి. ఈ సరఫరాల కోసం జంటనగరాల చుట్టూ 50 కిలోమీటర్ల పరిధిలో నిరంతర కూరగాయల సాగును ఉద్యానవనశాఖ సహకారంతో, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ప్రోత్సహించింది. ఇందుకోసం పాత మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎంపిక చేసిన 31 గ్రామాల్లో 10 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ఈ క్లస్టర్లలో దాదాపు 75 వేల మంది రైతులు ఆధునిక పద్ధతుల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. రైతులు పండించిన కూరగాయలను వివిధ పాయింట్ల నుంచి మార్కెటింగ్‌శాఖ సేకరించి బోయినపల్లిలోని హోల్‌సెల్ మార్కెట్‌కు తరలిస్తున్నది. అక్కడ ధరలను నిర్ణయించి మన కూరగాయల కేంద్రాలకు చేరవేస్తున్నది. ఈ విధానంలో ఊరిలో పండిన పంటలు 12 గంటల వ్యవధిలోనే నగరానికి చేరడంతో వినియోగదారులు నాణ్యమైన, తాజా కూరగాయలు పొందగలుగుతున్నారు. ఈ పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మార్కెటింగ్ శాఖ 85 లక్షల క్వింటాళ్ల కూరగాయలను సేకరించింది. రైతులకు రూ.14.30 కోట్లు చెల్లించింది. రైతులు దళారుల బారిన పడకుండా పంట పండించిన చోటనే గిట్టుబాటు ధర పొందుతున్నాడు. నగదు రహిత పద్ధతిలో ఆన్‌లైన్‌లో డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ పథకం అమలుకు 'ఫాం ఫిక్స్ 'అనే ఏజెన్సీ, జెనెర అగ్రిక్రాఫ్ లిమిటెడ్ సంస్థ సహాయ సహకారాలు అందిస్తున్నాయి. పథకం వల్ల 47 కేంద్రాల ద్వారా 280 మంది ఉపాధి పొందుతున్నారు.



హిమాయత్‌నగర్‌లో..

ప్రైవేటు ట్రావెల్స్‌ను నియంత్రించాలి



- ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోజురోజుకూ ప్రైవేటు ట్రావెల్స్ అక్రమాలు, దోపిడీ మితిమీరిపోతున్నాయని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రైవేటు ట్రావెల్స్‌తో భారీ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని సోమవారం సచివాలయం వద్ద మీడియాకు తెలిపారు. విజయవాడ, పాలెం ఘటనలకు ప్రైవేటు ట్రావెల్సే కారణమని, అలాంటి ఘటనలు నిత్యం ఎక్కడోచోట జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. కాంట్రాక్టు క్యారేజ్ అనుమతి తీసుకొని, ఆర్టీసీ బస్సుల మాదిరిగా స్టేజ్ క్యారియర్స్ నడుపుతున్నారని, ఆన్‌లైన్ బుకింగ్ కూడా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విధానం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. ప్రైవేటు ఆగడాలతో రెండు రాష్ర్టాల ఆదాయానికి గండిపడుతున్నదని చెప్పారు. వారి వెనుక ఎవరున్నారు? ఎందుకు నియంత్రించలేకపోతున్నారో అధికారులు చెప్పాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని కోరారు.

ప్రతిభావంతులకు ఎన్‌ఎస్‌ఎఫ్ స్కాలర్‌షిప్‌లు

- సెప్టెంబర్ 17 వరకు దరఖాస్తు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంజినీరింగ్, మెడిసిన్, డెంటల్, వెటర్నరీ, అగ్రికల్చర్‌తోపాటు పాలిటెక్నిక్ వంటి వృత్తివిద్యా కాలేజీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లు ఇవ్వడానికి యూఎస్‌ఏకు చెందిన నార్త్ సౌత్ ఫౌండేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్) ముందుకు వచ్చింది. దేశవ్యాప్తంగా మొత్తం మూడువేల స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. పది, ఇంటర్, సీఈటీ/ జేఈటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మొదటి పదిమంది విద్యార్థులకు వీటిని మంజూరు చేయనున్నారు. అలాగే ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదివి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.90వేలకు మించని విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పూర్తి వివరాలకు http://www.northsouth.org/app6/Login.aspx అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 17 వరకు గడువు విధించామని ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ రత్నం చిత్తూరి తెలిపారు.

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

టీఎన్నారైల హామీ.. హైదరాబాద్‌లో సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మాతృభూమి అభివృద్ధికి సహకరిస్తామని ప్రవాస తెలంగాణవాసులు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో దాదాపు 100 మందికిపైగా ఎన్నారైలు సమావేశమయ్యారు. అమెరికాలో నివసిస్తున్న పలువురు తెలంగాణవాదులు స్వరాష్ట్ర సంక్షేమానికి కృషి చేస్తున్నారని కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీశాట్ చైర్మన్ ఆర్ శైలేశ్‌రెడ్డి కొనియాడారు. గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని శ్రీధర్ కోరగా.. అమెరికాలోఅనుసరిస్తున్న విద్యావిధానాన్ని గురించి తెలియజేయాలని శైలేశ్‌రెడ్డి కోరారు. సమావేశ నిర్వాహకులు రవి మేరెడ్డి, జలగం సుధీర్, శాంతిపుట్టా, భరత్‌ను ఎన్నారైలు అభినందించారు.

రేపటి నుంచి అమల్లోకి జీఎస్టీ ఈ-వే బిల్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వస్తు సేవా పన్ను (జీఎస్టీ) ఈ–వే బిల్లు విధానాన్ని బుధవారం నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. జీఎస్టీ అమల్లో భాగంగా రూ. 50వేల విలువకంటే ఎక్కువ వస్తువులను రవాణా చేస్తే తప్పనిసరిగా ఈ–వే బిల్లు ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ఈ–వే బిల్లులను www.tgct.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వేళ బిల్లు లేకుండా సరుకు రవాణా చేస్తే వాణిజ్య పన్నులశాఖ మొబైల్ బృందాలు తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు. ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేయడానికి డీలర్స్ ప్రభుత్వంతో సహకరించాలని కమిషనర్ కోరారు.

నిబంధనల ప్రకారమే నిర్మాణాలు

- **మంత్రి కేటీఆర్ పిలుపుపై స్పందించిన బిల్డర్లు**
- **అనుమతులున్న ఇండ్ల కొనుగోళ్లు ఇక సులువు**
- **'రెరా' ఆమోదం ఉంటే నిశ్చింతగా కొనవచ్చు**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను అరికట్టడంపై దృష్టి సారించింది. 427 ఏండ్ల కిందట ముగ్గుపోసుకున్న భాగ్యనగరాన్ని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దడంలో భాగంగా శివార్లలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, పుప్పాలగూడ, మణికొండ, ఫిర్జాదిగూడ వంటి ప్రాంతాలకు చెందిన బిల్డర్లు స్వీయనియంత్రణను పాటించాలని ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు ఇటీవల ఓ సమావేశంలో ఆదేశించారు. దీంతో శివారు ప్రాంతాల బిల్డర్లు, డెవలపర్లు.. నిబంధనలకు అనుగుణంగానే నిర్మిస్తామని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. లేకపోతే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ఉమ్మడిరాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా పలువురు డెవలపర్లు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పార్కింగ్‌లేకుండా, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకుండా నగర అందాన్ని ధ్వంసం చేశారని విచారం వ్యక్తంచేశారు. ఇకపై ప్రతి బిల్డర్ నిబంధనలకు అనుగుణంగా అపార్టుమెంట్లను నిర్మించాలని కోరారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే బిల్డర్లు అప్రమత్తమయ్యారు. అక్రమ నిర్మాణాలకు తాము వ్యతిరేకమని, ఇక నుంచి ప్రోత్సహించే అవకాశమే లేదని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు చెప్పారు.

రెరాతో ఇండ్ల కొనుగోలుదారులకు స్వేచ్ఛ

సొంతింటి ఎంపికలో ఇకపై తడబాటుకు గురవ్వాల్సిన పనిలేదు. గతంలో ఏది సక్రమమో, అక్రమమో తెలియక కొనుగోలు చేశాక ఇబ్బందులు పడేవాళ్లు. వాటిని తప్పించేందుకు రాష్ట్రప్రభుత్వం 'రెరా' చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అక్రమకట్టడాలను ఆదిలోనే నియంత్రించేందుకు పురపాలకశాఖ మున్సిపల్ బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసింది. బిల్డర్లు కోర్టులకు వెళ్లి 'స్టే' తెచ్చుకుని అమాయకులకు అంటగట్టే రోజులకు సైతం కాలం చెల్లింది. రాష్ట్రంలో ఎవరు అపార్టుమెంట్లు నిర్మించాలన్నా 'రెరా' నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఓ భవనం రెరా నిబంధనల మేరకు నిర్మించి ఉంటే మరేమీ ఆలోచించకుండా నిశ్చింతగా కొనుక్కోవచ్చు. బిల్డింగ్ ట్రిబ్యునల్, రెరా అథారిటీ ఏకకాలంలో అమలవుతున్నందున ఇబ్బందులకు కాలం చెల్లినట్టే. 'రెరా' వెబ్‌సైట్‌లో చూసి కొనుగోలుచేసే అవకాశం ఉండటంతో అక్రమ నిర్మాణాలను సులభంగా గుర్తించవచ్చు. .

ఉదయసముద్రంకు ఊరట

- **జలమండలి మోటర్ల నుంచి పెరుగుతున్న డిశ్చార్జి**
- **అండర్ వాటర్ బ్లాస్టింగ్‌తో మరింత ఆసరా**
- **అక్కంపల్లి రిజర్వాయర్‌లో రోజుకు 0.1 మీటర్ల వృద్ధి**
- **కలిసివస్తున్న ఎన్జీటీ నిబంధనలు**
- **కర్ణాటకపై ఒత్తిడికి కృష్ణా బోర్డుతో సంప్రదింపులు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉదయసముద్రం రిజర్వాయర్ నీటి సమస్యకు ఊరట కలిగించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పుట్టంగండి వద్ద జలమండలి ఏర్పాటుచేసిన అత్యవసర మోటర్లనుంచి క్రమంగా డిశ్చార్జి పెరుగుతున్నది. ఫోర్‌షోర్‌లో డ్రెడ్జింగ్ (కాల్వతీత పనులు) వల్ల 200–300 క్యూసెక్కుల డిశ్చార్జి క్రమంగా 720 క్యూసెక్కులకు చేరుకుంటున్నది. ఫలితంగా అక్కంపల్లి రిజర్వాయర్‌లో రోజుకు 0.1 మీటర్ల నీటిమట్టం పెరుగుతున్నది. ఇక సాగర్ జలాశయం వద్ద కాల్వలోని ఒక పెద్ద రాయిని అండర్ వాటర్ బ్లాస్టింగ్ చేస్తే డిశ్చార్జి 800 క్యూసెక్కులు దాటుతుందని, అక్కంపల్లి నీటిమట్టం పెరిగి వారం పదిరోజుల్లో ఉదయసముద్రంకు నీరు విడుదల చేయవచ్చునని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు నారాయణపూర్‌నుంచి నీరు విడుదల చేయించేందుకు కర్ణాటకతో సంప్రదింపులు ముమ్మరమయ్యాయి. ఇదేకాక నదీ మార్గంలో ఎన్విరాన్ ఫ్లో కింద కనీసం 15–20 శాతం నీటి ప్రవాహం కచ్చితంగా ఉండాలన్న ఎన్జీటీ నిబంధనల మేరకు నీరు విడుదల చేయించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృష్ణాబోర్డును సంప్రదిస్తున్నది. మొత్తంగా గత కొన్ని రోజులుగా నీటిపారుదల శాఖను ఆందోళనకు గురి చేసిన నల్లగొండ ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తాజా పరిణామాలు...

నల్లగొండ జిల్లా పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ ఫోర్‌షోర్‌లో జలమండలి (హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్) అధికారులు కొన్ని నెలల కిందటే అత్యవసర మోటార్లను ఏర్పాటు చేశారు. సాగర్‌లో 502 అడుగుల కంటే నీటిమట్టం తగ్గేకొద్దీ వీటి డిశ్చార్జి కూడా తగ్గుతుంది. ఒక దశలో 200–300 క్యూసెక్కులు మాత్రమే విడుదలైన సందర్భాలున్నాయి. కానీ జలమండలి అధికారులు ముందు జాగ్రత్తగా నాలుగున్నర కోట్ల రూపాయలతో సాగర్ జలాశయం ఫోర్‌షోర్‌లో డ్రెడ్జింగ్ (కాల్వ తీత పనులు) చేపట్టడంతో డిశ్చార్జి పెరిగింది. ప్రస్తుతం మోటార్ల ద్వారా 720 క్యూసెక్కుల డిశ్చార్జి ఉండగా మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి 600 క్యూసెక్కులను పంపుతున్నారు. ఇందులో 525 క్యూసెక్కులను తిరిగి హైదరాబాద్ నీటి సరఫరా కోసం జలమండలి సేకరిస్తున్నది. స్వల్పంగా మిగులుతున్న నీటితో అక్కంపల్లి రిజర్వాయర్‌లో రోజుకు 0.1 మీటర్ల నీటిమట్టం పెరిగి ప్రస్తుతం 235.7 మీటర్లతో 0.14 టీఎంసీల నిల్వకు చేరుకున్నది. డ్రెడ్జింగ్ పనుల్లో కాల్వ తీస్తున్న క్రమంలో సాగర్ జలాశయంలో అడ్డువచ్చిన ఒక పెద్ద బండరాయిని నీటిలోనే (అండర్ వాటర్ బ్లాస్టింగ్) పేల్చివేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది పూర్తయితే డిశ్చార్జి 800–900 క్యూసెక్కులకు పెరిగే అవకాశాలున్నాయి. దానివల్ల అక్కంపల్లి రిజర్వాయర్‌లో వారం, పది రోజుల్లో నీటిమట్టం పెరిగితే వెంటనే ఉదయ సముద్రంకు విడుదల చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. తద్వారా నల్లగొండ, పరిసరాల్లో 235 గ్రామాల తాగునీటి సరఫరా సమస్య పరిష్కారం కానుంది.

మరో ప్రయత్నం..

ఆనవాయితీగా కృష్ణా బేసిన్‌లో వచ్చిన నీటిని వచ్చినట్టుగా కర్ణాటక ఒడిసిపడుతూ వస్తున్నది. కానీ జాతీయ, అంతర్జాతీయ నిబంధనలు ప్రధాన నదీ మార్గాన్ని పూర్తిగా నిరోధించేందుకు అంగీకరించవు. జాతీయ ట్రిబ్యునల్ ఆదేశం మేరకు పర్యావరణ కోణంలో నదీ మార్గంలో ఎన్విరాన్ ఫ్లో కింద ప్రవాహసామర్థ్యంలో కనీసంగా 15–20 శాతం నీటి ప్రవాహం ఉండేలా ఆయా రాష్ర్టాలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ మేరకు జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఏ రాష్ట్రమైనా ఇందుకు అంగీకరించకుంటే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను సంప్రదించాలని కూడా సూచించింది. ఆ ఆదేశాలను ఆసరాగా చేసుకొని ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా ఎన్విరాన్ ఫ్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నీటిపారుదల శాఖ కృష్ణా నదీ యాజమాన్య బోర్డును సంప్రదించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఫలితంగా నారాయణపూర్ నుంచి ఏ కొంతమేర నీటిని వదిలినా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఉంటుందనేది అధికారుల అంచనా.



కాంటినెంటల్ హాస్పిటల్‌లో ఫ్రీడం ఫర్ స్ట్రోక్ అంబులెన్సును ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ గురు ఎస్ రెడ్డి తదితరులు

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- ప్రైవేటు దవాఖానలకు మంత్రి లక్ష్మారెడ్డి పిలుపు
- 'ఫ్రీడం ఫర్ స్ట్రోక్' మొబైల్ వాహనం ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/శేరిలింగంపల్లి: వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన, చైతన్యం ఎంతో అవసరమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి వెంటనే వైద్యసాయం అవసరమని, 24 గంటల్లోపు వైద్యం అందితే వారిని కాపాడుకునే అవకాశం ఉందని తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల కోసం అత్యాధునిక వసతులతో 'ఫ్రీడం ఫర్ స్ట్రోక్' పేరిట గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోని కాంటినెంటల్ దవాఖాన అందుబాటులోకి తెచ్చిన ఉచిత అంబులెన్సును మంత్రి సోమవారం ప్రారంభించారు. వ్యాధులపై అవగాహన, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం తరఫున ప్రజల్లో విస్తృత ప్రచారం చేపడుతున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు సహాయం కోసం మొబైల్ సేవలను అందించేందుకు 040–67000000 నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ గురు ఎస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంటినెంటల్ సీఈవో మణియన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంద కేజ్ కల్చర్ కేంద్రాల అభివృద్ధికి నిధులు

- **ఆదర్శ వర్సిటీగా ఇఫ్లూ**
- **మత్స్యపరిశ్రమ, ఇఫ్లూ అభివృద్ధిపై సమీక్షలో కేంద్రమంత్రి దత్తాత్రేయ**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వంద కేజ్ కల్చర్ కేంద్రాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తున్నదని కేంద్ర కార్మికశాఖమంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. కొత్త పరిజ్ఞానంతో కేజ్ కల్చర్ ద్వారా చేపల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇఫ్లూ కోసం పోచంపల్లిలో వంద ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని, అయితే అక్కడ ఫ్లోరైడ్ సమస్య ఉన్నందున మరోచోట 200 ఎకరాలు ఇవ్వాలని కోరారు. ఇఫ్లూను అంతర్జాతీయ స్థాయిలో ఆదర్శ వర్సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మత్స్య పరిశ్రమ, ఇఫ్లూ అభివృద్ధిపై సోమవారం హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథిగృహంలో జాతీయ మత్స్యపరిశ్రమ అభివృద్ధి మండలి సీఈవో రాణి కుముదిని, ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ సురేశ్‌తో సమీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి దత్తాత్రేయ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 కోట్ల చేప పిల్లలను చెరువుల, కుంటల్లో వదిలినప్పటికీ, ఉత్పత్తి తక్కువగా వస్తున్నదన్నారు. మోడల్ ఐటీఐగా తీర్చిదిద్దేందుకు మల్లేపల్లి ఐటీఐని కేంద్రం ఎంపిక చేసిందన్నారు.

ఇంజినీరింగ్ బీ కోటా సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా (బీ కోటా) సీట్ల భర్తీ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు స్వస్తి పలికేందుకు రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చర్యలు చేపట్టింది. యాజమాన్య కోటా సీట్లు కోరుకునే విద్యార్థుల దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్ చేయనున్నది. కాలేజీలవారీగా బీ కోటా సీట్లు కోసం ఇకపై ఉన్నతవిద్యామండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అందుకు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు.



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ నరసింహన్ దంపతులు

తుదిదశకు బతుకమ్మ చీరల తయారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరల తయారీ తుదిదశకు చేరుకుంది. వచ్చే వారం నుంచి జిల్లాలకు సరఫరా చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టెస్కో ఈ చీరలను జిల్లా కేంద్రాలకు తరలించనుంది. అక్కడి నుంచి గ్రామాలకు పంపిణీచేసే బాధ్యత డీఆర్డీవో అధికారులది. గ్రామాల్లో లబ్ధిదారులకు చీరలను అందించే బాధ్యతను గ్రామ సమాఖ్యలకు అప్పగించారు. దీని కోసం గ్రామస్థాయిలో ముగ్గురు వ్యక్తులతో కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ సమాఖ్య నుంచి ఒకరు, వీఆర్వో లేదా గ్రామ కార్యదర్శి, రేషన్ డీలరు సభ్యులుగా ఉంటారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన 18 ఏండ్ల పైబడిన మహిళలకు ఈ చీరలు అందించనున్నారు. సిరిసిల్లలో యుద్ధప్రాతిపదికన చీరల తయారీ కొనసాగుతున్నది. ఇప్పటివరకు 60 లక్షల చీరల తయారీ పూర్తికాగా.. మిగతావి ఈ నెలాఖరుకు పూర్తి చేస్తారు. అర్హులైన మహిళలు సుమారు 97లక్షల వరకు ఉంటారని అంచనా.



సోమవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఫొటోల ప్రదర్శనలో ఫొటోలను పరిశీలిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి తదితరులు

వ్యాసం చెప్పలేనిది.. చిత్రం చెప్తుంది!

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- రవీంద్రభారతిలో 400 చిత్రాలతో ప్రదర్శన ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టన్నులకొద్దీ రాసిన వ్యాసాలు చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటో అందరికీ అర్థమయ్యేలా చెప్తుందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ, తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ సంయుక్తంగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫొటో ప్రదర్శనను అల్లం నారాయణతో కలిసి భాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి సోమవారం ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా ఉన్న ఫొటోలను చూసేందుకు అందరు తరలిరావాలని మీడియా అకాడమీ చైర్మన్ కోరారు. వైల్డ్‌లైఫ్ ఫొటో జర్నలిజం కంటే న్యూస్ పేపర్ జర్నలిజం చాలెంజ్‌తో కూడుకున్నదని, వారి నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకే ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని మామిడి హరికృష్ణ తెలిపారు. పత్రికారంగంలో ఫొటో జర్నలిజం ఒక విప్లవమని, సాంకేతిక అభివృద్ధికి నిదర్శనమని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ పల్లెలు, చారిత్రక విషయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫొటోలను ఒకే వేదికపై ప్రదర్శించటం అభినందనీయమన్నారు. ఆగస్టు 19 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో 400 ఫొటోలు కొలువుదీరాయి. ఆగస్టు 19న ఉత్తమ ఫొటోలను ఎంపికచేసి, 15 ప్రధాన బహుమతులు, ఆరు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామని తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు జీ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిన్నా యాదగిరి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఫొటోలను పరిశీలించిన జ్యూరీ సభ్యులు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీకి వచ్చిన ఫొటోలను జ్యూరీ సభ్యులు సోమవారం పరిశీలించారు. మొదటి క్యాటగిరీ కింద 389, ద్వితీయ క్యాటగిరీ కింద 236, తృతీయ క్యాటగిరీ కింద 195 ఫొటోలు వచ్చాయి. ఫొటోలను పరిశీలించినవారిలో జేఎన్‌ఏ అండ్ ఎఫ్‌ఏ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ ప్రదీప్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏఆర్ కమల్ రాయ్, ఫొటో జర్నలిస్టు డీ రవీందర్‌రెడ్డి, సమాచారశాఖ జాయింట్ డైరెక్టర్ ఈ వెంకటేశం, జాయింట్ డైరెక్టర్ ఎస్ ఏ హష్మి ఉన్నారు.

వీఆర్వో, వీఆర్‌ఏలను రెవెన్యూశాఖలోనే కొనసాగించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్వో, వీఆర్‌ఏలను వ్యవసాయశాఖలో విలీనం చేయాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని రెవెన్యూ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇన్‌చార్జీ సీసీఎల్‌ఏగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం ఇవ్వాలని జేఏసీ తీర్మానించింది. హైదరాబాద్‌లోని హోటల్ హరితప్లాజాలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. వీఆర్వో, వీఆర్‌ఏల వ్యవస్థను వ్యవసాయశాఖలో విలీనం చేసి, గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రైతు సమాఖ్యల కింద పనిచేయించాలని ప్రభుత్వం భావిస్తున్నదని లచ్చిరెడ్డి అన్నారు. దీనివల్ల భూమి రికార్డులకు సంబంధించి గందరగోళం ఏర్పడే పరిస్థితి ఉన్నదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాజీ నాయకుడు లక్ష్మయ్య, తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు గౌతమ్‌కుమార్, వీఆర్వోల సంఘం నాయకులు గోల్కొండ సతీశ్, బాణాల రాంరెడ్డి, వీఆర్‌ఏ సంఘం నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా వైరా మండలం అష్ణగుర్తి గ్రామంలో మీడియాతో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

త్వరలో 2,500 ఇంజినీర్ పోస్టుల భర్తీ

మొదటిపేజీ తరువాయి...

జారీ చేస్తామన్నారు. ఇందులో 1,800 బీట్ ఆఫీసర్లు, 200 రేంజ్ ఆఫీసర్ల పోస్టులున్నాయని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారికి బీట్ ఆఫీసర్ ఉద్యోగ నియామకాలు చక్కటి అవకాశమన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోనూ 400 డాక్టర్ల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 15వేల ఉద్యోగాల నియామకాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ పునర్నిర్మాణానికి అవసరమైన ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఉద్యోగాల భర్తీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండ బాలకోటేశ్వరరావు, అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల జోష్

- ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు
- 30 శాతం పెరిగిన విద్యార్థుల సంఖ్య
- నయా పైసా లేకుండా అడ్మిషన్లు
- రూ.320 కోట్లతో వసతుల కల్పన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఇందుకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఓ ఉదాహరణ. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది ప్రవేశాలు భారీగా పెరిగాయి. గత రెండు విద్యాసంవత్సరాల వరకు వీటిల్లో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం కోర్సులకు కలిపి కేవలం 1.30 లక్షల మంది విద్యార్థులే ప్రవేశాలు పొందగా.. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వల్ల 2017-18 విద్యా సంవత్సరంలో గతంకంటే 30 శాతం అదనంగా ప్రవేశాలు పెరిగాయని తెలంగాణ ఇంటర్ బోర్డు సెక్రటరీ తెలిపారు. ప్రస్తుతం మొదటి, రెండో సంవత్సరాల్లో కలిపి మొత్తం 1.99 లక్షలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎన్నడూ లేనివిధంగా 1,02,000 మంది విద్యార్థులు, సెకండియర్‌లో ఇప్పటికే 97 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలోని వివిధ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నిరకాల గురుకులాల్లో 28వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. రానురాను ప్రైవేటు జూనియర్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 1,600 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ఇప్పటి వరకు 1,250 కాలేజీలకే అఫిలియేషన్లు ఇచ్చారు. మిగిలిన 350 కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చే అవకాశం లేదని, ఆయా కాలేజీలు అవసరమైన డాక్యుమెంట్లు, ఎఫ్‌డీఆర్, ఆర్ ఎల్‌డీ, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు దాఖలు చేయలేదని ఇంటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా కళాశాలల్లో చేరాల్సిన విద్యార్థులు కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీలవైపు మొగ్గుచూపుతున్నారు.



ఓ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్న సిబ్బంది (ఫైల్)

సకల సౌకర్యాలు

నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యానికి అనుగుణంగా రూ. 310 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేస్తున్నారు. భవనాల నిర్మాణాలతోపాటు వాటిల్లో విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రక్షిత మంచినీటి కోసం ప్రతి జూనియర్ కాలేజీలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేశారు. విద్యార్థులు, అధ్యాపకులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలుపరుస్తున్నారు. క్రీడలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయడం లేదు. ఉచితంగా పుస్తకాలను కూడా అందిస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులందరూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందడానికే మొగ్గుచూపుతున్నారు. ఫలితాలను మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని ఇటీవల డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. ఇది అమలైతే విద్యార్థుల ప్రవేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మరో డ్రగ్స్‌డాన్ నవ్యాంత్ అరెస్టు

- కెల్విన్ అరెస్టవగానే గోవాకు పరారీ
- నేడు రేవ్ పార్టీకి ప్లాన్.. భగ్నం చేసిన పోలీసులు
- నైజీరియన్ ముఠాతో బలమైన బంధాలు
- పది లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

నైజీరియన్ డ్రగ్స్ ముఠాకు కెల్విన్ గ్యాంగ్‌తో ఉన్న దోస్తీలో మరొక కీలకవ్యక్తి నూక నవ్యాంత్‌ను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నైజీరియన్ గ్యాబ్రియల్‌తో పాటు మరో ముగ్గురిని కూడా అరెస్టు చేసి మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈ ముఠాకు సినీప్రముఖులు, సెలబ్రిటీలు, జూనియర్ ఆర్టిస్టులు, మహిళా సింగర్లతో సంబంధాలు ఉన్నట్టు నిర్ధారించారు. సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ గచ్చిబౌలి పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 'గత నెల జూలై 23న ఎల్బీనగర్ బస్టాప్‌లో అనుమానాస్పదంగా కనిపించిన విజయవాడకు చెందిన సంగీత, నైజీరియన్ కాస్మోస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నైజీరియన్ల డ్రగ్స్ దందా బయటపడింది. సంగీత, కాస్మోస్‌తోపాటు హెన్రీ, జాన్‌పాల్, ఓకోరీ, సిరిల్‌ను అరెస్టు చేశాం. విచారణలో గోవా నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న గ్యాబ్రియల్‌ను కీలక సూత్రధారిగా అనుమానించాం. ప్రత్యేక బృందాలతో నిఘాపెట్టి యాప్రాల్ గ్రీన్‌వుడ్ కాలనీలో గ్యాబ్రియల్‌ను అరెస్టు చేసి విచారించగా కీలకసూత్రధారి నూక నవ్యాంత్‌గా తేలింది. అతనికి ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేసిన కెల్విన్‌తో సంబంధం ఉన్నదని తేలింది. కెల్విన్ అరెస్టుకాగానే నవ్యాంత్ హైదరాబాద్ నుంచి గోవాకు మకాం మార్చాడు. స్పెషల్ ఆపరేషన్‌ను నిర్వహించి నవ్యాంత్‌ను అదుపులోకి తీసుకొచ్చి విచారించగా డ్రగ్స్ ఉపయోగిస్తున్నవారి పేర్లు, సరఫరా చేస్తున్న పబ్స్, అనుచరుల పేర్లను వెల్లడించాడు. ఈ వివరాలతో సోమవారం అంకిత్ పాండే, బోలారెడ్డి ఘనత్‌కుమార్‌రెడ్డిని అరెస్టుచేశాం. వీరి నుంచి యాఫెంటామైన్ పిల్స్-450, మెటాఫెంటామైన్-45 గ్రాములు, ఎల్‌ఎస్డీ 60 ప్యాకెట్లు, కొకైన్ 0.5 గ్రాములు, హషీష్ 0.65 గ్రాములు, చంగ 0.35, గంజాయి 60 గ్రాములు, రూ.40వేల నగదు, పాసుపోర్టు, ల్యాప్‌టాప్, ఆరు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నాం. ఈ కేసులో ఇప్పటికే నోటీసులు అందుకుని రక్త నమూనాలను ఇచ్చిన పవన్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతను మత్తు పదార్థాలను సరఫరా చేసినట్టు దర్యాప్తులో తేలింది' అని కమిషనర్ మహేశ్‌భగవత్ చెప్పారు. వీసా గడువు ముగిసిన ముగ్గురు నైజీరియన్లను స్వదేశాలకు డిపోట్ చేశామని తెలిపారు. విదేశీయులకు ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వివరాలను ఎఫ్‌ఆర్‌ఆర్వో కార్యాలయంలో రిజిస్టర్ చేయాలని, ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని సూచించారు. లేకుంటే నేరం అవుతందని వివరించారు. రాచకొండ కమిషనరేట్‌లో ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన 560 మందిలో 150 మంది చిరునామాల్లో లేరని చెప్పారు. సమావేశంలో జాయింట్ సీపీ తరుణ్‌జోషి, ఎల్బీనగర్ డీసీపీ ఎంవీ రావు, క్రైం డీసీపీ జానకి తదితరులు పాల్గొన్నారు. ముఠాలో కీలక వ్యక్తులను పట్టుకున్న ఎస్వోటీ సిబ్బందిని సీపీ మహేశ్‌భగవత్ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు.



పట్టుకున్న డ్రగ్స్‌ను, నిందితులను మీడియాకు చూపుతున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్

వాట్సప్‌లో గ్రూప్స్...ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు

గ్యాబ్రియల్, నవ్యాంత్‌లు ఇంజినీరింగ్ విద్యార్థులు, పబ్‌లకు వచ్చేవారితో వాట్సప్‌గ్రూపులు ఏర్పాటుచేసుకొని మత్తు పదార్థాలను సరఫరా చేశారు. పబ్‌లలో డీజేలను ఏజెంట్‌గా నియమించుకుని దందాను విస్తరించారు. ఆల్ఫాబే వెబ్‌సైట్ ద్వారా నవ్యాంత్ డ్రగ్స్ కొనుగోలు చేసి పోస్టులో తెప్పించుకుంటున్నాడు. 15 రోజులకు ఒక్కసారి నెదర్లాండ్స్ నుంచి కూడా డ్రగ్స్ తెప్పిస్తున్నాడు. థాయ్‌లాండ్ కేంద్రంగా ఈ వెబ్‌సైట్ పనిచేస్తున్నది. పబ్‌లు, రిసార్టుల్లో రేవ్ పార్టీలను ఏర్పాటుచేస్తున్నారు. సెలబ్రిటీలు, సినీప్రముఖులకు ఈవెంట్ మేనేజర్‌గా పరిచయమైన నవ్యాంత్ వారాంతాల్లో రేవ్‌పార్టీలు నిర్వహించి అందరినీ డ్రగ్స్ మత్తులో ఊపేస్తున్నాడు. తాజాగా అదుపులోకి తీసుకున్నప్పుడు గోవాలో ఆగస్టు 15న భారీ రేవ్‌పార్టీ నిర్వహించడానికి ఏర్పాటుచేసినట్లు చెప్పడంతో, గోవా పోలీసులను రాష్ట్ర మన పోలీసులు అప్రమత్తం చేశారు. నవ్యాంత్ వాంగ్మూలంలో కేపీహెచ్‌బీ మలేషియా టౌన్‌షిప్‌లో ఉంటున్న బోలారెడ్డి ఘనత్‌కుమార్‌రెడ్డి వ్యవహారం బయటకొచ్చింది. పోలీసులు వెళ్లి ప్రశ్నించగా, అతని తండ్రి స్వచ్ఛందంగా సహకరించాడు. చాలాసార్లు చెప్పినా వినకుండా మా కొడుకు మత్తులో ఉంటున్నాడని, తన కొడుకును మార్చాలని విజ్ఞప్తి చేశాడు.

కొనసాగుతున్న తొలివిడుత దర్యాప్తు

డ్రగ్స్ రాకెట్ కేసు దర్యాప్తులో సిట్‌అధికారులు వేగం పెంచారు. తొలివిడుతలో పట్టుబడిన ప్రధాన నిందితులు కెల్విన్, మైక్ కమింగ, నిఖిల్‌శెట్టి, బెర్నార్డ్ బెన్, పీయూష్ అలీ కాల్‌డాటా ఆధారంగా సినీ ప్రముఖులను సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే. సినీరంగానికి చెందిన 12 మందిని విచారించి దర్శకుడు పూరీ జగన్నాథ్, నటుడు తరుణ్ నుంచే గోళ్లు, వెంట్రుకలు, రక్త నమూనాలను సేకరించారు. మిగతా 10 మందిని తనిఖీచేసిన వైద్యుల ప్రాథమిక నివేదికను బట్టి వారంతా ఫిట్‌గా లేరని గుర్తించినట్టు తెలిసింది. ఎఫ్‌ఎస్‌ఎల్‌కి అందిన నమూనాల నివేదిక 90 రోజుల్లో వస్తుందని సిట్ బృందం అంచనా వేస్తున్నది. ఆరునెలల కంటే ముందు డ్రగ్స్ తీసుకుంటే నివేదికలో ఏమీ తేలకపోవచ్చని ఫోరెన్సిక్ డాక్టర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. నివేదిక వచ్చాకే సాక్ష్యాలు, వాంగ్మూలాలు, వెల్లడైన లింకుల వివరాలతో సిట్ చార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా పట్టివేత



నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన ముఠా సభ్యులు



సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ బీ లింబారెడ్డి

- ఐదుగురు అరెస్టు.. నిందితుల్లో హెడ్‌మాస్టర్
- 430 నకిలీ సర్టిఫికెట్లు.. 170 స్టాంపులు స్వాధీనం

కంటోన్మెంట్: నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ఓ ముఠాను సికింద్రాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో డీసీపీ బీ లింబారెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లాకు చెందిన వంగాల లచ్చిరెడ్డి (52) ఎంఏ ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ ఎంఈడీ పూర్తిచేశాడు. కొంతకాలం ఏపీలోని ప్రకాశం జిల్లాలో బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ 2001లో మిర్యాలగూడలో వీఎంఆర్ ఒకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుచేశాడు. విద్యార్థులకు నకిలీ సర్టిఫికెట్లు అంటగట్టి 2002లో మిర్యాలగూడ జైలుకెళ్లాడు. తర్వాత ఈయనకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం సోమవారిగూడెం ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ కస్తూరి నందికేశ్వర్(57) జతకలిశాడు. విద్యార్థులకు బీఈడీ సీట్లు ఇప్పిస్తానని నమ్మించి లక్షలు కాజేసి 2003లో మళ్లీ జైలుకెళ్లాడు. నాలుగేండ్ల తర్వాత మరో రెండుసార్లు చీటింగ్ కేసులో లచ్చిరెడ్డి జైలుకెళ్లాడు. నందికేశ్వర్ ఏదోవిధంగా తిరిగి ఉద్యోగంలో చేరాడు. తర్వాత 2011లో హైదరాబాద్‌కు మకాం మర్చారు. ఇక్కడ మహ్మద్ అలీతో కలిసి తిరిగి వ్యాపారం ప్రారంభించారు. కొంతకాలానికి మహ్మద్ అలీ మృతిచెందగా, లచ్చిరెడ్డి సొంతంగా సర్టిఫికెట్లను తయారుచేయడం ప్రారంభించాడు. స్టాంపు వెండర్లు జీ హంసరాజు, బీ సుభాష్ అలియాస్ సురేశ్ నుంచి వర్సిటీలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ అధికారుల స్టాంపులు సమకూర్చుకున్నాడు. కర్మన్‌ఘాట్‌లో ఇంట్లో నకిలీ సర్టిఫికెట్ల తయారీని ముమ్మరం చేశాడు. వనస్థలిపురంలో ఉండే హెడ్‌మాస్టర్ నందికేశ్వర్ బావమరిది కార్తీక్‌ను ఏజెంట్‌గా చేర్చుకున్నారు. అభ్యర్థుల అవసరాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్ రూ.80 వేల నుంచి లక్ష వసూలు చేసి పంచుకుంటున్నారు. సోమవారం సికింద్రాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్ వద్ద ఓ వ్యక్తికి నకిలీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు కార్తీక్ ప్రయత్నిస్తుండగా సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదుపులోకి తీసుకొన్నారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు లచ్చిరెడ్డి, హెడ్‌మాస్టర్ నందికేశ్వర్, స్టాంప్ వెండర్లు హంసరాజు, సుభాష్‌లను కూడా ఆదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 430 నకిలీ సర్టిఫికెట్లు, 170 రబ్బరు స్టాంపులు, కలర్ ప్రింటర్ ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు శేషుకుమార్, హరిబాబు, రవీందర్ పరారీలో ఉన్నట్టు డీసీపీ లింబారెడ్డి తెలిపారు. వీరిపై పీడీయాక్టు నమోదుచేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డికి నివేదిక అందజేస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సాయిని శ్రీనివాస్, ఎస్సై బీ కాంతారెడ్డి, కానిస్టేబుళ్లు నవీన్, సందీప్ పాల్గొన్నారు.

కృష్ణా జలాల కేసును నేను విచారించలేను

- ధర్మాసనం నుంచి తప్పుకొన్న జస్టిస్ ఖన్విల్కర్
- కేసు తదుపరి విచారణ అక్టోబర్ 24కు వాయిదా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: కృష్ణా జలాల పంపిణీ కేసు నుంచి జస్టిస్ ఖన్విల్కర్ వైదొలిగారు. ఈ కేసు పిటిషనర్లలో మహారాష్ట్ర కూడా ఒక పార్టీగా ఉన్నందువల్ల ఆ రాష్ట్రానికి చెందిన తాను విచారణలో పాల్గొనడం సముచితం కాదని భావిస్తున్నానంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి జస్టిస్ ఖన్విల్కర్ స్వచ్ఛందంగా తప్పుకొన్నారు. దరిమిలా కొత్త ధర్మాసనం ఈ కేసు విచారణ జరుపుతుందని చెప్తూ ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న జస్టిస్ దీపక్ మిశ్రా తదుపరి విచారణను అక్టోబర్ 24వ తేదీకి వాయిదా వేశారు. అంతర్రాష్ట్ర నదీజల వివాదాల చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం తెలంగాణ ప్రభుత్వం రెండేండ్ల క్రితం కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో న్యాయం చేయాలని కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌తోపాటు గతంలో దాఖలు చేసిన రిట్ పిటిషన్లు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లన్నీ కలిపి సోమవారం సుప్రీంకోర్టు విచారించాల్సి ఉంది. అయితే ఈ కేసు విచారణకు ఏర్పాటైన ధర్మాసనంలో జస్టిస్ ఖన్విల్కర్ కూడా ఉన్నారు. వివాదంలో కక్షిదారుగా ఉన్న రాష్ట్రాలకు చెందిన న్యాయమూర్తులు కేసును విచారించ వలసిన సందర్భంలో అభ్యంతరాల మేరకు ధర్మాసనం నుంచి వైదొలుగుతున్నారని తెలంగాణ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కర్ణాటక, తమిళనాడుల మధ్య కావేరీ జల వివాదాల కేసులో లోగడ ఈ విధంగా కర్ణాటకకు చెందిన జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు, కృష్ణా జలాల కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జస్టిస్ ఎన్వీ రమణ, మహారాష్ట్రకు చెందిన జస్టిస్ ఖన్విల్కర్ ఒకసారి ఇదేమాదిరిగా తప్పుకొన్నారని తెలిపారు. దీంతో ప్రస్తుత ధర్మాసనంలో కూడా ఉన్న జస్టిస్ ఖన్విల్కర్ ఈసారి ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయకముందే 'నాట్ బిఫోర్ మీ' అంటూ తనంతతానుగా విచారణ నుంచి వైదొలిగారు.

హజ్‌యాత్రికుల సేవలో తెలంగాణ నం.1

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ యాత్రికులకు కల్పిస్తున్న సదుపాయాల విషయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నదని హజ్‌యాత్ర ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల విషయంలో యాత్రికుల నుంచి వస్తున్న ప్రశంసల నేపథ్యంలో.. లక్నో నుంచి హజ్ కమిటీ ఆఫ్ ఇండియా (హెచ్‌సీఐ) సభ్యుడు అష్రఫ్ హైదరాబాద్ వచ్చి యాత్రికులు బయలుదేరే ప్రాంతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గత మూడేండ్లుగా హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ఏటా ఆరువేల నుంచి ఏడువేల మంది యాత్రికులు హజ్‌కు వెళ్తున్నారు. విమాన ప్రయాణానికి 48గంటల ముందు నుంచి హజ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో యాత్రికులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కలిస్తున్నారు. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో హజ్ కమిటీకి రూ.1.50 కోట్ల బడ్జెట్‌ను మాత్రమే కేటాయించగా.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆ మొత్తాన్ని రూ.మూడు కోట్లకు పెంచారు.

మక్కా చేరిన 900 మంది హజ్‌యాత్రికులు

రాష్ట్రానికి చెందిన 900 మంది హజ్ యాత్రికులు సౌదీలోని పవిత్ర మక్కా నగరానికి సోమవారం చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 2.55 గంటలకు 450 మందియాత్రికుల విమానానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఇతర ముఖ్య నాయకులు జెండా ఊపి వీడ్కోలు పలికారు. మరో 450 మంది యాత్రికుల రెండో బృందం సోమవారం ఉదయం 11.55 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి జెడ్డాకు బయలుదేరింది.


'ముదిరాజ్' పిటిషన్ ఆరు నెలలు వాయిదా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో ముదిరాజ్ కులాన్ని బీసీ 'డీ' నుంచి 'ఏ' గ్రూపునకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, ఉదయ్‌ఉమేశ్, లలిత్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయంపై తాజా వైఖరిని వెల్లడించడానికి ఆరునెలల సమయం కావాలని తెలంగాణ తరపున వాదనలు వినిపించిన స్టాండింగ్ కౌన్సిల్ పాల్వాయి వెంకటరెడ్డి కోరారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని బీసీ కులాల స్థితిగతులను అధ్యయనం చేస్తున్నదని కోర్టుకు తెలిపారు. బీసీ జాబితాలోని కులాల్లో చేయాల్సిన మార్పులు చేర్పులపై స్పష్టత రావడానికి ఆరునెలల సమయం అవసరమని స్పష్టం చేశారు. పిటిషన్‌కు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి రాష్ట్రంలో ముదిరాజ్ కులాన్ని బీసీ జాబితాలోని 'డీ' గ్రూపు నుంచి 'ఏ' గ్రూపులోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీన్ని సవాలు చేస్తూ ఇతర కులాల సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. విచారణ అనంతరం ప్రభుత్వ ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసింది. దీంతో అసంతృప్తికి చెందిన ముదిరాజ్ కులానికి చెందిన పలువురు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

బియాస్ నది సంఘటనపై పిటిషన్లు దాఖలు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: హిమాచల్‌ప్రదేశ్‌లోని బియాస్ నది దుర్ఘటనకు సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వం, కళాశాల యాజమాన్యం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. గతేడాది సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా న్యాయస్థానం విచారణకు స్వీకరించలేదు. దుర్ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించిన తర్వాత మాత్రమే పిటిషన్‌ను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ ప్రక్రియను ముగించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా పిటిషన్లు దాఖలు చేయడంతో సుప్రీం విచారణకు స్వీకరించింది. వివరాల్లోకి వెళితే.. హిమాచల్‌ప్రదేశ్‌లోని బియాస్‌నదిలో 2014 జూన్ 8న జరిగిన దుర్ఘటనలో ఆరుగురు విద్యార్థినులతోపాటు మొత్తం 24 మంది హైదరాబాద్‌లోని విజ్ఞాన్‌జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మృతి చెందారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ఈ సంఘటనను సుమోటోగా తీసుకుని మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా కళాశాల యాజమాన్యానికి, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. అయితే నష్టపరిహారం చెల్లించకుండానే హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో గతేడాది అప్పీల్ చేసింది. దీన్ని స్వీకరించడానికి సుప్రీం నిరాకరించింది. దీంతో ప్రభుత్వం బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని జమ చేసి.. తాజాగా మరో పిటిషన్‌ను దాఖలు చేసింది. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన మిగిలిన మొత్తాన్ని నాలుగు వారాల్లో జమచేయాలని జస్టిస్ ఖేహర్, జస్టిస్ లలిత్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

పంద్రాగస్టు ప్రత్యేకం



రాడ్‌క్లిఫ్ నెత్తుటి గీత!

న్యూఢిల్లీ, ఆగస్టు 14: దాదాపు 190 ఏండ్లు భారతదేశాన్ని ఏలిన ఆంగ్లేయులు పోతూ పోతూ దేశంలో పెట్టిన విభజన చిచ్చు నేటికీ దాయాది దేశాల మధ్య రగులుతూనే ఉన్నది. దేశ విభజన కారణంగా దాదాపు ఒకటిన్నర కోట్ల మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. దాదాపు పది లక్షల మందిని బలితీసుకున్న విభజన గీత నేటికీ రక్తమోడుతూనే ఉన్నది. వందేండ్ల పోరాటం అనంతరం భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారియైన రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు.



విభజన నాటికి..

40 కోట్లు — నేటి పాక్, బంగ్లాదేశ్ కలుపుకొని 1947లో దేశ విభజన జరిగే నాటికి భారతదేశ జనాభా.

40 రోజులు — దేశాన్ని విభజించడానికి బ్రిటీష్ న్యాయాధికారి సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు ఇచ్చిన గడువు.

6,100 కిమీ — దేశ విభజనతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఏర్పడిన సరిహద్దు పొడవు. పశ్చిమ, తూర్పు పాకిస్థాన్ (బంగ్లాదేశ్) మధ్య దూరం 1,609 కిలోమీటర్లు

0 — దేశ విభజన గురించి జూన్ 3, 1947లో బహిరంగ ప్రకటన చేసిన సందర్భంగా బ్రిటన్ ప్రధాని క్లైమెంట్ అట్లీ, చివరి వైస్రాయ్ లూయిస్ మౌంట్‌బాటెన్ ఒక్కసారి కూడా పాకిస్థాన్ అనే పదాన్ని ఉచ్ఛరించలేదు.

83 వేల మంది — దేశ విభజన సందర్భంగా జరిగిన హింసలో అపహరణ లేదా లైంగిక దాడికి గురైన బాలికలు, మహిళల సంఖ్య.

1.5 కోట్ల మంది — విభజన నేపథ్యంలో పాకిస్థాన్‌కు వెళ్లిన ముస్లిములు, భారత్‌కు వచ్చిన హిందువులు, సిక్కులు.

దేశవిభజన.. నెత్తుటి చరిత్ర..



దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ, ఇటూ ప్రయాణించారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా సదుపాయం ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా చెలరేగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పది లక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేలాదిమంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజన కారణంగా.. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివెళ్తున్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ నగరం గుడారాల నగరంగా మారిపోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలిపెట్టి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని పాకిస్థాన్‌కు వెళ్లటానికి సిద్ధమైన వేలాదిమంది ముస్లింలు.. ఢిల్లీలోని హుమాయూన్ సమాధి వద్ద తలదాచుకున్నారు. అక్కడున్న ఉద్యానవనాలన్నింటా గుడారాలు కిక్కిరిసి పోయాయి. అక్కడి సుందరమైన ఫౌంటేన్లు.. మానవ వ్యర్థాలతో నిండిపోయాయి. దుర్వాసనను అడ్డుకోవటం కోసం వాటిని మట్టితో కప్పివేశారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులది ఇదే పరిస్థితి. ఆ సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్నదంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్‌లోనూ ఇదే పరిస్థితి. అనేక కాలేజీలు వలసప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారాన్ని రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేలాదిమంది మరణించారు.

భారత్‌పై అవగాహన లేని రాడ్‌క్లిఫ్



కేవలం ఓ పెన్సు గీతతో దేశాన్ని రెండు ముక్కలు చేసేందుకు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్ భారత్‌కు జూలై 8న వచ్చారు. ఆయన అంతకుమునుపెన్నడూ భారత్‌ను సందర్శించలేదు. ఇక్కడి సామాజిక రాజకీయ సంస్కృతి గురించి ఆయనకు ఎటువంటి అవగాహన లేదు. అటువంటి వ్యక్తి ఎందుకు వచ్చినట్టు అన్న ప్రశ్నకు తనకు అప్పగించిన బాధ్యతను తన దేశానికి చేస్తున్న సేవగా ఆయన భావించారు. స్వల్ప వ్యవధిలో పాత గజం కాల ప్రకారం దేశాన్ని విభజించేందుకు ఆయన తొలుత విముఖత చూపినప్పటికీ ఆ తరువాత ఒప్పుకొన్నారు. భారత్ నుంచి పాకిస్థాన్‌ను వేరు చేసే గీత గీసి వెళ్లిపోయిన రాడ్‌క్లిఫ్ మరెన్నడూ తిరిగి రాలేదు. తన విధి నిర్వహణకు గాను బ్రిటీషు ప్రభుత్వం ఇచ్చిన మూడువేల పౌండ్ల ఫీజును కూడా ఆయన తిరస్కరించారు.

ఆ గీత తనను రెండు దేశాలలోనూ దుష్టుడిని చేసిందని రాడ్‌క్లిఫ్ ఒకానొక సందర్భంలో వాపోయారు. ఆగస్టు 15కు ముందే గీత గీయాలని నెహ్రూ, జిన్నా, పటేల్ తనపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. 'అందువల్ల వారికోసం ఓ గీత గీశాను.. ఆ గీత ఒక దేశాన్ని.. ఒక గుండెను రెండు ముక్కలు చేసింది. నేను మహాత్మాగాంధీని కలిసినపుడు దేశ విభజన భారీ హింసను సృష్టిస్తుందని చెప్పారు. తనకిచ్చిన స్వల్ప వ్యవధిలో అంతకు మించి తానేం చేయలేకపోయానని, కనీసం రెండు మూడేళ్ల సమయం ఇచ్చి ఉంటే ఫలితం మరోలా ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు.

లాహోర్‌ను తొలుత భారత్‌కే కేటాయించారు



రాడ్‌క్లిఫ్‌కు అందజేసిన భారతదేశ చిత్రపటంలో జిల్లాల సరిహద్దు గీతలు లేవు. దీంతో ఆయనకు తోచినట్టు ఓ గీత గీశారు. అప్పుడు లాహోర్ నగరం భారత్‌కు దక్కింది. వెంటనే ఆయన సహాయకుడు అది చూసి.. పాకిస్థాన్‌కు పెద్ద నగరం ఒక్కటి కూడా దక్కలేదని చెప్పాడట. అప్పుడు లాహోర్‌ను పాక్‌కు కేటాయించారు. ముస్లింలు అధికంగా ఉన్న సింధ్, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లను పూర్తిగా పాకిస్థాన్‌కు కేటాయించారు. కానీ పంజాబ్, బెంగాల్ విషయంలో రాడ్‌క్లిఫ్ సందిగ్ధంలో పడ్డారు. ఈ రెండు ప్రావిన్స్‌లలో హిందువులు లేదా ముస్లింలు మెజారిటీగా లేరు. దీంతో ఆయన బెంగాల్‌కు మధ్య ఒకటి, పంజాబ్ మధ్యలో ఒకటి గీతలు గీశారు. దీంతో తూర్పు బెంగాల్ పాకిస్థాన్‌కు, పశ్చిమ బెంగాల్ భారత్‌కు దక్కాయి. అలాగే పశ్చిమ పంజాబ్ పాకిస్థాన్‌కు తూర్పు పంజాబ్ భారత్‌కు వచ్చాయి. తూర్పు బెంగాల్ ఆ తరువాత బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించింది.

2021వరకు బిగ్‌బెన్ పనిచేయదు

క్లాక్‌టవర్‌కు మరమ్మతులు చేపట్టనున్న అధికారులు



లండన్, ఆగస్టు 14: ప్రపంచ ప్రసిద్ధ లండన్ బిగ్‌బెన్ క్లాక్ టవర్ 2021వరకు పనిచేయదు. బిగ్‌బెన్ గంటలకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గడియారాన్ని నిలిపివేయనున్నారు. వచ్చే సోమవారం అర్ధరాత్రి గడియారం గంటలు చివరిసారి మోగనున్నాయి. ఆ తర్వాత నాలుగేండ్లపాటు మరమ్మతులు జరుపనున్నారు. ఈ నేపథ్యంలో గడియారం చప్పుళ్లు మరో నాలుగేండ్లపాటు వినిపించవని అధికారులు తెలిపారు. అయినప్పటికీ కొత్త సంవత్సరంతోపాటు ముఖ్యమైన ఘట్టాల సమయంలో గంటలు మోగుతాయని వారు పేర్కొన్నారు. 157ఏండ్లపాటు నడిచిన ఈ గడియారానికి 1983-85 మధ్యలో మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత 2007లో మరోసారి మూగబోయింది. బిగ్‌బెన్ క్లాక్‌టవర్‌గా ప్రసిద్ధిపొందిన ఈ నిర్మాణం ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్స్ ఎలిజబెత్ టవర్‌లో భాగం. మరమ్మతులతోపాటు టవర్‌లో కొత్త సదుపాయాలు కల్పించబోతున్నామని, లిఫ్ట్, మరుగుదొడ్డి, వంటగదిని నిర్మించనున్నామని ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ ఆడమ్ వాట్రోబ్‌స్కీ తెలిపారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో వ్యాపారం అని ఆన్‌లైన్‌లో రూ.2 కోట్లు టోకరా

- నకిలీ అకౌంట్లలో నగదు జమ చేసిన ముంబై వాసి
- 108 నకిలీ ఖాతాలను గుర్తించి స్తంభింపజేసిన పోలీసులు

ముంబై, ఆగస్టు 14: ఆఫ్ఘనిస్థాన్‌లో 'యూఎస్ ఆర్మీ పర్సనల్ పోస్ట్' వ్యాపారం అని ముంబైకి చెందిన 72 ఏండ్ల వ్యక్తిని ఓ ముఠా మోసం చేసింది. సులభంగా డబ్బులు సంపాదించొచ్చని అమెరికాకు చెందిన ఓ వ్యక్తి ఆయనను భాగస్వామ్యం తీసుకోవాలంటూ నమ్మబలికాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమై వాట్సప్‌లో చాటింగ్ చేశాడు. కొద్దిరోజుల తర్వాత కంపెనీ పేరుతో ధ్రువపత్రాన్ని వాట్సప్‌లో పంపించాడు. ఢిల్లీలోని జాతీయ బ్యాంకును సంప్రదించాలని అందులో కోరారు. ఆ తర్వాత బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా ఓ మహిళ పెద్దాయనతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత ఈ ముఠా నగదును ఖాతాలో వేయమని అడుగడంతో రూ.1.92 కోట్లు జమచేశారు. కొద్దిరోజుల తర్వాత అతనికి డెబిట్ కార్డు వచ్చింది. అందులోంచి నగదు తీసేందుకు ప్రయత్నిస్తే అది నకిలీ కార్డు అని తెలిసింది. తనను మోసం చేశారని గ్రహించిన ఆయన ఈ మార్చిలో ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో వ్యాపారం కోసం డబ్బులు పెడితే లాభం వస్తుందని పెద్దాయనను దోపిడీ ముఠా ఏమార్చిందని పోలీసులు చెప్పున్నారు. నకిలీ పాన్ కార్డులతో ముంబైతోపాటు ఢిల్లీలో 108 బ్యాంకు ఖాతాలు తెరిచారని పేర్కొన్నారు. ఈ కేసులో మంగల్ బిష్ణోయ్, అమిత్ అగర్వాల్, సమీర్ మర్చంట్ అలియాస్ శర్మ, జితేంద్ర రాథోడ్, పరేశ్ నిశ్బాంద్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఖాతాలు అన్నింటిలో కేవైసీలో ప్రధాన ధ్రువీకరణ పాన్ కార్డును జతపరిచారు. వాటిని పోలీసులు పరిశీలించగా అవి నకిలీవని నిర్ధారణ అయ్యింది. ముంబైలోని నయనగర్‌కు చెందిన మహమ్మద్ ఆరిఫ్ షేక్ కార్యాలయంలో అనేక పత్రాలు, 11 పాన్ కార్డులు లభించాయి. అయితే ఎవరి సహాయంతో అవి తయారు చేస్తున్నారో విచారణలో తెలుస్తుందని ఓ సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. ఈ నకిలీ పాన్ కార్డులతో దాదాపు 108 బ్యాంకు ఖాతాలు తెరిచారని, అందులో కోటి రూపాయల నగదు ఉన్నదని, ఆ ఖాతాలను స్థంభింపజేసినట్లు వారు పేర్కొన్నారు. నిందితుడు నగదు మొత్తంలో కొంత ఇతర బ్యాంకులకు బదిలీ చేయడంతో ఇందులో నైజీరియన్ల హస్తం ఉన్నదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జేడీయూలో తీవ్రమైన చిచ్చు

- శరద్‌యాదవ్ మద్దతుదారుల సస్పెన్షన్
- 21మందిపై వేటు

పాట్నా, ఆగస్టు 14: జనతాదళ్(యూ)లో చిచ్చు మరింత తీవ్రమైంది. ఇప్పటికే శరద్‌యాదవ్‌ను పార్లమెంటరీ పార్టీ నేతగా తొలగించిన జేడీయూ, గతవారం సోనియా అధ్యక్షతన జరిగిన విపక్షాల సమావేశానికి హాజరైన రాజ్యసభ ఎంపీ అలీ అన్వర్‌నూ సస్పెండ్ చేసింది. ఇదే వరుసలో సోమవారం మరో 21మంది నేతలను పార్టీ సస్పెండ్ చేసింది. వీరంతా శరద్‌యాదవ్ అనుచరులు కావడం గమనార్హం. నితీశ్ మహాకూటమి నుంచి వైదొలిగి బీజేపీతో చేతులు కలుపడంపై పార్టీలో నిరసన స్వరం పెరుగుతూ వచ్చింది. నితీశ్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టిన శరద్‌యాదవ్ దీనిపై ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం కాగా, పలువురు నేతలు ఆయనకు మద్దతుగా నిలిచారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించిన 21మంది ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు పార్టీ బీహార్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బశిష్ఠ నారాయణ్ తెలిపారు. వేటుపడిన వారిలో మాజీ మంత్రి రామై రామ్, మాజీ ఎంపీ అర్జున్‌రాయ్, మాజీ ఎమ్మెల్యే రాజ కిశోర్ సిన్హా, మాజీ ఎమ్మెల్సీ విజయ్ వర్మ, పలువురు జిల్లా స్థాయి నాయకులున్నారు. మహాకూటమి నుంచి జేడీయూ వైదొలగి రాత్రికిరాత్రి బీజేపీతో జట్టు కట్టడం నమ్మకద్రోహమేనని పేర్కొంటూ శరద్‌యాదవ్ ఆగస్టు 10నుంచి చేపట్టిన మూడురోజుల సంవాద్‌యాత్రలో రామైరాజ్, అర్జున్‌రాయ్ ప్రముఖంగా కనిపించారు. ఆర్‌జేడీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన రామైరాజ్ అనంతరం 2010లో జేడీ(యూ)లో చేరారు. 19న పాట్నాలో జరుగనున్న జేడీయూ జాతీయ సమావేశాల్లో శరద్‌యాదవ్ భవితవ్యాన్ని పార్టీ తేల్చనుంది.

ఉత్తర భారతాన్ని వణికిస్తున్న వరదలు

- బిక్కుబిక్కుమంటున్న బీహార్
- 100కు చేరిన అసోం వరద మృతుల సంఖ్య
- పొంగిపొర్లుతున్న బ్రహ్మపుత్ర, దాని ఉపనదులు
- కాళీనది ఉగ్రరూపం.. నిలిచిన మానస్ సరోవర్ యాత్ర
- ఈశాన్య రాష్ట్రాలకు రద్దయిన రైళ్లు

పాట్నా/గువాహటి/న్యూఢిల్లీ, ఆగస్టు 14:



బీహార్‌లోని అరారియా జిల్లాలో ఆహార ధాన్యాలను అరటిబోదెల తెప్పపై తరలిస్తున్న ఓ వరద బాధితుడు

వరదలు ఉత్తరభారతాన్ని ముంచెత్తుతున్నాయి. నేపాల్, సీమాంచల్ జిల్లాల్లోని మహానంద, కంకాయి నదులు పొంగిపొర్లుతుండటంతో దాని ప్రభావం దిగువన ఉన్న నాలుగు రాష్ట్రాలపై పడింది. భారీ వర్షాలకుతోడు నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పలు రాష్ట్రాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బీహార్, అసోంలలో వరద ఉధృతి పెరుగుతుండటంతో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరాఖండ్‌లో కాళీనది ఉగ్రరూపం దాల్చడంతో మానస సరోవర్ యాత్రను ప్రభుత్వం నిలిపివేసింది. వరదల కారణంగా ఈశాన్యరాష్ట్రాలకు వెళ్లే రైళ్లన్నింటినీ ఆగస్టు 16వరకు నిలిపివేస్తున్నట్లు ఈశాన్య సరిహద్దు రైల్వే ప్రకటించింది.

బీహార్‌లోని సీతామడి జిల్లాలో భాగ్మతి నది ఉప్పొంది ప్రవహిస్తున్నది. దీంతో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ఇక గోపాల్‌గంజ్ జిల్లాలో గండకీ నది ప్రవాహం ప్రమాదకరంగా మారుతున్నది. రాష్ట్రంలోని మొత్తం 12 జిల్లాల వరద నష్టం కొనసాగుతున్నదని ప్రభుత్వ సమాచారం. మూడునెలలుగా కొనసాగుతున్న వరదలతో అసోం కకావికలమైంది. కోలుకునే లోపే మళ్లీ వరదలు ముంచెత్తుతుండటంతో అసోం తీవ్రంగా దెబ్బతిన్నది. రాష్ట్రంలో జూన్ నుంచి ఇప్పటివరకు వరదల్లో చనిపోయినవారి సంఖ్య 100కు చేరింది. 22లక్షల మంది వరదల కారణంగా నిరాశ్రయులయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌లో రాప్తీనది, బుదౌస్‌లో గంగానది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఏ క్షణాన్నైనా వరద ముంచెత్తవచ్చని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) హెచ్చరించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోనూ వరద ఉధృతి కొనసాగుతున్నది. బీహార్, అస్సాం వరద పరిస్థితిపై ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. అవసరమైన సహాయాన్ని అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. వరద తీవ్రత గురించి అడిగి తెలుసుకున్నారు.

నిలిచిపోయిన మానస సరోవర్ యాత్ర

ఉత్తరాఖండ్‌లో కాళీనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో కైలాస మానస సరోవర యాత్ర నిలిచిపోయింది. కాళీనది వరద ఉధృతికి రెండు వంతెనలు, సింఖోలాలో ఒక వంతెన దెబ్బతిన్నాయి. దీంతో పలువురు యాత్రికులు తప్పిపోయారు. ఇందులో నలుగురి మృతదేహాలను యాత్రామార్గంలోని మల్పా వద్ద స్వాధీనం చేసుకున్నారు.

నేపాల్‌లో 78మంది.. బంగ్లాదేశ్‌లో 27మంది మృతి

నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నేపాల్‌లో వరదలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. సోమవారం మొరాంగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 12మంది దుర్మరణం పాలయ్యారు. దీంతో వరదలు, వర్షాల కారణంగా చనిపోయినవారి సంఖ్య 78కి చేరింది.



పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాగా సరిహద్దు వద్ద బీఎస్‌ఎఫ్ కమాండెంట్ సుదీప్‌కు మిఠాయి అందజేస్తున్న పాకిస్థాన్ వింగ్ కమాండర్ బిలాల్

భారత్ వల్లే ప్రతిష్టంభన: పాక్

ఇస్లామాబాద్, ఆగస్టు 14: ద్వైపాక్షిక అంశాల్లో ప్రతిష్టంభనకు భారత్ వైఖరే కారణమని పాకిస్థాన్ నూతన ప్రధానమంత్రి షాహిద్ ఖాఖన్ అబ్బాసీ ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన సోమవారం ఇస్లామాబాద్‌లో ప్రసంగించారు. ఇండియా విస్తరణావాదం వల్లే ఇరుదేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు ముందుకుసాగడం లేదని పేర్కొన్నారు. అర్థవంతమైన చర్చలు కొనసాగించేందుకు, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. సార్వభౌమాధికార సమానత్వం ఆధారంగా అన్ని దేశాలతో సత్సంబంధాలను కోరుకుంటున్నట్లు వెల్లడించారు. చైనా-పాకిస్థాన్ దేశాల మధ్య ఉన్న బంధం ఉక్కుకంటే బలమైనదని, తేనెకంటే తియ్యనైనదని పాక్ స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరైన చైనా ఉప ప్రధాని వాంగ్ యాంగ్ పేర్కొన్నారు.

భారీ జెండాను ఆవిష్కరించిన పాక్

జీడీపీ విషయంలోగానీ, అక్షరాస్యత విషయంలోగానీ భారత్‌కు పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్థాన్ జాతీయ జెండా ఏర్పాటు విషయంలో మాత్రం భారత్‌తో పోటీ పడుతున్నది. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 400 అడుగుల పొడవైన పోల్‌పై 120*80 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించింది.

ముందు ముస్లింలం.. ఆ తర్వాతే భారతీయులం!

- యూపీలో ఎస్పీ నేత మావియా అలీ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాది పార్టీ నాయకుడు మావియా అలీ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మతపర వ్యాఖ్యలతో కొత్త అంశానికి తెరలేపారు. రాష్ట్రవ్యాప్తంగా మదర్సాలలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం గతవారం జారీచేసిన సర్క్యులర్ ఇస్లాం మతానికి వ్యతికమైందని మావియా అలీ సోమవారం మీడియాతో అన్నారు. 'యూపీ సర్కార్ ఇచ్చిన సూచనలు స్వీకరించడానికి మేము సిద్ధంగా లేము. సర్క్యులర్‌ను వెనుకకు తీసుకోవాలి. మేము ముందుగా ముస్లింలం ఆ తర్వాతే భారతీయులం. ఒకవేళ ఇస్లాం వ్యతిరేక పరిస్థితులు తలెత్తితే మేము రాజ్యాంగబద్ధులమై ఉండలేము. మేము ఇస్లాంమత సూత్రాలకే కట్టుబడి ఉంటాం' అని మావియా అలీ అన్నారు. అయితే, మావియా అలీకి వివాదాలు కొత్తమే కాదు. 2015లో వీహెచ్‌పీ నాయకురాలు సాధ్వీప్రాచిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు.

బుర్కినాఫాసోలో రెస్టారెంట్‌పై ముష్కరుల దాడి

- 18మంది మృతి, 12మందికి గాయాలు
- ఇద్దరు ముష్కరులను మట్టుబెట్టిన భద్రతాదళాలు

ఔగాడౌగో, ఆగస్టు 14: బుర్కినాఫాసో దేశ రాజధాని ఔగాడౌగోలో విదేశీయులు ఎక్కువగా వచ్చే టర్కిష్ రెస్టారెంటును లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు ఆదివారం రాత్రి కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో సుమారు 18మంది మృతి చెందగా.. 12మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతాదళాలు మట్టుపెట్టాయని, మొత్తం ఎంతమంది దాడి చేశారనే విషయంపై స్పష్టత లేదని ఆదేశ సమాచారశాఖ మంత్రి రెమిస్ తెలిపారు. ముష్కరులను మట్టుపెట్టే ఆపరేషన్ ముగిసింది.. రెస్టారెంటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్రవాదులకోసం వేట కొనసాగుతున్నదని ఆయన తెలిపారు. ఇద్దరు దుండగులు తుపాకులు ధరించి బైక్‌పై వచ్చారని, రెస్టారెంట్‌లోకి వెళ్లి కాల్పులు ప్రారంభించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే రెస్టారెంటు వెయిటర్ మాత్రం ముగ్గురు ముష్కరులు ఆదివారం రాత్రి 9.30గంటలకు వచ్చినట్టు పేర్కొన్నారు. ఆపరేషన్ సోమవారం ఉదయం 5గంటలకు ముగిసింది. వివిధ దేశాలకు చెందిన 18మంది మృతి చెందగా అందులో తమ పౌరుడు ఒకరు ఉన్నట్లు టర్కీ తెలిపింది.

జార్ఖండ్‌వాసికి 3,800 కోట్ల కరెంటు బిల్లు

జార్ఖండ్, ఆగస్టు 14:

జంషెడ్‌పూర్‌కు చెందిన ఒక వ్యక్తి తనకు జార్ఖండ్ ఎలక్ట్రిసిటీ బోర్డు పంపించిన రూ. 3,800 కోట్ల బిల్లును చూసి ఖంగుతిన్నాడు. ఇప్పటికే ఆ ఇంటికి విద్యుత్ కనెక్షన్‌ను కూడా అధికారులు తొలగించారు. తనకు మూడు గదుల ఇల్లు ఉందని, అందులో కేవలం టీవీ, ఫ్యాన్, ట్యూబ్‌లైట్ మాత్రమే ఉన్నాయని ఇంటి యజమాని బీఆర్ గుహ వాపోయారు. అయినప్పటికీ తనకు అంత భారీ మొత్తంలో బిల్లు రావడం ఎమిటని ప్రశ్నించారు. గుహ కుటుంబసభ్యులు ఇరుగుపొరుగువారితో చర్చించిన మీదట ఎలక్ట్రిసిటీ బోర్డుకు ఫిర్యాదు చేశారు.

సరైన మార్గంలో భారత్, చైనా, సౌదీ!

- సర్వేలో వెల్లడించిన ఆయాదేశాల ప్రజలు

న్యూఢిల్లీ: కొన్ని సమస్యలు వేధిస్తున్నప్పటికీ తమ దేశాలు సరైనమార్గంలోనే దూసుకెళ్తున్నాయని చైనా, భారత్, సౌదీ అరేబియా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. 26 దేశాల ప్రజలతో పలు అంశాలపై ఆన్‌లైన్ సర్వే నిర్వహించగా పైమూడు దేశాల ప్రజలు సానుకూల వైఖరి వెల్లడించారు. 'ప్రపంచాన్ని వేధిస్తున్న సమస్యలు ఏమిటి?', మీ దేశం సరైనమార్గంలో వెళ్తున్నదా? అనే అంశాలపై ప్రఖ్యాత అంతర్జాతీయ మార్కెట్ పరిశోధనా సంస్థ ఎల్‌పీఎస్‌వోఎస్ నెలపాటు 26 ప్రధానదేశాల్లో నిర్వహించిన సర్వేలో అనేక ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. తమ దేశం సరైనమార్గంలోనే వెళ్తున్నదని 87 శాతం మంది చైనీయులు సంతృప్తివ్యక్తంచేశారు. భారత్‌లో 74శాతం మంది, సౌదీ అరేబియాలో 71 శాతం మంది ఈ అభిప్రాయం చెప్పారు. కేవలం 8 శాతం మందే దీనిని అంగీకరించి మెక్సికన్లు ఆఖరున నిలువగా, దక్షిణాఫ్రికా 9 శాతం, బ్రెజిల్ 12 శాతం, ఇటలీ 14 శాతం, హంగేరీ 21 శాతం వరుసగా ఉన్నాయి. తమదేశాలు వక్రమార్గంలో వెళ్తున్నాయని అమెరికా, బ్రిటన్, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన 50 శాతానికిపైగా ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా మూడు సమస్యలు నిరుద్యోగం, ఆర్థిక/రాజకీయ అవినీతి, పేదరికం/సామాజిక వివక్ష ఎదుర్కొంటున్నట్లు 26 దేశాల ప్రజలు అభిప్రాయపడ్డారు. తమను ముఖ్యంగా అవినీతి, నిరుద్యోగం, నేరాలు వేధిస్తున్నాయని భారతీయులు చెప్పారు.



'యాదవుల సంక్షేమానికి సర్కార్ కృషి'

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: గొల్లకుర్మ యాదవుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో పాల్గొని ఉట్టికొట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపదను వృద్ధిచేసేందుకు సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికీ ఆవులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పశువులు ఉంటే స్వచ్ఛమైన పాలు, సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫరీదొద్దీన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రం.. భక్త 'జన సంద్రం'

వేములవాడ కల్చరల్ : శ్రావణ సోమవారం కావడంతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేకువజాముననే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. వరుస సెలవులు రావడంతో ఆదివారం రాత్రి నుంచే భక్తుల తాకిడి పెరిగింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు ఆలయ గర్భగుడిలో నిర్వహించే ఆర్జితసేవలు రద్దు చేశారు. దీంతో రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న భీమేశ్వరాలయంలో అభిషేకాలు చేశారు. సోమవారం ఒక్క రోజే లక్ష మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకోగా, రూ. 28 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు.






మగ్గంపై రష్మీఠాకూర్

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముక్కుల గ్రామంలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును సోమవారం ఇక్కత్ బ్రాండ్ అంబాసిడర్ మిస్ ఏసియా రష్మీ ఠాకూర్ సందర్శించారు. కార్మికులతో ముచ్చటించి వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన చేనేతను బతికించడం అందరి బాధ్యతన్నారు. **– భూదాన్ పోచంపల్లి**

మహనీయుడు 'రాజాబహదూర్'

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: భావితరాలకు బాటలు వేసిన మహనీయుడు రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి అని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రత్యేక కళాశాలలు, హాస్టళ్లను ఏర్పాటు చేసి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా రాజాబహదూర్ నిలిచిపోయారన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట, మదనాపురం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం రాజాబహదూర్ స్వగ్రామం రాయినిపేట వద్ద ఆయన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రఘుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హోం శాఖ మంత్రి మాట్లాడుతూ వెంకట్రామారెడ్డి నైజాం కాలంలో కొత్వాల్‌గా పనిచేసి మెప్పుపొందారన్నారు. 120 ఏండ్ల క్రితం ప్రత్యేకంగా విద్యాసంస్థలు, హాస్టళ్లు నెలకొల్పి పకడ్బందీగా అమలుచేసిన ఆదర్శమూర్తిగా ఆర్‌బీవీఆర్‌ఆర్ నిలిచారన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ సొసైటీకి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే సొసైటీకి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో 10 ఎకరాల స్థలం, 10 కోట్ల రూపాయలను అభివృద్ధి కోసం మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నెల 22న ఈ నిర్మాణాలను సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారన్నారు. రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి సేవలను గుర్తించిన సీఎం, ట్యాంక్‌బండ్‌పై ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లాంటి వాళ్లంతా ఆర్‌బీవీఆర్‌ఆర్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసి ఎదిగారన్నారు. మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, రావి నారాయణరెడ్డిలాంటి వాళ్లంతా ఆర్‌బీవీఆర్‌ఆర్ సంస్థల్లో విద్యాభ్యాసం చేశారని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరరెడ్డి, చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి, జగదీశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మదనాపురం మండలం తిర్మలాయపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ సర్ విగ్రహాన్ని హోం మంత్రి నాయిని ఆవిష్కరించారు.



వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రాయినిపేటలో రాజాబహదూర్ వెంట్రామారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న హోం మంత్రి నాయిని



వనపర్తి జిల్లా తిర్మలాయపల్లిలో జయశంకర్ సర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో ఎంపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	5403	5403	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	4718	11753	1615	1609.81	37.646	30.73
జూరాల	3032	4722	1045	1039.96	9.66	6.70
తుంగభద్ర	6883	183	1633	1616.61	100.86	49.54
శ్రీశైలం	1130	60	885	778.6	215.807	19.87
నాగార్జునసాగర్	791	791	590	500.40	312.045	115.943
పులిచింతల	2550	0	175	113.85	45.77	2.52
ప్రకాశం బ్యారేజీ	8310	8310	54.95	54.95	3.070	2.52



(జూన్1 నుంచి ఇప్పటివరకు 340.939 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	0	1434	1522	1511.73	102.732	65.34
కడెం	489	646	700	685.55	7.6	4.41
ఎస్సారెస్పీ	0	182	1091	1055	90.313	9.29
సింగూరు	0	300	1717.93	1708.76	29.91	17.66
నిజాంసాగర్	234	234	1405	1380.10	17.803	1.31
ఎల్లంపల్లి	1018	418	485	472.18	20.175	10.54
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	97152	96920	45	45	2.93	2.93



దుర్కి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు

నస్రుల్లాబాద్: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో 60 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి సోమవారం మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం బీర్కూర్, లింగంపేట మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నదన్నారు. నిజాంసాగర్‌పై దాదాపు 40 ప్రాజెక్టులు కట్టడంతో చుక్క నీరు రాని పరిస్థితి నెలకొందని గ్రహించిన సీఎం కేసీఆర్ కాళేశ్వరం నీటితో సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని తెలిపారు.



మహబూబ్‌నగర్ జిల్లా అల్వాన్‌పల్లిలో డోలు వాయిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

గొర్రెల పంపిణీలో పాలమూరు నంబర్‌వన్

జడ్చర్ల టౌన్: గొర్రెల పంపిణీ పథకం అమలులో రాష్ట్రంలోనే పాలమూరు ప్రథమ స్థానంలో నిలిచిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లిలో సోమవారం గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాకు 27,075 యూనిట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు మొదటి విడుతలో 3,585 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. మిగతా వాటిని దశలవారీగా అందజేస్తామని తెలిపారు. మంత్రి లక్ష్మారెడ్డికి డప్పు చప్పుళ్లతో యాదవులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి డోలు వాయించి అందరిని ఆకట్టుకున్నారు.




యాదవులకు సబ్సిడీ గొర్రెలను అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ అధ్యక్షురాలు


గొర్రెల ఉత్పత్తి పెరుగాలి

తిమ్మాపూర్ రూరల్: కుల వృత్తులపై ఆధారపడే వారి బతుకులు మార్చాలనే సబ్సిడీపై గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టినట్లు కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని రేణికుంటలో 39 గొర్రెల యూనిట్లను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల ఉత్పత్తి పెరిగేందుకు లబ్ధిదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద ప్రేమలత, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మేడారం జాతరకు నాలుగు వేల బస్సులు



తాడ్వాయి : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ ఆర్టీసీ ఆర్‌ఎం సూర్యకిరణ్ అన్నారు. మేడారం జాతర పరిసరాల్లో పూర్వపు వరంగల్ జిల్లాలోని పలు డిపోల మేనేజర్లతో కలిసి ఆయన పర్యటించారు. గత జాతరలో ఏర్పాటు చేసిన సౌకర్యాలతో పాటు చేపట్టిన జాగ్రత్తలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈసారి జాతరకు 4వేల బస్సులను నడుపుతామని చెప్పారు. భక్తులు వేచి ఉండేందుకు షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. క్యూలైన్లను విస్తరించడంతో పాటు భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈనెల 20వ తేదీ నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మాణానికి కలెక్టర్ మురళి కోటి రూపాయలు మంజూరు చేశారని త్వరలోనే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.



వెయ్యి మంది కృష్ణులు.. గోపికలు

పాలమూరు : మహబూబ్‌నగర్ విద్యార్థులకు వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌కు చెందిన 1000 మందికి పైగా విద్యార్థులు శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలతో 6 నిమిషాల 42 సెకండ్ల పాటు గోవింద నామస్మరణకు అనుగుణంగా నృత్యాలు చేశారు. వండర్ బుక్ఆఫ్ రికార్డ్ రాష్ట్ర బాధ్యులు స్వర్ణ, నరేందర్‌గౌడ్ కార్యక్రమాన్ని తిలకించారు. ఆ వెంటనే విద్యార్థుల నృత్యరూపకం వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకుందని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కవులకు ప్రత్యేక గుర్తింపు

'జాగృతి' కవితాంజలిలో మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ టౌన్ : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కవులు, కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాలులో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'కవితాంజలి'లో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మంది కవులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతిని అభినందించారు. సీమాంధ్ర పాలనలో తెలంగాణలో కవులే లేరనే విధంగా భావన తీసుకొచ్చారన్నారు. అప్పటి ఆంధ్రా పాలకులకు కనువిప్పు కలిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన కవి సమ్మేళనానికి 70 మంది కవులు హాజరయ్యారు. కార్యక్రమంలో జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, కవులు రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బట్ల శంకర్, జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్, కవి నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన జాగృతి కవితాంజలి సభలో మాట్లాడుతున్న మంత్రి జోగురామన్న.చిత్రంలో నవీన్ ఆచారి, సుధాకర్ తదితరులు

బాన్సువాడ అటెండర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

నేడు సీఎం చేతుల మీదుగా ప్రదానం




గంగయ్య, అటెండర్

బాన్సువాడ టౌన్: ఉత్తమ సేవలకు గాను కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఆర్డీవో కార్యాలయ అటెండర్ కస్ప గంగయ్య రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. పంద్రాగస్టు సందర్భంగా ఈయన మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డుతోపాటు రూ.3 లక్షల నగదుతో గంగయ్యను సీఎం సత్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగులకు ప్రకటించే ఇన్సెంటివ్ అవార్డుల్లో గ్రూప్-4 విభాగంలో గంగయ్య రాష్ట్రస్థాయిలో రెండో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు.

విధులకు సరైన న్యాయం చేస్తూ..

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం వాజిద్‌నగర్ గ్రామానికి చెందిన గంగయ్య నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువును మధ్యలో ఆపేశారు. 1977లో కామ్‌దార్‌గా నియమితులై 1991 ఏప్రిల్‌లో అటెండర్‌గా పదోన్నతి పొందారు. పలుచోట్ల విధులు నిర్వహించిన ఈయన ప్రస్తుతం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వచ్చి అటెండర్‌గా పనిచేస్తున్నారు. కార్యాలయానికి వచ్చేవారితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అధికారుల వద్దకు తీసుకెళ్లి విధులకు తగిన న్యాయం చేస్తూ అటెండర్ ఉద్యోగానికి వన్నె తెచ్చారు. 40 ఏండ్ల విధి నిర్వహణలో మచ్చలేని ఉద్యోగిగా పేరు సంపాదించారు. ఈయన 2018 సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు.

తాలిపేరు ప్రాజెక్టు 9 గేట్లు ఎత్తివేత



ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద తాకిడి పెరిగింది. ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలోని వాగువంకల నుంచి ప్రాజెక్టులోకి 13 వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం 9 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 12,660 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 73.65 మీటర్ల నీరు నిల్వచేసి మిగతాది వదిలేస్తున్నట్టు అధికారులు తెలిపారు. **- చర్ల రూరల్**

'హిమాచల్' ఘటనతో ఇరు కుటుంబాల్లో విషాదం



కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి రూరల్/మన్సూరాబాద్: హిమాచల్ ప్రదేశ్ ఘటన తెలంగాణలోని ఇరుకుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కొండ చరియలు విరిగిపడటంతో ఒకే వాహనంలో వెళ్తున్న ఒకే కంపెనీకి చెందిన సహోద్యోగులు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన దుబ్బాక కొం డల్‌రెడ్డి(45), ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్ కాలనీకి చెందిన కొంతం రాజిరెడ్డి (52) ప్రాణాలు కోల్పోయారు. వీరు సుశీ హైటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేనేజర్లుగా పనిచేస్తున్నారు. హనీన్ ప్రాంతంలో పనులు జరుగుతుండటంతో గత రెండేండ్లుగా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 12న వీరు బొలేరో వాహనంలో సైట్‌కు వెళ్తుండగా కొండచరియలు విరిగిపడటంతో మృతిచెందారు. కాగా కొంతం రాజిరెడ్డి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జన్‌పల్లి గ్రామం. ఎల్బీనగర్‌లోని వివేకానందనగర్ కాలనీలో స్థిరపడ్డాడు. కొండల్‌రెడ్డికి భార్య ఉమ, కూతురు, కుమారుడు ఉన్నారు. రాజిరెడ్డికి భార్య మంగమ్మ, కుమారుడు భరత్‌రెడ్డి ఉన్నారు. వీరి మరణవార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరి మృతదేహాలను విమానంలో రప్పిస్తున్నారు. కొండల్‌రెడ్డి అంత్యక్రియలు స్వగ్రామంలో, రాజిరెడ్డి అంత్యక్రియలు నాగోల్ శ్మశాన వాటికలో మంగళవారం నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సూర్యాపేటలో రెండు కిలోల గంజాయి పట్టివేత


సూర్యాపేట, నమస్తే తెలంగాణ: సూర్యాపేట కేంద్రంగా గంజాయి వ్యాపారం చేస్తున్న వ్యక్తిని సోమవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సూర్యాపేట డీఎస్పీ సునీతా మోహన్ తెలిపారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఎండీ గౌస్ ప్రస్తుతం సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. విశాఖపట్నం జిల్లా అరకు సమీపంలోని లోగిలి నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నాడు. అతని ఇంటిపై దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు గౌస్‌ను అరెస్టు చేశారు. ఇతడికి ఎండీ అజీజ్, బండారు రవి, స్వరూప సహకరిస్తున్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


మృతుల్లో మాజీ ఎమ్మెల్యే ఓంకార్ కుమారుడు



నల్లగొండ జిల్లా ముత్యాలమ్మగూడెం వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



విజయ్‌కుమార్ (ఫైల్)



సావిత్రమ్మ మృతదేహం

కట్టంగూర్, నమస్తే తెలంగాణ : నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో మాజీ ఎమ్మెల్యే ఓంకార్ కుమారుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు విజయ్‌కుమార్(61)తోపాటు విజయ్‌కుమార్ అత్త దాసరాజు సావిత్రమ్మ(85) ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మద్దికాయల విజయ్‌కుమార్, అతడి భార్య దాసరాజు ఝాన్సీలక్ష్మి, అత్త సావిత్రమ్మ, సమీప బంధువు శోభ కలిసి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం గచ్చుగురి చెరువు వద్ద ఆయిల్ ట్యాంకర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో కారు లారీ ఢీకొన్నాయి. అనంతరం కారు రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను సైతం ఢీకొనడంతో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్‌తోపాటు సావిత్రమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం.. క్షతగాత్రులైన ఝాన్సీలక్ష్మిని, శోభను హైదరాబాద్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కామినేని దవాఖానకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఇందులో ఝాన్సీలక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నర్సంపేటలో విషాదం

నర్సంపేట(వరంగల్ రూరల్), నమస్తేతెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే ఓంకార్ పెద్ద కుమారుడు డాక్టర్ విజయ్‌కుమార్ మృతితో నర్సంపేటలో విషాదం అలుముకుంది. ఎంసీపీఐ(యూ) నాయకులు అత్యవసరంగా సమావేశమై డాక్టర్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగెల్లి కొమురయ్య మాట్లాడుతూ విజయ్‌కుమార్ మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు, ఎంసీపీఐ(యూ)కి తీరని లోటన్నారు.



శతకోటి భారతావని మది విజయగర్వంతో ఉప్పొంగి పోయింది. దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేళ అభిమాని ఆనందం రెట్టింపు అయ్యేలా భారత్ రికార్డు విజయాన్ని అందుకుంది. శ్రీలంక గడ్డపై టెస్ట్ గెలువడమే గొప్ప అనుకున్న గత చరిత్రను తిరుగరాస్తూ కోహ్లీసేన కొత్త అధ్యాయానికి నాంది పలికింది. టెస్ట్‌ల్లో అప్రతిహత విజయాలకు కొనసాగింపుగా సిరీస్ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న టీమ్ఇండియా స్వదేశంలోనే కాదు విదేశాల్లోనూ విజయఢంకా మోగిస్తామని ఎలుగెత్తి చాటింది. మూడు రోజుల్లోపే ముగిసిన మూడో టెస్ట్‌లో ఇన్నింగ్స్ విజయంతో లంకను క్లీన్‌స్వీప్ చేసింది. అశ్విన్, షమీ విజృంభించిన వేళ లంక రెండో ఇన్నింగ్స్‌లోనూ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

1 విదేశీ గడ్డపై మూడు లేదా అంత కంటే ఎక్కువ టెస్ట్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కు ఇదే తొలిసారి. ఓవరాల్‌గా ప్రత్యర్థిని వైట్‌వాష్ చేయడం టీమ్ఇండియాకు ఐదోసారి.

2 సొంతగడ్డపై మూడు లేదా అంతకన్న టెస్ట్‌ల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురవడం శ్రీలంకకు ఇది రెండోసారి. గతం (2003-04)లో ఆస్ట్రేలియా చేతిలో క్లీన్‌స్వీప్ పరాభవానికి గురైన లంక.. ప్రస్తుతం భారత్‌తోనూ అదే ఫలితాన్ని చవిచూసింది.

లంకను చుట్టేశారు

85 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం.. ఎన్నో మహత్తర విజయాలు.. మరెన్నో రికార్డు విజయాలు.. టెస్టు క్రికెట్‌లో అనామక స్థానం నుంచి అగ్రస్థానం వరకు.. విదేశీగడ్డపై విజయాల నుంచి సిరీస్ విజయాలవైపు పయనం.. ఎందరో దిగ్గజాలు.. మరెందరో గొప్ప ఆటగాళ్లు.. ఇదీ మన టెస్టు క్రికెట్ చరిత్ర. పరాజయాల నుంచి విజయాలవరకు.. ఆట స్థాయినుంచి దేశంలో మతంగా మారినంతవరకు.. ఇంతింతై వటుడింతయై అన్న చందంగా.. క్రికెట్ మన ఆశగా.. క్రికెట్ మన శ్వాసగా.. ఆటగాళ్లే దేవుళ్లుగా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు.

కానీ.. ఇన్ని సాధించినా ఏదో వెలితి.. అదే, టెస్టు క్రికెట్ చరిత్రలో మూడు టెస్టుల కన్నా ఎక్కువ సిరీస్‌లో మన జట్టు ఇంతవరకు విదేశీ గడ్డపై 'వైట్‌వాష్' రికార్డు నమోదు చేయకపోవడం. సొంతగడ్డపై మనోళ్లు ప్రత్యర్థులను ఇరగదీసి క్లీన్‌స్వీప్ రికార్డు సాధించినా విదేశీ గడ్డపై మనకు ఆ రికార్డు ఇన్నాళ్లూ దక్కలేదు. ఇదిగో.. ఇప్పుడు ఆ ఘనత సాధించాం. శ్రీలంక గడ్డపై 3-0 తో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి విదేశీగడ్డపై తొలిసారి ఈ ఘనతను టీమ్ ఇండియా సొంతం చేసుకుంది. విరాటుడి స్ఫూర్తివంతమైన నాయకత్వం, యువజట్టులోని అపార ప్రతిభ, పదునుతేలిన పేస్, వన్నెతరుగని స్పిన్.. ఇలా అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా ఆడిన భారత్ అరుదైన రికార్డును ఒడిసిపట్టింది.



జయహో

ఉపఖండం వెలుపల మనకు కొరకరాని కొయ్యలా ఉన్న శ్రీ లంక జట్టును వరుసగా మూడు టెస్టుల్లో ఓడించడం ఆషామాషీ కాదు. ఇప్పుడు లంక జట్టు సంధి కాలంలో కొనసాగుతున్నా, ఆ యువజట్టులో పూర్తిసత్తా ఉంది. అనుభవం మాత్రమే లేదు. గతేడాది ఇదేజట్టు ఆస్ట్రేలియాను 3-0 తేడాతో టెస్టుల్లో చిత్తుగా ఓడించి క్లీన్‌స్వీప్ చేసింది. లంకలోని పిచ్‌లన్నీ అనూహ్యంగా స్పందించడం అక్కడ ఆడిన ఆటగాళ్లకు అనుభవమే. గతంలో ఆడిన మన టాప్4 దిగ్గజాలు (సచిన్, గంగూలీ, ద్రవిడ్, లక్ష్మణ్) సైతం లంక స్పిన్‌ను ఎదుర్కోవడం లో ఇబ్బందులు పడ్డారు. కానీ, అనూహ్యంగా స్పందించే ఆ పిచ్‌లపై ఇప్పుడు జట్టులోనున్న మన యువ ఆటగాళ్లు అద్భుతంగా మెరిశారు. ఓపెనర్లు ధవన్, రాహుల్.. మిడిలార్డర్లో పుజార, రహానే.. ఆల్‌రౌండర్ పాండ్యా మెరుపులు.. షమీ, ఉమేశ్ పేస్ తళుకులు..అశ్విన్, జడేజా, కుల్దీప్ స్పిన్ మాయాజాలం..వీరందరి సమిష్టి ప్రతిభ మనకు అందని ద్రాక్షలా మారిన అరుదైన రికార్డును అందించింది. నాటి దిగ్గజాలు పటౌడీ, వాడేకర్, గవాస్కర్, కపిల్‌దేవ్‌లకే అందనిది.. మన తరానికి చిరపరిచితమైన సచిన్, గంగూలీ, ద్రవిడ్, లక్ష్మణ్, కుంబ్లేలకు చిక్కనిది..ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ అందివ్వగలిగినా.. వన్డే, టీ 20 జగజ్జేతగా జట్టును నిలిపినా.. అన్ని ఫార్మాట్లలోని ప్రపంచస్థాయి ట్రోఫీలను అందించిన ధోనీకి సైతం దొరకని ఈ రికార్డును విరాట్‌సేన వశం చేసుకుంది.

విరాటుడే భాగ్యరాత!

బ్యాటింగ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగడం, మంకుపట్టులో జగమొండిగా వ్యవహరించడం, ఆటపట్ల అంకితభావం చూపడం.. ఈ లక్షణాలన్నీ కలగలసిన క్రికెటర్ విరాట్ కోహ్లీ. దిగ్గజాలకే సాధ్యం కాని రికార్డును ఇతను అందిపుచ్చుకుని ప్రపంచంలోని మేటి కెప్టెన్ల సరసన నిలిచిన ఈ సందర్భాన్ని ఎంత పొగిడినా తక్కువే. కుంబ్లేతో విభేదాలతో విలన్‌గా మారినా తాను కోరుకున్న కోచ్‌తో చేపట్టిన మొదటి పర్యటనతోనే తనను తాను మరోమారు నిరూపించుకున్నాడు. కోచ్ ఎవరైనా ఆడేది ఆటగాళ్లే.. కోచ్ ఎలా ఉన్నా కెప్టెన్ మాటకే విలువ ఇవ్వాలి అంటూ వాదించి గెలిపించుకున్న తుంటరి నాయకుడు. మనం మురిసి గర్వించే రికార్డును అందించడం భారత క్రికెట్‌ను మరింత సమున్నత స్థానానికి తీసుకెళ్లడం ఖాయం. కోచ్‌గా పగ్గాలు అందుకున్న రవిశాస్త్రికి ఈ పర్యటన రిలీఫ్ అనుకోవచ్చు. ఎంతో ఒత్తిడి మధ్య జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన రవి అద్భుతాన్నే చేశాడనడంలో అతిశయోక్తి లేదు. ఇదే ఊపుతో ఈ జట్టు.. అందని ద్రాక్షలా మారిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ విజయాలు కూడా అందించగలదన్న విశ్వాసాన్ని కట్టబెట్టింది.

(నమస్తే తెలంగాణ ఖేల్ విభాగం)

3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ▪ విదేశీగడ్డపై విరాట్‌సేన నయా చరిత్ర

పల్లెకిలె:

స్వదేశమైనా, విదేశమైనా.. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న టీమ్ఇండియా మరో సిరీస్ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. సంధి దశను ఎదుర్కొంటున్న శ్రీలంక అనుభవలేమిని తమకు అనుకూలంగా మలుచుకున్న కోహ్లీసేన భారీవిజయాన్నందుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన మూడో టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 171 పరుగుల తేడాతో లంకపై ఘన విజయం సాధించింది. విదేశీ గడ్డపై టీమ్ఇండియాకు ఇదే తొలి క్లీన్ స్వీప్ విజయం కావడం విశేషం. 19/1 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్(ఫాలో ఆన్)కు దిగిన లంక..స్టార్ స్పిన్నర్ అశ్విన్ (4/68), షమీ(3/32) ధాటికి 74.3 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. నిరోషన్ డిక్వెల్లా (41) టాప్‌స్కోరర్‌గా నిలువగా ఐదుగురు బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. మెరుపు సెంచరీతో టీమ్ఇండియాకు భారీ స్కోరు కట్టబెట్టిన యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించగా, వరుస సెంచరీలతో ఆకట్టుకున్న శిఖర్ ధవన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్ ఈనెల 20న మొదలవుతుంది.

దెబ్బ కొట్టిన షమీ:

352 పరుగుల లోటుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన లంకను మహ్మద్ షమీ ఆదిలోనే కోలుకోలేని దెబ్బకొట్టాడు. పిచ్‌పై తేమను తనకు అనుకూలంగా మలుచుకుంటూ లంక బ్యాట్స్‌మెన్‌ను గడగడలాడించాడు. పదునైన స్వింగ్‌తో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టాడు. షమీకి తోడు ఉమేశ్ జత కలువడంతో లంక ఆటలు సాగలేదు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ కరుణరత్నే(16)ను రహానే క్యాచ్ ద్వారా అశ్విన్ ఔట్ చేయగా, ఐదు పరుగుల తేడాతో పుష్పకుమార(1), మెండిస్(12) వికెట్లను షమీ పడగొట్టాడు. దీంతో 39 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ చండీమల్(36), మాథ్యూస్(35) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. సహజశైలికి భిన్నంగా ఆచితూచి ఆడుతూ బ్యాటింగ్ కొనసాగించారు. దీంతో లంచ్ విరామానికి లంక 82/4 స్కోరు అందుకుంది.

అశ్విన్ స్పిన్ తంత్రం:

లంచ్ తర్వాత లంక జట్టు అదే జోరును కొనసాగించాలని ఆరాటపడింది. ఈ క్రమంలో చండీమల్, మాథ్యూస్ సాధికారిక షాట్లతో ఆకట్టుకున్నారు. వీరిద్దరు కలిసి ఐదో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న దశలో చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ ఈ జోడీని విడగొట్టాడు. ఇన్నింగ్స్ 51వ ఓవర్లో పుజారకు క్యాచ్ ఇచ్చి కెప్టెన్ చండీమల్ ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఇక్కణ్నుంచి లంక ఏ స్థితిలోనూ కోలుకోలేకపోయింది. సరిగ్గా మూడు ఓవర్ల తర్వాత అశ్విన్ బంతిని అర్థం చేసుకోని మాథ్యూస్ వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. దీంతో లంక పుంజుకునే ఆశలు పూర్తిగా నీరుగారిపోయాయి. చండీమల్ తర్వాత క్రీజులోకి వచ్చిన డిక్వెల్లా(41) దూకుడైన షాట్లతో ఆకట్టుకున్నా..మరోవైపు అశ్విన్ స్పిన్ తంత్రంతో వరుస విరామాల్లో లంక వికెట్లు కోల్పోయింది. పెరెర(8)ను పాండ్యా క్యాచ్ ద్వారా అశ్విన్ ఔట్ చేయగా, సందకన్(8)ను షమీ సాగనంపాడు. ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో రహానే మెరుపు క్యాచ్ ద్వారా డిక్వెల్లా తొమ్మిదో వికెట్‌గా నిష్క్రమించాడు. పిచ్‌ను తనకు అనుకూలంగా మలుచుకుంటూ చెలరేగిన లాహిరు కుమార(10)ను అశ్విన్ బౌల్డ్ చేయడంతో భారత్ గెలుపు సంబురాల్లో మునిగి పోయింది. లంక వరుసగా రెండు టెస్ట్‌ల్లో ఇన్నింగ్స్ తేడాతో పరాజయం చవిచూడటం విశేషం. ధవన్, హార్దిక్ పాండ్యా సెంచరీలతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 487 స్కోరు చేయగా, లంక తొలి ఇన్నింగ్స్‌లో కుల్దీప్‌యాదవ్ ధాటికి 135 పరుగులకే కుప్పకూలి ఫాలో ఆన్ ఆడిన సంగతి తెలిసిందే.

3 టెస్టుల్లో భారత్‌కు ఇది (ఇన్నింగ్స్ 171 పరుగులు) మూడో భారీ విజయం. పరుగుల పరంగా విదేశాల్లో రెండో అత్యుత్తమ గెలుపు.

5 శ్రీలంకతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఐదుగురు భారత బ్యాట్స్‌మెన్ (ధవన్, పుజార, కోహ్లీ, రహానే, హార్దిక్) సెంచరీలు కొట్టారు. విదేశీ గడ్డపై ఇలా శతకాలు చేయడం ఇదే మొదటిసారి.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో హార్దిక్ పాండ్యా

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 487 ఆలౌట్;

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 135 ఆలౌట్;

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలో ఆన్): కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 16, తరంగ(బి)ఉమేశ్ 7, పుష్పకుమార(సి)సాహా(బి)షమీ 1, మెండిస్(ఎల్బీ) షమీ 12, చండీమల్(సి)పుజార (బి)కుల్దీప్‌యాదవ్ 36, మాథ్యూస్(ఎల్బీ) అశ్విన్ 35, డిక్వెల్లా(సి)రహానే(బి)ఉమేశ్ 41, పెరెర(సి)హార్దిక్ (బి)అశ్విన్ 8, సందకన్(సి) సాహా (బి)షమీ 8, ఫెర్నాండో 4 నాటౌట్, కుమార(బి) అశ్విన్ 10;

ఎక్స్‌ట్రాలు: 3;

మొత్తం: 181 ఆలౌట్;

వికెట్ల పతనం: 1–15, 2–26, 3–34, 4–39, 5–104, 6–118, 7–138, 8–166, 9–168, 10–181;

బౌలింగ్: షమీ 15–6–32–3, అశ్విన్ 28.3–6–68–4, ఉమేశ్ 13–5–21–2, కుల్దీప్‌యాదవ్ 17–4–56–1, హార్దిక్ 1–0–2–0.

"ఈ జట్టుతో విజయ పరంపర కొనసాగిస్తున్నాం. మేము ఆడుతున్న సమయంలో టెస్ట్ క్రికెట్ పరిస్థితి గురించి గానీ.. దాని భవిష్యత్తు ఎలా ఉంటుదన్న దానిపై ఆలోచించడం లేదు. దేశం తరపున టెస్ట్ క్రికెట్ ఆడటాన్ని తమకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాం. ఇప్పటివరకు మా మైండ్‌సెట్ కొంతైనా మారింది లేదు. రెగ్యులర్ ఆటగాళ్లు ఎలాగూ రాణించేవాళ్లే. కానీ ఈ సిరీస్ ద్వారా హార్దిక్ రూపంలో నిఖార్సైన ఆల్‌రౌండర్ దొరికాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో అతను కనబర్చిన ఆత్మవిశ్వాసం అద్భుతం. - విరాట్ కోహ్లీ



ఇది నా టెస్ట్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన సిరీస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆటను ఐదు రోజుల పాటు మేము తీసుకెళ్లకపోవడమే మా ఓటములకు కారణమైంది. కెప్టెన్‌గా ఈ పరాజయాల బాధ్యతను మొత్తంగా నేను తీసుకుంటున్నాను. అభిమానులు అన్నివేళల్లో మాకు అండగా నిలిచారు. ఓటములు ఎదుర్కొన్నా.. మా పక్షాన నిలబడ్డారు. సిరీస్ మొత్తమ్మీద భారత్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. - చండీమల్"




ఆసియా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన హైదరాబాద్ బాడీబిల్డర్ అన్వర్‌ను అభినందిస్తున్న క్రీడామంత్రి పద్మారావు. చిత్రంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రొనాల్డోపై 5 మ్యాచ్‌ల నిషేధం

మాడ్రిడ్: సాకర్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డోపై 5 మ్యాచ్‌ల నిషేధం పడింది. సోమవారం స్పానిష్ సూపర్ కప్ ఫస్ట్‌లెగ్‌లో బార్సిలోనా జట్టుతో తలపడిన రియల్ మాడ్రిడ్ జట్టు ఆటగాడైన రొనాల్డో కోర్టునుంచి బయటకు వెళ్లే సమయంలో రిఫరీని వెనక్కి తోశాడు. దీంతో అతనిపై 5 మ్యాచ్‌ల నిషేధంతోపాటు రూ. 2.40 లక్షలు జరిమానా విధించారు.

ఫెదరర్‌కు జ్వెరెవ్ షాక్

మాంట్రియల్: స్విస్ టెన్నిస్ మాస్టర్ రోజర్ ఫెదరర్‌కు రోజర్స్ కప్‌లో చుక్కెదురైంది. జర్మనీకి చెందిన 20ఏండ్ల అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫైనల్లో ఫెదరర్‌కు షాకిచ్చి చాంపియన్‌గా నిలిచాడు. సింగిల్స్ ఫైనల్లో జ్వెరెవ్ 6–3, 6–4తో ఫెదరర్‌ను బోల్తాకొట్టించి టైటిల్ ఎగురేసుకుపోయాడు.



పేస్‌కు నో చాన్స్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ లియాండర్ పేస్‌ను ఇకనుంచి డేవిస్ కప్ జట్టులో చూడమేమో? ఏమో.. ప్రస్తుత జట్టును చూస్తే అలాగే అనిపిస్తున్నది. వరల్డ్ గ్రూప్ ప్లేఆఫ్‌లో భాగంగా త్వరలో కెనడాతో జరిగే డేవిస్‌కప్ పోరుకు భారత జట్టులో లియాండర్‌కు చోటు దక్కలేదు. తక్కువ ర్యాంకు ఉందన్న కారణంతో అతణ్ని జట్టులోకి తీసుకోలేదు. ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్న ఢిల్లీ కుర్రాడు యుకీ భాంబ్రీ, తెలుగు ఆటగాడు సాకేత్ మైనేనిలు తిరిగి జట్టులోకొచ్చారు. చెన్నై యువ కెరటం రామ్‌కుమార్ రామనాథన్ జట్టులో తనస్థానం నిలుపుకున్నాడు. రామ్‌కుమార్‌తో కలిసి యుకీ సింగిల్స్‌లో ఆడనున్నాడు. ప్రజ్నేశ్ గుణేశ్వరన్, శ్రీరామ్ బాలాజీలు రిజర్వ్ ఆటగాళ్లుగా ఎంపికయ్యారు. అనుభవజ్ఞుడైన రోహన్ బోపన్న జతగా సాకేత్ డబుల్స్‌లో తలపడనున్నాడు. 44ఏండ్ల పేస్‌ను డేవిస్ కప్ జట్టులోకి ఎంపిక చేయకపోవడం ఇటీవలికాలంలో ఇది రెండోసారి. ఏప్రిల్‌లో బెంగళూరు వేదికగా ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన పోరుకు తొలుత పేస్‌ను ఎంపికచేసినా, తుది జట్టులోకి మాత్రం అతణ్ని తీసుకోకుండా జట్టు కెప్టెన్ మహేశ్ భూపతి అడ్డుపడ్డాడు. దీంతో అప్పట్లో ఆ పోరు మధ్యలోనే లియాండర్ కోపంతో వెళ్లిపోయాడు. చాన్నాళ్లుగా తనతో విభేదాలున్న భూపతి, కావాలనే తనను జట్టులోకి తీసుకోలేదని లియాండర్ అప్పట్లో ఆరోపించిన సంగతి తెలిసిందే.



ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆలిండియా కప్ కరాటే చాంపియన్‌షిప్ దివ్యాంగుల 'కటాస్' కేటగిరిలో కరీంనగర్‌కు చెందిన రాజు స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా రాజును అభినందిస్తున్న రాష్ట్ర కరాటే సమాఖ్య చీఫ్ రాజిరెడ్డి తదితరులు



ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలికిన స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్‌ను టోర్నీ చివరిరోజు అంతర్జాతీయ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోల్ట్‌కు 2012 లండన్ ఒలింపిక్స్ ట్రాక్ ప్రతిమను బహూకరించారు.



క్యాంపస్ నాని

నెలరోజుల్లో బిడ్డకు జన్మనిస్తుందనగా భర్తను కోల్పోయింది. అంతటితోనే జీవితం అయిపోయినట్లా? కానే కాదు.. ఢిల్లీకి చెందిన ప్రేమ అయ్యర్ గురించి తెలుసుకోండి. మీరూ అవునంటారు.

ప్రేమకు ఎనిమిది నెలల గర్భం.. యాక్సిడెంట్‌లో భర్త చనిపోయాడు. అది ఆమెను కుంగదీసింది. 'ధైర్యవంతుడైన ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ భార్యగా నువ్విలాంటి పరిస్థితుల్లో చూడడం సిగ్గుగా ఉంది' అంటూ స్నేహితురాలు చెప్పిన మాటలు ప్రేమను కదిలించాయి. నెల రోజుల తర్వాత పుట్టిన పాపను చేతుల్లోకి తీసుకుని ధైర్యంగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. భర్త తనవెంటే ఉన్నట్టు భావించి.. కట్టూబొట్టును కొనసాగించింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఇరవై ఏళ్ల పాటు పనిచేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నది. కష్టపడి బిడ్డను చదివించి ఉన్నత స్థితికి తీసుకొచ్చింది. ప్రస్తుతం 78 ఏళ్ల వయసున్న ఆమె డెహ్రాడూన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్‌లో హౌజ్ కౌన్సెలర్(క్యాంపస్ నాని)గా పనిచేస్తున్నది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రుల్లో తన కౌన్సెలింగ్ ద్వారా ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నది.

చిన్నారికోసం.. హెల్మెట్ శపథం!

'హెల్మెట్ పెట్టుకోండి.. జీవితాలను రక్షించుకోండి' అని వెంటపడి మొత్తుకున్నా విననివాళ్లు చాలామంది ఉన్నారు. అలాంటివాళ్లు ఒకసారి ఈ 'హెల్మెట్ శపథం' గురించి తెలుసుకోవాలి.

ఆ ఇంట్లో వారంతా ఎప్పుడూ హెల్మెట్ పెట్టుకునే ఉంటారు. భోజనం చేసేటప్పుడు కూడా హెల్మెట్ తీయరు. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన షైనా గుటిరేజ్ దంపతులకు మూడేళ్ల కుమార్తె, నాలుగు నెలల కుమారుడు జోనస్ ఉన్నారు. జోనస్ పుట్టుకతోనే ప్లాజియోసెలఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్సలో భాగంగా చిన్నారికి వైద్యులు హెల్మెట్ పెట్టారు. ఆర్నెళ్లపాటు దీనిని అలాగే ధరించాలట. లేకపోతే చిన్నారి తల ఆకారం పూర్తిగా మారిపోతుంది. కానీ హెల్మెట్ ధరించడం వల్ల జోనస్ తీవ్ర ఇబ్బందికి గురవుతున్నాడు. తమ్ముడి అవస్థ చూస్తున్న మూడేళ్ల అక్కకు ఓ ఆలోచన వచ్చింది. ఇంట్లో వాళ్లంతా హెల్మెట్ ధరిస్తే జోనస్ వాళ్లను చూస్తూ హెల్మెట్ పెట్టుకోవడానికి ఇష్టపడుతాడనేది ఆ అమ్మాయి ఐడియా. దీంతో కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఎప్పుడూ హెల్మెట్ పెట్టుకోవాలని శపథం చేసుకున్నారు. వీళ్లంతా ఎప్పుడూ హెల్మెట్ పెట్టుకోవడంతో చిన్నారి సంతోషంగా ఉంటున్నాడు. ఈ ముచ్చటంతా షైనా సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా విపరీతమైన ఆదరణ లభిస్తున్నది.



I. జిందగీ

Life is Beautiful



నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
మంగళవారం 15 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM

ముచ్చటైన మువ్వన్నెల పండుగ.. రాష్ట్రాలన్నీ ఏకమై జరుపుకొంటున్న పండుగ.. భాషలు వేరైనా, ప్రాంతాలు వేరైనా.. అన్ని గొంతుకలు ఏకమై 'జనగణమన..' అన్న వేళ.. మువ్వన్నెల పతాకానికి సలామ్ చేస్తూనే.. త్రివర్ణ రుచులను చవిచూద్దాం..

మువ్వన్నెల రుచులు

మువ్వన్నెల స్వీట్



కావాల్సినవి :

జామకాయ : 1, **డ్రై ఫ్రూట్స్ :** 10 గ్రా., **క్యారెట్స్ :** 2, **పాలు :** అర లీటరు, **కోవా :** 100 గ్రా., **ఇలాయిచీ పొడి :** పావు టీస్పూన్, **నెయ్యి :** 10 గ్రా., **చక్కెర :** 100గ్రా.

తయారీ :

క్యారెట్‌ని తురుముకోవాలి. పాలు బాగా మరిగించి అందులో క్యారెట్ తురుము వేసి బాగా కలుపాలి. ఆ తర్వాత చక్కెర వేసి చిక్కబడేంతవరకు ఉంచి దించేయాలి. ప్లేట్‌కి నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని పోయాలి. ఇది చల్లారే లోపు జామకాయను పేస్ట్ చేయాలి. మరొక కడాయిలో నెయ్యి వేసి జామకాయ పేస్ట్, చక్కెర వేసి గట్టిపడేంత వరకు కలుపుతుండాలి. కోవాని కూడా కడాయిలో వేసి చక్కెర పోసి కొద్దిసేపు కలిపి దించేయాలి. ఇప్పుడు ముందుగా క్యారెట్ మిశ్రమాన్ని చిన్న ఉండలు చేసుకోవాలి. దాని మీద కోవా, ఆ పై జామకాయ మిశ్రమాన్ని కలిపి ఉండలుగా చుట్టాలి. వీటిని మధ్యలోకి కట్ చేస్తే మువ్వన్నెల రంగులు కనిపిస్తాయి.

మువ్వన్నెల ముద్ద కూర



కావాల్సినవి :

బేబీకార్న్ : 100గ్రా., **పాలకూర పేస్ట్ :** 100 గ్రా., **క్యారెట్ :** 5 గ్రా., **ఆవకాయ :** 5 గ్రా.
పన్నీర్ : 10 గ్రా., **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్
కాజు పేస్ట్ : ఒక కప్పు, **ధనియాల పొడి :** ఒక టీస్పూన్
పాలు : ఒక కప్పు, **పసుపు :** చిటికెడు
పచ్చిమిర్చి : 4, **ఉల్లిగడ్డలు :** 2, **మిరియాల పొడి :** ఒక టీస్పూన్
కొత్తిమీర : ఒక కట్ట, **ఉప్పు, నూనె :** తగినంత

తయారీ :

ఈ వంట కోసం మూడు కడాయిలు తీసుకోండి. ముందుగా ఒక కడాయిలో నూనె పోసి పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేగాక అల్లం, వెల్లుల్లి పేస్ట్, పసుపు వేసి వేయించాలి. ఆ తర్వాత బేబీకార్న్, పాలకూర పేస్ట్ వేసి మగ్గనివ్వాలి. సన్నని మంట మీద కాసేపు ఉంచిన తర్వాత ఉప్పు, ధనియాల పొడి వేసి దించేయాలి. ఇప్పుడు మరో కడాయిలో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, పన్నీరు వేసి కాసేపు వేయించాలి. ఆ తర్వాత కాజు పేస్ట్ వేసి పాలు పోసి బాగా ఉడుకనివ్వాలి. చిక్కగా అయ్యాక ఉప్పు, మిరియాల పొడి, కొత్తిమీర వేసి దించేయాలి. ఇప్పుడు మరో కడాయిలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి వేగిన తర్వాత క్యారెట్, ఆవకాయ వేసి కలుపుకోవాలి. ఇందులో ఉప్పు, ధనియాల పొడి వేసి కూర దగ్గరకు అయ్యేవరకు ఉంచి దించేయాలి. ఇప్పుడు ఒక సర్వింగ్ ప్లేట్ తీసుకొని అందులో ముందుగా క్యారెట్ కూర, ఆ తర్వాత పన్నీరు కర్రీ, చివరగా బేబీకార్న్ కూరలను వేసి సర్వ్ చేయాలి. మువ్వన్నెల ముద్ద కూర రెడీ!

మిక్స్‌డ్ ఫ్రూట్ జ్యూస్



కావాల్సినవి :

కివీ ఫ్రూట్స్ : 2, **క్యారెట్స్ :** 2, **పెరుగు :** ఒక కప్పు
చక్కెర : 100 గ్రా. **సోంపు పొడి :** అర టీస్పూన్

తయారీ :

కివీలో కొద్దిగా పెరుగు వేసి జ్యూస్ చేసుకోవాలి. ఆ తర్వాత పెరుగులో కొద్దిగా చక్కెర వేసి లస్సీ చేసి మరో గ్లాసులో పోసుకోవాలి. చివరగా క్యారెట్‌ని సన్నగా కట్ చేసి చక్కెర పోసి మిక్సీ పట్టాలి. ఇప్పుడు పెద్ద గ్లాస్ తీసుకొని అందులో ముందుగా కివీ జ్యూస్, లస్సీ, ఆ పై క్యారెట్ జ్యూస్ పోసుకోవాలి. సోంపు పొడితో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. త్రివర్ణ జ్యూస్ మీ ముందుంటుంది.

త్రివర్ణ వెజ్‌పులావ్

కావాల్సినవి :

బాస్మతీ రైస్ : 200 గ్రా.
క్యారెట్ : 10 గ్రా.
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : ఒక టీస్పూన్
ధనియాల పొడి : ఒక టీస్పూన్
పాలకూర : 2 కట్టలు
ఎండుమిర్చి పేస్ట్ : ఒక టీస్పూన్
కొత్తిమీర : ఒక కట్ట
పచ్చిమిర్చి : 4
పుదీనా : ఒక కట్ట
నెయ్యి : ఒక టీస్పూన్
ఉల్లిగడ్డలు : 2
నూనె, ఉప్పు : తగినంత

తయారీ :

ముందుగా రైస్ కడుగాలి. కాసేపటి తర్వాత మెత్తగా కాకుండా పొడిగా వండి పక్కన పెట్టుకోవాలి. పాలకూరని మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఒక కడాయిలో నూనె పోసి పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి వేగిన తర్వాత పాలకూర పేస్ట్ వేసి చిక్కగా అయ్యేంతవరకు ఉంచాలి. ఆ తర్వాత దీంట్లో పుదీనా, కొత్తిమీర, ఉప్పు, ధనియాల పొడి వేసి దించేయాలి. మరో కడాయిలో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి వేగిన తర్వాత క్యారెట్ తురుము వేసి వేయించాలి. దీంట్లో ఎండు మిర్చి పేస్ట్, ఉప్పు, ధనియాల పొడి వేసి దించేయాలి. ఇప్పుడు కొద్దిగా అన్నంలో నెయ్యి వేసి క్యారెట్ కూరని, మరి కొంత అన్నంలో నెయ్యి వేసి పాలకూరని వేసి కలుపుకోవాలి. ఇప్పుడు ఒక సర్వింగ్ ప్లేట్ తీసుకొని పైన క్యారెట్ అన్నాన్ని, మధ్యలో ఏం కలుపని అన్నాన్ని, ఆ తర్వాత పాలకూర అన్నాన్ని వేసి అందంగా గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.





జి.యాదగిరి
ఎగ్జిక్యూటివ్ చెఫ్
వివాహభోజనంబు
రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్

ప్రమాదంలో ఉందా?



మా పాప వయసు 18 సంవత్సరాలు. ఇంజినీరింగ్ చదువుతోంది. 4 నెలలుగా తను సరిగ్గా తినడం లేదు. అది పోషకాహార లోపానికి కారణం అవుతున్నది. ఎప్పుడూ నిద్రపోతున్నది. దేనికి సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. చాలా త్వరగా కోపం వస్తోంది కూడా. చదువు మీద కూడా పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. తను ఎందుకలా ఉంటోందో అర్థం కావడం లేదు. డాక్టర్‌కు చూపించాం. లోపం ఉందని విటమిన్ టాబ్లెట్లు ఇచ్చారు. కానీ తను మానసికంగా ఏదో బాధ పడుతున్నదేమో అని నాకు అనుమానంగా ఉంది. నా అనుమానం నిజమేనా? నాకు సరైన సలహా ఇవ్వగలరు.

మనోజ్, హైదరాబాద్

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ అమ్మాయికి డిప్రెషన్ ఉన్నట్టు తెలుస్తున్నది. డిప్రెషన్ కలుగడానికి ఎలాంటి కారణం ఉండక్కర్లేదనడానికి ఇది మరో మంచి ఉదాహరణ. మెదడులోని న్యూరో ట్రాన్స్‌మీటర్లలో జరిగే రసాయన ప్రక్రియల్లో తేడా రావడం వల్ల డిప్రెషన్ కలుగుతుంది. మానసిక సమస్య అనగానే భయపడే పనిలేదు. దాన్ని పిచ్చిగా భావించాల్సిన అవసరం కూడా లేదు. ఇది కూడా జ్వరం వచ్చినట్టుగానే ఆరోగ్య సమస్య అని ముందుగా గుర్తించండి. ఇప్పుడు డిప్రెషన్‌కు చాలా మంచి చికిత్స అందుబాటులో ఉంది. కాకపోతే కాస్త ఓపికగా 6, 7 నెలల పాటు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చికిత్స పూర్తయ్యే వరకు ఆమెను ఒంటరిగా వదులడం గానీ, ఆమెతో కోపాన్ని, విసుగును ప్రదర్శించడం గానీ, మరింత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం గానీ చేస్తే పరిస్థితి మరింత విషమించవచ్చు. కాబట్టి వీలైనంత వరకు ఆహ్లాదకరమైన వాతావరణం ఆమె చుట్టూ ఉండేలా జాగ్రత్తపడండి. మీ అమ్మాయిని వెంటనే ఒక మంచి సైకియాట్రిస్ట్‌కు లేదా సైకాలజిస్ట్‌కు చూపించండి. మీ అమ్మాయి త్వరలోనే మామూలై పోతుంది.



డాక్టర్ ఎం. ఎస్. రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్
డైరెక్టర్
ఆశ హాస్పిటల్స్
హైదరాబాద్

నల్లమచ్చల నివారణకు..



- తేనెలో పాలు కలిపి పది సెకన్ల పాటు వేడి చేయాలి. చల్లారాక బాగా కలిపి దాన్ని బ్లాక్ హెడ్స్ ఉన్న ప్రాంతంలో రాయాలి. తర్వాత పొడి బట్టను వేసి పీకేయాలి. బట్టతో పాటు బ్లాక్ హెడ్స్ ఊడి వచ్చేస్తాయి. తర్వాత చల్లనీళ్లతో ముఖాన్ని కడిగేయాలి.
- గోరువెచ్చని నీళ్లల్లో బేకింగ్ సోడా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రదేశంలో రాసి మసాజ్ చేయాలి. ఇలా చేస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని బ్లాక్‌హెడ్స్ బయటకు వచ్చేస్తాయి. తర్వాత నీళ్లతో ముఖం శుభ్రంగా కడిగి మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
- దాల్చినచెక్క, తేనెలను సమపాళ్లలో తీసుకొని పేస్ట్ చేసుకోవాలి. ముఖానికి రాసి ఐదు నిమిషాలాగి కడిగేయాలి.
- రాత్రి పడుకోబోయే ముందు టమాటా గుజ్జును ముఖానికి పట్టించాలి. ఉదయాన్నే చల్లనీళ్లతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే బ్లాక్‌హెడ్స్ తొలిగిపోతాయి.
- గుడ్డులోని తెల్లసొనకు, తేనె కలిపి బాగా గిలక్కొట్టాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా వారం రోజులు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

బిట్స్ కార్నర్

ఈ క్షణమే ఆనందం ఇలా..

మారిన జీవన విధానంలో మనిషి ముఖంలో చిరునవ్వే మాయమైంది. 'అరే.. మనస్ఫూర్తిగా నవ్వుకుని చాలా రోజులైందే..' అని అనుకున్న సందర్భాలు కూడా చాలా ఉండొచ్చు. అలాంటి వారికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ చక్కటి పరిష్కారం చూపుతున్నది. అంతేకాదు జీవితంలో అనారోగ్యం దరి చేరకుండా జీవించే విధానాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ పరిచయం చేస్తున్నది. మీకూ అలాంటి లైఫ్ కావాలంటే ఇటో లుక్కెయ్యండి.



ఆర్ట్ ఆఫ్ లివింగ్.. ఆధ్యాత్మిక, విద్య, సాంస్కృతిక, సాంఘిక అభివృద్ధి, మెరుగైన సమాజం, మానవతా వాదం సాధించడానికి ఏర్పడ్డ ఏకైక ఆధ్యాత్మిక సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా ప్రజా ప్రయోజనాల కోసం ఎన్నో సేవలను అందిస్తున్నది. దీని వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం ఆరోగ్యవంతమైన ప్రపంచం కోసం కృషి చేయడం. అందుకు మనిషిలోని ఒత్తిడిని దూరం చేసి, మానసిక శారీరక ఆనందాన్ని అందించడం. వీటిని అందుకోవాలంటే ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో సుదర్శన క్రియ అనే ప్రక్రియ ద్వారానే సాధ్యమవుతుంది. దీంతో విధి నిర్వాహణలో ఉత్సాహంగా కనిపించడం, తోటివారితో శాంతియుతంగా మెలిగే వాతావరణాన్ని సుదర్శన క్రియ ద్వారా సాధించవచ్చని రవిశంకర్ చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 'హ్యాపీనెస్' అనే కార్యక్రమాన్ని చేపట్టి ఎంతోమందిలో మార్పు తీసుకొచ్చామని అంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అయితే ఈ నెల 18, 19, 20 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రాల్లో 'హ్యాపీనెస్ ప్రోగాం'ను లైవ్‌లో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ బోధిస్తున్నారు. అన్ని సెంటర్లలో ఏర్పాటు చేసిన పెద్దపెద్ద తెరలపై సుదర్శన క్రియను నేర్పిస్తారు. ప్రత్యేకంగా హైదరాబాద్‌లో 100 సెంటర్లను ఏర్పాటు చేశారు. మీరు కూడా ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఎదుగాలంటే ఈ హ్యాపీనెస్ ప్రోగ్రాంలో పాల్గొనవచ్చు. ఇందుకు www.artofliving.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అవ్వాలి. ఒకవేళ మీరు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో సభ్యులైతే సంబంధిత సెంటర్లలో పాల్గొనవచ్చు. వివరాలకు 9100993430/32 నంబర్లను సంప్రదించండి. సోషల్ మీడియా ద్వారా కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యక్రమాలను వీక్షించవచ్చు.

సుదర్శన క్రియతో ఏమిటి ఉపయోగం?

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో ఇదో ప్రధానాంశం. ఈ సుదర్శన క్రియలో మనిషి శ్వాసపై ఎలా ధ్యాస ఉంచాలో నేర్పిస్తారు. దీనివల్ల మనిషికి ఏకాగ్రత పెరుగుతుంది. శ్వాసను 80 నుంచి వందశాతం తీసుకోవడం అనేది ఒక్క సుదర్శన క్రియ ద్వారానే జరుగుతుంది. ఇలా తీసుకోవడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు దరిచేరవు. శరీరంలోని అంటే కాలివేలి గోళ్ల నుంచి తల వరకూ ప్రతి భాగంలోనూ రక్తప్రసరణ జరిగి.. మనిషి ఉత్సాహంగా ఉంటాడు. ఈ సుదర్శన క్రియకు తోడు యోగాసనాలు వేయడం వల్ల అన్ని నొప్పులూ మాయమవుతాయి. మొత్తంగా సుదర్శన క్రియ చేసిన వాళ్లు ఆనందంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ వాణిబాల అంటున్నారు. ఆసక్తి ఉన్న వాళ్లకు సుదర్శన క్రియ తర్వాత ఉండే కొన్ని ప్రక్రియలు నేర్పిస్తారు. మరింకెందుకు ఆలస్యం.. ఆసక్తి ఉన్నవాళ్లు వెంటనే రిజిస్టర్ అవ్వండి.



వాట్సప్!

ట్వీట్

పవన్ కల్యాణ్
@PawanKalyan



పవన్ కల్యాణ్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,948,338

వ్యక్తులకి భిన్నమైన పర్వదినాలు ఉండొచ్చు కానీ.. జాతికి సంబంధించి ఇదొక్కటే ఘనమైన పండుగ రోజు. జైహింద్!

సమ్‌థింగ్ స్పెషల్



ఇంజినీర్ల ఐడియానా ఇది?!

కామన్‌మ్యాన్ వాయిస్

పసికందులకన్నా పశువులే ముఖ్యమై, బడుగు బతుకులు ఉరికొయ్యలపాలవుతుంటే ప్రజాస్వామ్యమా? ఇది కాషాయస్వామ్యమా?
Aruna Gogulamanda

దేశభక్తి అంటే.. జాతీయజెండాను గౌరవించుడే కాదు. దేశ ప్రజలందరినీ ప్రేమించడం.
ధాము నర్మాల

తెలంగాణ కోసం నేను 19 యేండ్లు ఉద్యమించానని నటి విజయశాంతి, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టింది నేనేనని చంద్రబాబు. ఇద్దరికీ పెద్ద తేడా లేదు. ఆమె నటి. ఈయన రాజకీయ నేత. మిగతాదంతా సేమ్ టు సేమ్. ఒకర్ని మించి ఒకరు నటనలో జీవించిపోతున్నారు.
–Buchibabu Kp

63మంది చిన్నారులు కాబట్టి సరిపోయింది. అదే 63 ఆవులు అయ్యుంటే దేశం ఈపాటికే తగులబడిపోయేది.
Thirupathi Bandari

కాలం విలువను గుర్తించిన వారు మాత్రమే జీవితంలో విజయాలు సాధించారు. అలాగే సాధిస్తున్నారు. కాలాన్ని సద్వినియోగపరుచుకోవాలి. కాలాన్ని పొదుపు చేసుకోవడం కూడా ఒక కళే.
–Nageswararao Kesiraju

వైరల్ వీడియో



తూట్ల ప్యాంట్ గురించి మీకు తెలుసా? మై విలేజ్ షో పేరుతో తూట్ల ప్యాంట్‌పై చేసిన వీడియో చూస్తే మీరు నవ్వకుండా ఉండలేరు. కావాలంటే చూడండి.

Youth Ripped jeans | Thutla pant | my village show

Total views : 204,854+

Published on Aug 11, 2017

షేరింగ్

నేను మొదటిసారి తాగినప్పుడు
ఇక తాగకూడదని శపథం చేశా..
నా దృష్టిలో.. నేను దిగజారిపోయాను.
ఇక మీదట తాగనని నిర్ణయించుకున్నాను.
కానీ నేనప్పుడు వీళ్లందరి గురించి ఆలోచించాను.
ద్రాక్ష పంటలు పండించేవారు..
వైన్(డిస్టలరీ) ఫ్యాక్టరీలో పనిచేసేవాళ్లు
బాటిల్ తయారీ ఫ్యాక్టరీలో పనిచేసేవాళ్లు..
బార్‌లో పనిచేసే వెయిటర్స్..
ఖాళీ బాటిల్స్ ఏరుకొని పొట్ట నింపుకొనేవాళ్లు
రవాణా చేసే ట్రక్ డ్రైవర్లు, లోడింగ్ అన్‌లోడింగ్ చేసే పేద జనాలు.. వీరందరి భార్యాపిల్లలు
వీళ్లందరి భవిష్యత్తు గురించి ఆలోచిస్తే.. కన్నీరొచ్చింది..
హృదయం ద్రవించిపోయింది. ఆర్తితో అంతే..
అదే క్షణాన నిర్ణయించుకున్నా. ఇకపై రోజూ తాగాలని.
ఎందుకంటే..
అందరూ తమ ప్రేమకోసం జీవిస్తారు.
నేను మాత్రం పేదవారి కోసం తాగుతాను.
-ఓ వాట్సప్ మెసేజ్

ఆకలితో వున్నవాడికి అన్నం పెట్టడం కూడా దేశభక్తే!



అర్జున్

యాక్షన్‌కింగ్‌గా దక్షిణాది చిత్రసీమలో ప్రసిద్ధుడు సీనియర్ హీరో అర్జున్. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ ఆయనది. యాక్షన్‌తో పాటు కుటుంబకథా చిత్రాల హీరోగా తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ ఆయన్ని విలక్షణ కథానాయకుడిగా నిలిపాయి. యాభయ్యవపడిలో కూడా నవ యువకుడిగా దర్శనమిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారాయన. అర్జున్ ప్రతినాయకుడి పాత్రలో నటించిన 'లై' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో తన మనోభావాల్ని పంచుకున్నారు. ఆ ముచ్చట్లివి..

• తెలుగులో తొలిసారి విలన్ పాత్రలో నటించారు. హీరోగా అవకాశాలొస్తున్నా ప్రతినాయకుడి పాత్రను అంగీకరించడానికి కారణమేమిటి?

'మా పల్లెలో గోపాలుడు' (1984) చిత్రం ద్వారా తెలుగులో నేను సినీరంగ ప్రవేశం చేశాను. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో 150 సినిమాలు చేశాను. నటుడిగా ఇంత అనుభవం వుంది కాబట్టి కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే బాగుంటుందనిపించింది. నట జీవితంలో ఓ దశకు చేరుకున్నాకే మనం అనుకున్న పాత్రల్ని, ప్రయోగాల్ని చేయగలుగుతాం. రొటీన్‌కు భిన్నంగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతినాయకుడి పాత్రలో నటించాను.

• 'లై' చిత్రంలో విలన్‌గా నటించడం వల్ల హీరోగా మీ ఇమేజ్‌కు భంగం కలుగుతుందని భయపడలేదా...?

అలాంటిదేమి లేదు. వాస్తవానికి హీరోకు కొన్ని పరిధులు వుంటాయి. అదే విలన్ పాత్రలో అయితే మనలోని ప్రతిభను అన్ని కోణాల్లో ప్రదర్శించే అవకాశం దొరుకుతుంది. ఈ సంవత్సరం హీరోతో పాటు విలన్ పాత్రలు వస్తున్నాయి. ఇలాంటి అవకాశాలు రావడం దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తున్నాను. అందుకే హీరో, విలన్‌గా రెండు రకాల పాత్రల్ని అంగీకరిస్తున్నాను.

• సినిమాలో మీరు పోషించిన పాత్రకు ఎలాంటి స్పందన లభిస్తున్నది...?

నా పాత్ర చిత్రణలో భిన్న పార్శ్వాలు వుండటం ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తున్నది. హీరోగా నటించిన సినిమాలకు ఎలాంటి ప్రశంసలు లభిస్తాయో ఈ చిత్రానికి కూడా అదే స్థాయిలో స్పందన లభిస్తున్నది. ప్రాణంపెట్టి చేస్తే ఏ సినిమానైనా ప్రేక్షకులు ఆదరిస్తారని తెలిసింది.

• అర్జున్ అంటే ఫిట్‌నెస్ గుర్తుకొస్తుంది. యాభై యేళ్ల పడిలో కూడా ఇంకా యువకుడిగానే కనిపిస్తున్నారు. మీ ఫిట్‌నెస్ రహస్యమేమిటి?

ప్రేక్షకులు తిడతారేమోననే భయమే నేను ఫిట్‌గా వుండటానికి కారణం అనుకుంటున్నాను. మనకున్న ప్రజాదరణను కాపాడుకుంటూ మంచి సినిమాలు చేయాలంటే తప్పకుండా కష్టపడాలి. శారీరకంగా దృఢంగా కనిపించాలి. ప్రతి ఒక్కరు స్వయంస్ఫూర్తితో చక్కటి శారీరక, మానసిక శక్తుల్ని పొందడానికి శ్రమించాలి. అవన్నీ పాటించడం వల్లే నేను ఇప్పటికీ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నాను.

• మీ సమకాలీన హీరోలు రాజకీయరంగంపై దృష్టి పెడుతున్నారు. భవిష్యత్తులో మీరు పాలిటిక్స్‌లోకి వచ్చే ఆలోచన వుందా?

ఓ మంచి రాజకీయ నాయకుడిగా రాణించాలన్నా, చెడ్డ రాజకీయ నాయకుడు అనిపించుకోవాలన్నా... అందుకు ఎన్నో తెలివితేటలు అవసరం. సినిమాల్లో సక్సెస్ అయినంత మాత్రాన రాజకీయాల్లో రాణిస్తామనే రూలేం లేదు. నా దృష్టిలో సినిమా ద్వారా కూడా సమాజ సేవ చేయొచ్చు. విద్య అవశ్యకతను తెలియజేస్తూ నేను నటించిన ఓ కన్నడ చిత్రానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ అవార్డ్ లభించింది. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సినిమాలు కూడా సమాజ సేవ క్రిందకే వస్తాయని నా అభిప్రాయం.

• భవిష్యత్తులో కూడా ప్రతినాయకుడి పాత్రలో నటించే ఆలోచన వుందా?

సృజనాత్మకంగా ఆలోచిస్తూ కొత్త ప్రయత్నాలు చేసినప్పుడే నటుడిగా నిలదొక్కుకుంటాం. నా మనసుకు నచ్చిన పాత్రలు లభిస్తే విలన్ పాత్రల్లో నటించడానికి సిద్ధంగా వున్నాను.

• సినిమాల ఎంపికలో మీరు చాలా జాగ్రత్తలు తీసుకుంటారని చెబుతుంటారు..?

అవును. దక్షిణాది నుంచి ఎన్నో ఆఫర్లు వస్తుంటాయి. పెద్ద హీరోలు, అగ్ర నిర్మాణ సంస్థలు తమ సినిమాల్లో నటించమని అడుగుతుంటారు. అయితే బంగారు కత్తి అని చెప్పి మెడ కోసుకోలేం కదా? ఎంతటి సంస్థ అయినా కథ నచ్చితేనే నేను సినిమాకు అంగీకరిస్తాను. కథాంశాల్లో, నా పాత్ర రూపకల్పనలో నవ్యత వుంటేనే సినిమాల్ని ఒప్పుకుంటాను.

• మీ అమ్మాయిని కన్నడ చిత్రసీమకు పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఆ చిత్ర విశేషాలేమిటి...?

'కాదలిన్ పాన్ వీదియిల్' పేరుతో తమిళ, కన్నడ భాషల్లో ఆ సినిమా చేస్తున్నాను. హృద్యమైన ప్రేమకథా చిత్రమది. మా అమ్మాయి సినిమాల్లోకి వస్తానని చెప్పినప్పుడు నేను అభ్యంతరం చెప్పలేదు. 35ఏళ్లుగా పరిశ్రమలో వుంటున్న నేనే నా కూతురిని సినిమాల్లోకి వెళ్లొద్దంటే ఇక సామాన్య ప్రజలు ఏమనుకుంటారు? అందుకే తనను వద్దనలేదు. ఆమె ఇష్టాన్ని గౌరవించి సినిమాల్లో ప్రోత్సహిస్తున్నాను. ప్రతిరంగంలో మంచి చెడులుంటాయి. కాబట్టి ఫలానా రంగంలోకి వెళ్లొద్దనే ఆలోచన తప్పు.

• మీలో దేశభక్తి ఎక్కువని అంటుంటారు. దేశభక్తి ప్రధాన చిత్రాల్ని కూడా ఎక్కువ చేశారు...?

మా నాన్నకు దేశభక్తి ఎక్కువ. నాకది వారసత్వంగా వచ్చిందనుకుంటాను. 'మనం ఏదైనా పనిచేస్తే దాని నుంచి మనం ఏమైనా నేర్చుకోవాలి..లేదా సమాజానికేమైనా చెప్పాలి' అని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఆయన ఆలోచనలే నాలోని దేశభక్తికి ప్రేరణనిచ్చాయి.

• దేశభక్తికి మీరిచ్చే నిర్వచనమేమిటి...?

దేశభక్తికి విస్తృత పరిధి వుంటుంది. ఏవో కొన్ని పనులనే దేశభక్తికి తార్కాణంగా భావించవొద్దు. మన ఇల్లు బాగుండాలని ఎలా అనుకుంటామో..అందరి ఇల్లు అలాగే బాగుండాలని కోరుకోవడం దేశభక్తి. కష్టాల్లో వున్నవారికి చేయూతనివ్వడం దేశభక్తి. ఆకలితో వున్నవాడికి ఓ పూట భోజనం పెట్టడం దేశభక్తే. ఇలా ఏదో రూపంలో సమాజానికి మేలు చేయడమే నా దృష్టిలో నిజమైన దేశభక్తి.

• సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది. ఏ విషయంలోనైనా అసంతృప్తికి గురైన సందర్భాలున్నాయా?

ఇప్పటికి రోజూ నాలుగైదు సినిమా అవకాశాలొస్తున్నాయి. ఇది దేవుడిచ్చిన వరం అనుకుంటున్నాను. ఒక సినిమా విజయానికి కేవలం హీరో కారణం అంటే నేను నమ్మను. సినిమా సక్సెస్‌కు కాంబినేషన్‌లు, దర్శకుడు, టెక్నీషియన్లు పనితనం, విడుదల సమయం..ఇలా ఎన్నో అంశాలు కారణమవుతాయి. నావల్లే సినిమా హిట్ అయిందని ఎవరైనా చెబితే అంతకుమించి మూర్ఖత్వం వుండదు. సినిమా ఓ సమిష్టి బాధ్యత. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు దక్కడం పట్ల నేను ఆనందంగా వున్నాను. దక్షిణాది ప్రేక్షకులు నాపై చక్కటి ఆదరణ కనబరుస్తున్నారు. వారి ప్రేమాభిమానాల్ని కాపాడుకుంటూ కెరీర్‌లో మరింతగా రాణించాలని కృషిచేస్తున్నాను.

- సినిమా డెస్క్



గోపీచంద్ ఆచంట, నితిన్, అర్జున్, మేఘా ఆకాష్, హను రాఘవపూడి

ఆ రోజు భయంతో నిద్రపోలేదు!

'ఫలితాన్ని గురించి ఆలోచించకుండా కొత్తదనాన్ని నమ్మి ఈ సినిమా చేశాం. రొటీన్ కామెడీ ట్రాక్‌లు, ఆరు పాటలు, ఫైట్లు లేకుండా కథకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చి మేము చేసిన ఈ ప్రయత్నానికి చక్కటి స్పందన లభిస్తున్నది' అని అన్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'లై'. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్ర బృందం థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. నితిన్ మాట్లాడుతూ ' 'అ ఆ' తర్వాత ప్రేమకథతో సేఫ్‌గేమ్ ఆడొచ్చు. కానీ కొత్తదారిలో వెళ్లడమే ఉత్తమమనే ఆలోచనతో 'లై' సినిమాను ఎంచుకున్నాను. విభిన్నమైన కథ కావడంతో ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో అనే భయంతో విడుదలకు ముందు రోజు రాత్రి నిద్రపట్టలేదు. తొలి రోజు సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ రోజు రోజుకు సినిమా పట్ల అభిప్రాయం మారుతూ వస్తున్నది. మంచి సినిమా చేశామని అందరూ చెబుతుండటం ఆనందంగా ఉంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జున్, హను రాఘవపూడి, మేఘాఆకాష్, యువరాజ్ పాల్గొన్నారు.

వెన్ను నరాలకు మేలు..

ఎక్కువసేపు కదులకుండా ఒకే చోట కూర్చొని పనిచేయడం, శరీరానికి వ్యాయామం లేకపోవడం వల్ల వెన్ను నొప్పి మొదలవుతుంది. దీంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు చుట్టు ముడుతాయి. కాబట్టి ఈ ఆసనాలను సాధన చేయండి.

యోగా

మేరు వక్రాసనం

కాళ్లు ముందుకు చాచి వెన్నుముక, తల నిటారుగా ఉంచాలి. ఇప్పుడు ఎడమ కాలిని మడిచి.. కుడి మోకాలి పక్కకు ఉంచాలి. చేతులను పైకి లేపి నడుమును కుడి వైపునకు తిప్పి చేతులను వెనుకకు వంచాలి. ఆ తర్వాత మెల్లగా వెనుకకు చూడాలి. ఈ స్థితిలో 30 సెకన్ల పాటు ఉండి యథాస్థితికి రావాలి. ఇదేవిధంగా ఇంకోవైపు చేయాల్సి ఉంటుంది.



ఉపయోగాలు :

- వెన్ను నరాలకు, కండరాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది.
- భుజాల నొప్పులు తగ్గుతాయి.
- అంతర్గత అవయవాల పనితీరు మెరుగుపడుతుంది.
- మధుమేహం అదుపులోకి వస్తుంది.
- నడుములో ఉన్న అనవసరపు కొవ్వు తగ్గుతుంది.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

జాగ్రత్త :

తుంటి నొప్పి ఉన్నవారు ఈ ఆసనం చేయరాదు.

ద్వికోణాసనం

కాళ్ల మధ్య ఒక అడుగు దూరం ఉంచి నిటారుగా నిలబడాలి. చేతి వేళ్లను నడుము వెనుక కలుపాలి. ఇప్పుడు శ్వాస తీసుకోవాలి. ఆ తర్వాత మెల్లగా శ్వాస వదులుతూ ముందుకు వంగాలి. చేతులను కూడా వీలైనంత పైకి లేపాలి. ఈ స్థితిలో 30 సెకన్ల పాటు ఉండి యథాస్థితికి రావాలి. ఇలా ఐదుసార్లు చేయాల్సి ఉంటుంది.




ఉపయోగాలు :

- వెన్ను నరాలు, కండరాలు సాగి రక్తప్రసరణ బాగా జరుగుతుంది.
- చాతి భాగం బాగా వ్యాకోచం చెంది ఊపిరితిత్తులకు ప్రాణవాయువు బాగా అందుతుంది.
- కాలి కండరాలు సాగి, పిక్కల నొప్పులు తగ్గుతాయి.
- భుజం కండరాలను బలపరుస్తుంది.

జాగ్రత్తలు :

- నడుము నొప్పి, గుండె సమస్యలు ఉన్నవారు నిపుణుల పర్యవేక్షణలో చేయడం మంచిది.



జె. దుర్గేష్ కుమార్
యోగా ట్రైనర్,
సంతూస్ స్టూడియో
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్
9704229212,

మోకాలు మార్పిడిలో కంప్యూటర్ నావిగేషన్

సలహా



వయసు పైబడిన వారిలో మోకాలు కీలు అరిగిపోవడం, మోకాళ్ల నొప్పులు అనేవి సాధారణ ఆరోగ్య సమస్యలు. సమస్య కాస్త ముదిరిన తర్వాత మందులు ఫిజియోథెరపీ, ఇతర ఆర్థ్రోస్కోపిక్ చికిత్సల వంటివి పెద్దగా ఫలితాలను ఇవ్వవు. ఇటువంటి వారికి మోకాలు కీలు మార్పిడి తప్పనిసరి అవుతుంది. ఈ సర్జరీ విధానంలో ఇప్పుడు చాలా అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటర్ నావిగేషన్ వాటిలో ఒకటి.

కంప్యూటర్ నావిగేషన్ టెక్నిక్ అంటే ఏమిటి?

మోకాలు కీలు మార్పిడి సర్జరీ సులభంగా నిర్వహించడానికి, ఫలితాలు మెరుగ్గా ఉండడానికి కంప్యూటర్ నావిగేషన్ అనేది పరస్పర పర్యవేక్షణతో రూపకల్పన చేయడం జరిగింది. ఈ కంప్యూటర్ నావిగేషన్ వ్యవస్థ ఇంప్లాంట్‌ను కచ్చితమైన స్థానంలో, కచ్చితమైన దిశలో అమర్చడం వంటి విషయాలలో మెరుగైన నిర్ణయం తీసుకోవడానికి సహాయపడుతుంది.

సరైన ఇంప్లాంట్ సైజ్ నిర్ణయించడం ఎలా?

కంప్యూటర్ నావిగేషన్ విధానం ద్వారా ఇంప్లాంట్ సైజ్‌ను నిర్ణయించడం సులభం. సర్జరీకి ముందు, సర్జరీ సమయంలో, ఇంప్లాంట్ అమర్చిన తర్వాత, పేషెంట్ మోకాలు కీలు కదలికల విషయంలో సర్జన్ ముందే ఒక అంచనాకు రావడానికి తోడ్పడుతుంది. అందువల్ల సర్జరీలో కచ్చితత్వం, ఇంప్లాంట్ సైజ్ సరిగా ఉండడానికి దోహదం చేస్తుంది. ఈ విధానంలో చేసే సర్జరీల్లో రిస్క్ తక్కువగా ఉంటుందని, ఫలితాలు మెరుగ్గా ఉంటాయని చాలా అధ్యయనాలు కూడా తెలియజేస్తున్నాయి.

లిగమెంట్ బ్యాలెన్స్ అంటే?

కంప్యూటర్ సహాయంతో చేసే సర్జరీలో సర్జన్ ఒక కచ్చితమైన కోణంలో ఎముకను కట్ చెయ్యడం, మోకాలు కీలు చుట్టు మృదుకణజాలం సమతుల్య పరుచడం జరుగుతుంది. ఇది ఇంప్లాంట్ స్థానంలో కచ్చితత్వం సాధించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా సర్జరీ సమయంలో మోకాలు కీలు మీద ఎంత ఒత్తిడి పడేలా చెయ్యాలో తెలుసుకునేందుకు సహాయపడుతుంది. ఇలాంటి పరిస్థితిని కంప్యూటర్ అసిస్టెడ్ నావిగేషన్ విధానం ద్వారా సంతులన పరుచడం సులభం అవుతుంది.

త్వరగా నడిచే పద్ధతి

మోకాలు మార్పిడి సర్జరీ చాలానొప్పి కలిగించే ప్రక్రియ అనే అపోహ చాలామందిలో ఉంటుంది. చాలా కాలం పాటు బెడ్‌రెస్ట్, ఫిజియోథెరపీ అవసరం అవుతుందనే భావన కూడా చాలా మందిలో ఉంది. ఈ కంప్యూటర్ నావిగేషన్ విధానంలో కోత కేవలం 3, 4 అంగుళాలు మాత్రమే. మల్టీమోడల్ పెయిన్ మేనేజ్‌మెంట్ వల్ల నొప్పి కూడా చాలా తక్కువగా ఉండి ఆపరేషన్ తర్వాత 3 గంటలలోపే నడక సాధ్యమవుతుంది.

తక్కువ ఫేయిల్యూర్ రేట్స్

ఇంప్లాంట్ మన్నిక దాని స్థానం కచ్చితత్వం మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఈ టెక్నాలజీ ద్వారా చేసిన మోకాలు మన్నిక మరింత ఎక్కువగా ఉంటుంది. కంప్యూటర్ నావిగేషన్ మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు కేవలం కచ్చితమైనవే కాకుండా సురక్షితమైనవి కూడా. తక్కువ రోజులు హాస్పిటల్‌లో ఉండడం, తక్కువ రక్తస్రావం, సర్జరీ తర్వాత తక్కువ కాలంలోనే హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్లిపోవడం, తర్వాత ఎలాంటి ఇబ్బందులు రాకపోవడం వంటి అదనపు ప్రయోజనాలు కూడా ఎక్కువ. ఇలాంటి అభివృద్ధి పేషెంటుకు ఉండే భయాన్ని అధిగమించేలా చేసి శస్త్ర చికిత్సకు సానుకూలంగా ఉండేలా ప్రోత్సహిస్తుంది.

డా. బాలరాజు నాయుడు
సీనియర్ కన్సల్టెంట్
కంప్యూటర్ నావిగేషన్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్
సిటిజన్స్ స్పెషాలిటి హాస్పిటల్, నల్లగండ్ల
అపోలోహాస్పిటల్స్ జూబ్లీహిల్స్

పురుషుల్లో లైంగిక సమస్యలకు హోమియో చికిత్స

సలహా



లైంగిక సమస్యలనేవి పురుషుల్లో చాలా చిన్న వయసులోనే ఆరంభం కావచ్చు. లేదా కొన్ని సంవత్సరాల లైంగిక జీవనం తర్వాత కూడా ప్రారంభం కావచ్చు.

ఈ సమస్యల కారణాలు కొన్ని శారీరకమైనవి కావచ్చు. కొన్ని మానసికమైనవి లేదా కొన్ని సందర్భాల్లో రెండు కలగలిపి ఉండొచ్చు.

లైంగిక సమస్యలు సాధారణంగా పురుషుల్లో 20–40 సంవత్సరాల వయసు వారిలో ఎక్కువగా ఉంటాయి. లైంగిక సమస్యతో బాధపడేవాళ్లలో చాలా లక్షణాలు ఉంటాయి.

- లైంగిక తృప్తి లేకపోవడం.
- వీర్యం మోతాదు తగ్గడం.
- పురుషాంగ సమస్యలు.
- శీఘ్రస్కలనం.

కారణాలు

- **శారీరక కారణాలు** – విపరీతమైన నరాల బలహీనత, సుఖవ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం, హార్మోన్ల అసమతుల్యత, ప్రొస్టేట్ గ్రంధి సమస్యలు, మద్యపానం, కొన్ని రకాల మందులు, పుట్టుకతో వచ్చే లోపాలు,
- **మానసిక కారణాలు** – మానసిక ఆందోళన, విపరీత ధోరణి, డిప్రెషన్, అలసట, లైంగిక భయాలు, లైంగిక పరంగా కలిగే నొప్పి.

హోమియో చికిత్స

- పురుషుల్లో లైంగిక సమస్యలన్నింటికీ పాజిటివ్ హోమియోపతిలో చక్కటి, సురక్షితమైన, శాశ్వతమైన చికిత్స అందుబాటులో ఉంది.
- లైంగిక బలహీనత రావడానికి గల కారణాలు విశ్లేషించుకొని మందులు క్రమపద్ధతిలో వాడడం వల్ల 98 శాతం మందిలో ఈ సమస్యను కచ్చితంగా నయం చెయ్యవచ్చు. పాజిటివ్ హోమియోపతిలో కాంథరిస్, పాస్ఫోరిక్ యాసిడ్, మెర్సస్ ఆల్, దూజా, నక్స్‌వామిక, అవినా సెటివా, దాన్యానా, లైకోపోడియం లాంటి అద్భుతమైన మందులు అందుబాటులో ఉన్నాయి.
- ఈ మందులు మనిషితత్వాన్ని బట్టి, బలహీనం కావడానికి కారణాలు, వ్యాధి లక్షణాలు, మానసిక స్థితి అన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని కాన్స్టిట్యూషనల్ పద్ధతి ద్వారా ఎంపిక చేసుకొని క్రమపద్ధతిలో వాడడం మంచి ఫలితాలను పొందవచ్చు.

డాక్టర్ ఎ. ఎం. రెడ్డి
సీనియర్ వైద్యులు
పాజిటివ్ హోమియోపతి
హైదరాబాద్, నిజామాబాద్
హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
903 056 1144
903 056 1177
www.drpositive.in



రుతుపవనాలు

- **రుతుపవనాలు ఏర్పడడానికి ముఖ్య కారణాలు**
  ఎ. భూమి, నీరు భిన్న రీతుల్లో ఉష్ణాన్ని గ్రహించడం, చల్లబడడం
  బి. ట్రోపో ఆవరణపై భాగంలో అతివేగంగా వీచే జెట్ వాయు ప్రవాహాలు

1. వేసవి కాలంలో సముద్రం కంటే భూమి వేడిగాను, శీతకాలంలో చల్లగాను ఉంటుంది. వేసవిలో ఆసియా ఖండం వేడెక్కడంవల్ల సైబీరియాపై అల్పపీడనం కేంద్రీకృతం అవుతుంది. కనుక పవనాలు సముద్రంపై నుంచి భూభాగం మీదకు వస్తాయి. ఈ పవనాల్లో నీటి ఆవిరి అధికంగా ఉండడంవల్ల ఇవి వర్షాన్ని కలుగజేస్తాయి. ఉత్తరార్ధగోళంలోని సైబీరియాపై ఏర్పడిన అల్పపీడన ప్రాంతాన్ని ఆక్రమించడం కోసం దక్షిణార్ధ గోళంలోని ఆగ్నేయ వ్యాపార పవనాలు పయనించడం ప్రారంభిస్తాయి. భూమధ్యరేఖను దాటగానే భూభ్రమణం వల్ల, కొరియాలీస్ ప్రభావం వల్ల ఇవి నైరుతి వ్యాపార పవనాలుగా మారి ఆసియా ఖండంపై వీచి వర్షాన్ని కలుగజేస్తాయి. వర్షాన్నిచ్చే శక్తిగల ఈ నైరుతి వ్యాపార పవనాలు, క్రమంగా నైరుతి రుతుపవనాలుగా పిలువబడుతున్నాయి.

- శీతకాలం ప్రారంభంకాగానే ఆసియా ఖండంపై (సైబీరియాపై) అధికపీడనం, హిందూ మహాసముద్రంపై అల్పపీడనం కేంద్రీకృతమై ఉంటాయి. ఈ అల్పపీడనాన్ని ఆక్రమించడం కోసం ఉత్తరార్ధ గోళంలోని ఈశాన్య వ్యాపార పవనాలు వీచడం ప్రారంభించి క్రమక్రమంగా ఈశాన్య రుతుపవనాలుగా రూపుదిద్దుకుంటాయి. భూభాగంపై నుంచి వీచే ఈ పవనాల్లో నీటి ఆవిరి అంతగా ఉండకపోవడంతో అల్ప వర్షాన్ని కలుగజేస్తాయి.

2. శీతాకాలంలో ఆసియా ఖండంపై ఏర్పడిన అధిక పీడన ప్రాంతం నుంచి అల్పపీడనం గల హిందూ మహాసముద్రం వైపు ఈశాన్య వ్యాపార పవనాలు వీస్తాయి. ఇవి ఎక్కువ వేగంతో వీయడానికి ట్రోపో ఆవరణంపై భాగంలో ఉన్న పశ్చిమ జెట్ స్ట్రీం దోహదం చేస్తుంది. ఇది రెండు శాఖలుగా చీలి, ఒక శాఖ హిమాలయాలకు ఉత్తరంగాను, మరోశాఖ దక్షిణ దిశకు పయనిస్తూ చైనా తూర్పు తీరంలో కలుస్తాయి. ఈశాన్య వ్యాపార పవనాలు వేగంగా సముద్రంపైకి వీయడానికి ఇవి దోహదం చేస్తాయి.

- రుతపవన వ్యవస్థ భారతదేశంలో ఉన్నంత పటిష్ఠంగా మరే ప్రాంతంలోనూ లేదనే చెప్పాలి. ఇది ప్రధానంగా రుతుపవన దేశం. అంతేకాదు, రుతుపవనాల వల్ల వర్షం పొందే దేశాల్లో ప్రధానమైంది, పెద్దది భారతదేశమే. అందువల్లనే భారతదేశ శీతోష్ణస్థితికి ఆయనరేఖా రుతుపవన శీతోష్ణస్థితి అని పేరు. భారతదేశం రుతపవన ఆసియాలో రుతుపవన మండలంలో ఉంది, రుతుపవనాల వల్ల వర్షం పొంది జీవగర్రగా ప్రపంచ దేశాలతో కొనియాడబడుతున్నది. ఇది



రుతపవన దేశంగా మారడానికి ప్రకృతి ప్రసాదించిన వరాలే మిన్న అని చెప్పక తప్పదు.

కారణాలు

1. భారతదేశం అక్షాంశపరంగా ఉత్తరార్ధగోళంలోనూ రేఖాంశాలపరంగా పూర్వార్ధగోళంలోనూ ఉండడం వల్ల భారతదేశానికి ఇరువైపులా భూ, జల విస్తరణ ఇంచుమించు సమానంగా ఉండి పీడన వ్యవస్థలో మార్పులు జరిగి రుతుపవన వ్యవస్థకు నాంది పలికాయి.
2. కర్కటకరేఖ భారతదేశం మధ్యలో నుంచి పోవడంవల్ల సూర్యగమనంలో మార్పుల ప్రభావానికి లోనైంది.
3. భారతదేశానికి ఉత్తరంగా పెద్ద భూభాగమైన ఆసియా ఖండం, దక్షిణాన పెద్ద జలభాగమైన హిందూ మహాసముద్రం అమరి ఉన్నాయి. ఈ రకమైన అమరిక ప్రపంచంలో మరెక్కడా లేదు. అందువల్ల నేల, నీరు, విభిన్న రీతుల్లో ఉష్ణోగ్రతను గ్రహించి, చల్లబడడం వల్ల రుతుపవన వ్యవస్థకు అంకురార్పణ జరిగింది.
4. రుతుపవనాలు పయనించే దారిలో ప్రథమ దేశంగా పెద్ద భూభాగంగా ఉండడం.
5. ప్రపంచంలో పెద్ద పర్వాతాలైన హిమాలయాలు భారతదేశ ఉత్తర దిక్కు పెట్టునికోటవలె ఉండి రుతుపవనాలను అడ్డగించి దేశానికి వర్షం ఇవ్వడానికి తోడ్పడుతున్నాయి. హిమాలయాలు లేకపోతే మాసిన్రాంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యేది కాదు.
6. కన్యాకుమారి అగ్రం వింతైన ఆకారం వల్ల రుతుపవనాలు రెండు శాఖలై ఏ ప్రాంతాన్ని వదలక వర్షాన్నిస్తున్నాయి.
7. దేశం మూడు వైపుల సముద్రం కలిగి ఉండడం రుతుపవనాల విషయంలో శుభపరిణామం.

గ్రూప్-1 ప్రత్యేకం

భారత రాజ్యాంగం- సవాళ్లు

ఎన్నో పోరాటాల తర్వాత బ్రిటిష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాం. కానీ స్వతంత్ర భారతదేశంలో ప్రతి పౌరుడికీ సమాన హక్కులు, సంక్షేమం కల్పించే అంశం నాటి జాతీయ నేతల ముందు పెద్దసవాలుగా నిలిచింది. ప్రపంచంలోని అత్యుత్తమ పాలనా వ్యవస్థలను, రాజ్యాంగాలను వడపోసి, భారత దేశానికి సరిపడేవిధంగా ఎన్నో అంశాలను క్రోడీకరించి తర్కించి, సుదీర్ఘంగా చర్చించిన తర్వాత భారత రాజ్యాంగానికి తుదిరూపునిచ్చారు మన రాజ్యాంగకర్తలు. కాలక్రమంలో దేశంలో ఎన్నో మార్పులు సంభవించాయి. అందుకు అనుగుణంగా రాజ్యాంగానికి కూడా అనేక సవరణలు జరిగాయి. అయినప్పటికీ మన రాజ్యాంగం ముందు అనేక సవాళ్లు నిలిచి ఉన్నాయి. పోటీ పరీక్షల్లో ఈ అంశంపైనే ఈ మధ్యకాలంలో ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిపుణ పాఠకులకోసం ప్రత్యేక వ్యాసం..



- రాజ్యాంగం అనేది భావి తరాలకోసం రూపొందించబడుతుంది. కానీ దాని నిర్దిష్ట క్రమం ఎప్పుడూ ఒడిదొడుకులు లేకుండా ఉండదు.
- రాజ్యాంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నది. వాటి పరిష్కారానికి వివిధ వ్యవస్థల మధ్య సదవగాహన, నాయకత్వం అవసరం ఉంటుంది.

రాజ్యాంగ ప్రవేశిక

- రాజ్యాంగ నిర్ణయసభ సభ్యులకు రాజ్యాంగంలో సామ్యవాదాన్ని చేర్చడం కంటే సామ్యవాద భావాలతో కూడిన ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించడమే అత్యంత ప్రాధాన్యతాంశం. భవిష్యత్తులో పౌరులు కోరుకున్నప్పుడు లేదా పరిస్థితులు నిర్ధేశించినప్పుడు భారతదేశం సామ్యవాద దేశంగా మారేందుకు వీలు కల్పిస్తుందనేది వారి ఉద్దేశం.
- కేశవానంద భారతి కేసు (1973)లో ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసుకు పూర్వం ప్రవేశిక రాజ్యాంగంలో భాగం కాదనే అభిప్రాయం ఉండేది.
- 42వ సవరణ సామ్యవాదం, లౌకిక, సమగ్రత అనే పదాలను రాజ్యాంగ ప్రవేశికలో చేర్చింది. దీనికి అనుగుణంగా భూసంస్కరణలు చేపట్టడం, బ్యాంకుల జాతీయీకరణ, వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూర్చే అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రవేశికలో చేర్చిన సామ్యవాదం సమాజంలో ఇప్పటికీ ఆచరణలో లేదని విమర్శకుల అభిప్రాయం.
- 2015, జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పత్రికల్లో ప్రకటన ఇస్తూ సామ్యవాద, లౌకిక పదాలు లేని మౌలిక రాజ్యాంగంలోని ప్రవేశికను ఇచ్చింది. దీనిపై దేశవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి.

ప్రాథమిక హక్కులు-ఆదేశిక సూత్రాలు

- చట్టం ముందు అందరూ సమానమని చాటే ప్రాథమిక హక్కుల నిబంధనలకు, వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలనే వాదనలకూ మధ్య వైరుధ్యం ఉంటుంది.
- 'రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకూ, రాజ్యాంగ సూత్రాలకూ మధ్య పుట్టుకతోనే ఆ వైరుధ్యం ఉన్నట్టు' సుప్రీంకోర్టు తీర్పువల్ల స్పష్టమవుతున్నది. ఆ వైరుధ్యాన్ని నిర్మూలించి ఆదేశిక సూత్రాల అమలుకు ప్రాథమిక హక్కులు దోహదపడేట్టు చేయాలి.
- రాజ్యాంగం.. పౌరులు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా స్థిర నివాసం ఏర్పరచుకోవడానికి, ఇష్టమైన వృత్తి వాణిజ్య వ్యాపారాలను అనుసరించడానికి స్వేచ్ఛనిస్తుంది. ఒక ప్రాంత ప్రజలు మరో ప్రాంతానికి వెళ్లి స్థిరనివాసం ఏర్పరచుకోవడం వృత్తి, ఉద్యోగాలు చేపట్టడం జరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఒక ప్రాంతం వారిపై మరో ప్రాంతం వారు దాడులు చేయడం రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి సవాలుగా మారింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఈశాన్య రాష్ట్రాలవారిపై, బీహార్-అసోం తదితర రాష్ట్రాల నుంచి వచ్చి ముంబైలో స్థిరపడిన వారిపై హింసాత్మకంగా దాడులు జరగడం రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా చెప్పవచ్చు.
- రాజ్యాంగంలో భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో 'సమంజసమైన' అన్న పదాన్ని వాడలేదు. ఆ పొరపాటును ఏడాది తర్వాత మొదటి రాజ్యాంగ సవరణ జరిగేటప్పుడు సరిదిద్దారు.
- సుప్రీంకోర్టును ఆశ్రయించలేని నిరుపేదలైన పౌరులకు సరైన రక్షణలను కల్పించేందుకు ప్రాథమిక హక్కుల విషయంలో ప్రభుత్వ ఖర్చులతో సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం కల్పించాలని ఎన్‌జీ రంగా సూచించారు.
- ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి ప్రజలకు హక్కు ఉంటుంది.
- సమాచార హక్కు అమలు విషయంలో రాజ్యాంగ సవాళ్లు ఎదురవుతున్నాయి.
- కులతత్వాన్ని, మత తత్వాన్ని నిర్మూలించడం రాజ్యాంగానికి పెద్ద సవాలుగా పరిణమించింది.
- భారత రాజ్యాంగ లౌకికత్వాన్ని సవాలు చేస్తున్నాయి.
- బహుసంస్కృతి సమాజం వంటి భారతదేశంలో అల్ప సంఖ్యాక వర్గాలకు రాజ్యాంగ నిర్మాతలు కల్పించిన ప్రత్యేక హక్కులు ఎంతో ఆలోచనతో రూపొందించినవి.
- రాజస్థాన్‌లోని గుజ్జర్లు, గుజరాత్‌లోని పటేళ్లు, కాపులు రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు చేస్తున్నారు. ఇలాంటి ఉద్యమాలు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా మారాయి.
- అమెరికాలో సామాజిక భద్రత (సోషల్ సెక్యూరిటీ) మాదిరిగా ప్రతి వయోజన భారతీయుడికి జీవిత బీమా ఉండాలనే వాదన ఉంది.
- పనిహక్కు కల్పించలేకపోవడం, దేశంలో కామన్ సివిల్ కోడ్ లేకపోవడం రాజ్యాంగానికి సవాల్‌గా మారింది. ఆదేశిక సూత్రాల అమలు విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- కేరళ, కర్ణాటక హైకోర్టులు దేశానికి ఉమ్మడి పౌర స్మృతి అవసరం అని పేర్కొన్నాయి.

కేంద్ర ప్రభుత్వం

- దేశానికి బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏ రూపంలో ఉండాలి?
1. అమెరికన్ అధ్యక్ష తరహా వ్యవస్థ
2. స్విడ్జర్లాండ్ తరహా ఎన్నికైన కార్యనిర్వహణ వ్యవస్థ
3. బ్రిటిష్ మంత్రిమండలి ప్రభుత్వం
- రాజ్యాంగ నిర్ణయసభ బ్రిటిష్ మంత్రిమండలి తరహా ప్రభుత్వం ఉత్తమం అని నిర్ణయించింది.
- ప్రజలతో ఎన్నికైన లోక్‌సభ తరచుగా ఐదేండ్ల పూర్తికాలం కొనసాగలేకపోతుంది. ఇది కూడా రాజ్యాంగానికి నూతన సవాల్‌గా మారింది.
- 1990లో వీపీ సింగ్, చంద్రశేఖర్, 1997లో దేవెగౌడ, ఇంద్రకుమార్ గుజ్రాల్, 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయి తదితరులు అవిశ్వాస తీర్మానం ద్వారా రాజీనామా చేశారు.
- రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 13వ లోక్‌సభను కాలపరిమితికన్నా ముందుగా రద్దు చేస్తూ రాజ్యాంగంలో 85 (2-బి) అధికారాన్ని ఉపయోగించుకోవడం చర్చకు దారితీసింది. సరైన కారణం లేకుండా ప్రధాని అధ్యక్షతనగల మంత్రిమండలి లోక్‌సభ రద్దును సిఫార్సు చేసినప్పుడు రాష్ట్రపతి ఆ సలహాను పాటించాలా లేక తిరస్కరించాలా అనే అంశం రాజ్యాంగానికి సవాలుగా మారింది.
- ఏ ఒక్క రాజకీయ పార్టీ లేదా పార్టీల సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో లేనప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తుంది.
- ఈ సంక్షోభాన్ని నివారించడానికి జాతీయ ప్రభుత్వం ఏర్పాటును సూచిస్తున్నారు.
- రాజకీయ పార్టీలు, పార్టీల వ్యవస్థ అవసరమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- తక్కువ శాతం ఓట్లతో గెలుస్తున్న పార్టీలు ప్రభుత్వాలను ఏర్పరచడం పార్లమెంటరీ వ్యవస్థకు సవాల్‌గా మారింది.

కొత్త రాష్ట్రాలు -ప్రకరణ -3

- రాజ్యాంగసభలో రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణకు సంబంధించి రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. కొత్త రాష్ట్రాల ఏర్పాటులో సంబంధిత రాష్ట్ర అసెంబ్లీకి కూడా నిర్ణయాధికారం ఉండాలన్న ఆలోచనను రాజ్యాంగ పరిషత్‌సభ్యులు తిరస్కరించారు. అసెంబ్లీకి నిర్ణయాధికారం ఇస్తే, తక్కువ జనాభా ఉన్న ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటానికి ఎప్పుడూ ఆ సభ అంగీకరించదని రాజ్యాంగపరిషత్ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అందువల్ల తక్కువమంది ఎమ్మెల్యేలున్న ప్రాంతాల ఆకాంక్షలు పరిపూర్తి చెందవు. అందుకే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో అసెంబ్లీ అభిప్రాయాన్ని తీసుకుంటే చాలని సూచించారు. అసెంబ్లీ సమ్మతి అనవసరమని ప్రతిపాదించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 రూపకల్పన చేశారు. రాజ్యాంగపరిషత్ సభ్యులు దూరదృష్టితో ఆలోచించి ఉండకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉండేది కాదు.
- 1955లో జరిగిన ఐదో సవరణ చట్టం ప్రకరణ 3లోని నిబంధనను స్వల్పంగా మార్చింది. అభిప్రాయాలు తెలుసుకునేందుకు రాష్ట్రపతి ఈ బిల్లును రాష్ట్ర శాసనసభకు తప్పనిసరిగా పంపాలని చేర్చారు.
- తెలంగాణ ఏర్పాటు సందర్భంలో దేశవ్యాప్తంగా మూడో ప్రకరణపై చర్చ జరిగింది. కొంతమంది ప్రకరణ 3కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. నూతన రాష్ట్రాల ఏర్పాటు రాజ్యాంగానికి సవాలుగా మారింది.



రాష్ట్రపతి, గవర్నర్‌లు జారీచేసే ఆర్డినెన్సులు

- రాష్ట్రపతి, గవర్నర్‌లు పదేపదే ఆర్డినెన్సులు జారీచేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆర్డినెన్స్‌లను తిరిగి జారీ చేయడం రాజ్యాంగాన్ని వంచించడమే అని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రభుత్వం ఆర్డినెన్సును చట్టసభల ముందు ఉంచకపోవడం అంటే ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన చట్టబద్ధ ప్రక్రియను దెబ్బతీయడమే అని వ్యాఖ్యానించింది. ఆర్డినెన్సులను పునర్‌జారీచేయడం రాష్ట్రపతి, గవర్నర్ల సంతృప్తి అన్నది న్యాయసమీక్షకు అతీతం కాదని పేర్కొంది.
- ఆర్డినెన్స్ పునర్‌జారీకి రాజ్యాంగం అనుమతించదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆర్డినెన్సు జారీకి రాష్ట్రపతి, గవర్నర్‌లకు రాజ్యాంగం పరిమితమైన అధికారాన్నే ఇచ్చిందని సుప్రీంకోర్టు పేర్కొంది.
- ప్రజాస్వామ్యంలో శాసనాలు చేసేది అంతిమంగా చట్టసభలే కాబట్టి ఆర్డినెన్స్‌లను పునర్ జారీ చేయడాన్ని రాజ్యాంగం అనుమతించదని పేర్కొంది.
- పార్లమెంటు, శాసనసభలు సమావేశంలో లేనప్పుడు దైనందిన పరిపాలన వ్యవహారాలకు అంతరాయం కలుగకుండా ఉండటానికి అత్యవసరంగా శాసనం చేయాల్సిన సందర్భం వచ్చినప్పుడు ప్రకరణ 123 ప్రకారం రాష్ట్రపతి, ప్రకరణ 213 ప్రకారం గవర్నర్లు మంత్రిమండలి సలహాతో ఆర్డినెన్సులు జారీ చేస్తారు. ఇది రాజ్యాంగ నిర్మాతల అపూర్వ సృష్టి. అయితే ఒక శాసనాన్ని తీసుకురావడానికి ప్రభుత్వాలకు ఆర్డినెన్స్ ఒక దొడ్డిదారిగా మారింది. ఇది రాజ్యాంగానికి ఒక సవాల్‌గా మారింది. రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కాలంలో అత్యధిక ఆర్డినెన్సులు జారీ అయ్యాయి. 1969, జూలై 19న బ్యాంకుల జాతీయీకరణకు సంబంధించిన ఆర్డినెన్సును పార్లమెంటు వర్షాకాలపు సమావేశానికి రెండు రోజుల ముందు జారీ చేశారు. ఇటీవల భూసేకరణ, పునరావాస ఆర్డినెన్స్‌ను మూడుసార్లు జారీచేశారు. ఒకసారి రాజ్యసభను ప్రోరోగ్ చేసి మరీ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

భారత న్యాయవ్యవస్థ

- న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు రావడం న్యాయవ్యవస్థకు, రాజ్యాంగానికి సవాళుగా పేర్కొనవచ్చు.
- జస్టిస్ వీ రామస్వామి, జిస్టిస్ సౌమిత్రసేన్, జస్టిస్ పీడీ దినకరణ్ తదితరులపై అవినీతి, అనుచిత ప్రవర్తన ఆరోపణలు వచ్చాయి.
- ఇటీవల కూడా ఒక న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చాయి. అభివృద్ధితో పాటే న్యాయ వ్యవస్థ సామర్థ్యం ముడిపడి ఉంటుంది. మున్సిఫ్ జడ్జి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు సగటున ఏడాదికి పరిష్కరిస్తున్న కేసులు 2,600. అమెరికాలో ఈ సంఖ్య 81. న్యాయమూర్తుల సంఖ్య పెరగలేదంటే అది ప్రభుత్వ నిష్క్రియా పరత్వమే అని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ అన్నారు. న్యాయస్థానాల్లో పూర్తి స్థాయిలో న్యాయమూర్తుల నియామకం జరగడం లేదు.
- ఆదేశిక సూత్రాల్లోని 39 (ఏ) ప్రకరణ న్యాయం పొందడాన్ని అత్యంత ముఖ్యమైన మానవ హక్కుగా పేర్కొంటుంది. దురదృష్టవశాత్తు ఢిల్లీ దాక వెళ్లిపోరాడే స్తోమత గలవారికే దేశంలో ఇప్పుడు న్యాయం అందుబాటులో ఉంది.
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి దేశంలోని కోర్టులకు మరో 350 ఏండ్లు పడుతుందని అంచనా.
- ఇటీవల 99వ రాజ్యాంగ సవరణను సుప్రీం కోర్టు చెల్లదని పేర్కొంది. దీనిపై జయప్రకాష్ నారాయణ్ సుప్రీంకోర్టు తీర్పు దురదృష్టకరం అని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిర్ణయం అని ఇది రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు.
- సుప్రీంకోర్టును రాజ్యాంగపరమైన, చట్టపరమైన విభాగాలుగా వర్గీకరించాలి.
- సామాన్యుడికి న్యాయవ్యవస్థ మీద విశ్వాసం సన్నగిల్లుతోంది.
- స్పష్టమైన అధికార విభజన ఉన్నప్పటికీ శాసన నిర్మాణశాఖ, న్యాయశాఖల మధ్య వివాదాలు రాజ్యాంగ సమస్యగా మారాయి.
- నిర్భయ కేసులో బాల నేరస్థుడిని 2015, డిసెంబర్ 20న విడుదల చేశారు. నేరానికి పాల్పడిన వారందరిలో అతనే అత్యంత క్రూరంగా వ్యవహరించాడు. నేరం చేసిన నాటికి అతని వయస్సు బాలల వర్గం కిందికి వస్తుంది. తద్వారా అతనికి మూడేండ్ల జువైనల్ హోం శిక్ష పడింది. బాల నేరస్థుడి విడుదల మన చట్టాల్లోని లొసుగులను ఎత్తి చూపుతుంది. అతని విడుదలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. చివరికి సుప్రీంకోర్టు కూడా అతని విడుదల నిలుపుదలకు నిరాకరించింది. ఈ సంఘటన న్యాయవ్యవస్థ, చట్టాల్లోని లోసుగులను తెలుపుతుంది. ఇలాంటి సంఘటనలు దేశ చట్టాలకు రాజ్యాంగానికి ఒక సవాలుగా మారాయి.

జాతీయ అత్యవసర పరిస్థితి అధికారాలు- ప్రకరణ 352

- ఒక ప్రధానమంత్రి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం జాతీయ అత్యయిక పరిస్థితి దుర్వినియోగానికి పాల్పడటం. వీటిని ఊహిస్తే రాజ్యాంగంలో అత్యయిక పరిస్థితి నిబంధనను అసలు చేర్చి ఉండేవారు కాదు. ఒకవేళ చేర్చినా 44వ రాజ్యాంగ సవరణలో మాదిరిగానే దానికి తగిన పరిమితులు ఏర్పర్చి ఉండేవారు.
- 1971 లోక్‌సభ ఎన్నికలో రాయ్‌బరేలీ నియోజకవర్గంలో ఇందిరాగాంధీ అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారన్నా అభియోగాలతో రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో ఆమెపై కేసు వేశారు. ఆ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జగ్‌మోహన్‌లాల్ సిన్హా ఇందిరాగాంధీపై అవినీతి ఆరోపణలు నిజమేనని తేల్చిచెప్పారు. పార్లమెంటుకు ఆమె ఎన్నిక చెల్లదని తీర్మానించి, ఆరేండ్లపాటు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి వీఆర్ కృష్ణ అయ్యర్ ఇందిర అప్పీల్‌ను విచారించి ఆమెకు షరతులతో కూడిన స్టేను జారీచేశారు. దానిప్రకారం ఆమె ప్రధాని పదవిలో కొనసాగవచ్చు కానీ పార్లమెంటులో జరిగే చర్చల్లోగాని, ఓటింగ్‌లోగాని పాల్గొనకూడదని నిషేధించారు.
- జూన్ 12న న్యాయమూర్తి సిన్హా తీర్పు ప్రకటించింది మొదలు ఇందిర రాజీనామా చేయాల్సిందేనంటూ కాంగ్రెసేతర పక్షాలు దేశవ్యాప్తంగా గళం వినిపించడం మొదలు పెట్టాయి.
- ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ నుంచి జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్‌తోపాటు ఇతర నాయకులు జూన్ 25న ర్యాలీ తీశారు.
- అప్పుడు ఇందిర అనుంగుడు సిద్ధార్థ శంకర్ రే రాజ్యాంగంలోని ప్రకరణ 352 ప్రకారం దేశంలో అంతర్గత అత్యయిక స్థితిని ప్రకటించవచ్చని ఇందిరాగాంధీకి సలహా ఇచ్చారు.
- 1975, జూన్ 25న రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌ను కలిశారు. మంత్రివర్గాన్ని కూడా సంప్రదించకుండా ఇందిర తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రపతి ఆమోదించారు.
- తరువాత రోజు ఉదయాన్నే మంత్రివర్గాన్ని సమావేశపరిచిన ఇందిర తన నిర్ణయాన్ని వారికి వెల్లడించారు.
- ఆ తరువాత పార్లమెంటు వేదికగా రాజ్యాంగానికి 39 నుంచి 42 వరకు సవరణలు తీసుకువచ్చారు.

రాష్ట్రపతి, గవర్నర్ల క్షమాభిక్ష అధికారాలు

- రాష్ట్రపతి, గవర్నర్ల క్షమాభిక్ష అధికారాలు తరచుగా వివాదానికి కారణమవుతున్నాయి.
- ప్రకరణ 72 ప్రకారం రాష్ట్రపతికి, ప్రకరణ 161 ప్రకారం గవర్నర్లకు ఉన్న క్షమాభిక్ష అధికారాలు రాజ్యాంగానికి సవాల్‌గా పరిణమించాయి.
- 24 ఏళ్లుగా జైలులో ఉన్న నళిని ప్రకరణ 161 ప్రకారం రాష్ట్ర మంత్రిమండలి సలహా మేరకు గవర్నర్ క్షమాభిక్ష ప్రసాదించవచ్చని హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసింది.
- యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఏడుగురు ఖైదీల విడుదలకు ఆదేశాలు జారీ చేస్తూ జయలలిత నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది.
- భారత మాజీ ప్రధాని హంతకుల పట్ల



జయలలిత వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి.
- తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
- తద్వారా కేంద్ర, రాష్ట్ర అధికారాలపై చర్చకు దారితీసింది.
- సుప్రీంకోర్టు ఈ కేసును విచారించి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నది. అవి.. సీబీఐ, ఎన్ఐఏ, ఐబీ వంటి కేంద్ర సంస్థలు దర్యాప్తు చేసిన కేసుల్లో శిక్షలు అనుభవిస్తున్నవారికి క్షమాభిక్ష మినహాయింపులు ఇచ్చే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది.
- 14 ఏండ్లకు పైబడి యావజ్జీవం అనుభవిస్తున్నవారు స్వయంగా ధరఖాస్తు చేసుకుని శిక్షాకాలం తగ్గించమని కోరితే తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకూడదు.

భారత సమాఖ్య, కేంద్ర రాష్ట్ర సంబంధాలు

- 1950-67 వరకు కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ఎలాంటి వివాదాలు ఏర్పడలేదు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటమే దీనికి కారణం.
- 1967-72 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విషయాల్లో వనరుల పంపిణీ వరకు తరుచు వివాదాలు తలెత్తాయి. 1967 సాధారణ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారాన్ని కోల్పోవడం ఇందుకు కారణం.
- 1972-77 మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎలాంటి వివాదాలు ఏర్పడలేదు. 1967లో ఓడిపోయిన కాంగ్రెస్‌పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఇందుకు కారణం.
- 1977-80 మధ్య కాలంలో మరోసారి దేశ రాజకీయాల్లో నూతన పరిణామాలు ఏర్పడ్డాయి. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్తంగా ఓడిపోయింది. జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది.
- 1983 తరువాత అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడటంతో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల విషయంలో రాష్ట్రాల అంతరంగిక విషయాల్లో కేంద్ర జోక్యం, గవర్నర్లు తమ బాధ్యతలను నిర్వహించే విషయంలో అనేక వివాదాలు ఏర్పడ్డాయి.
- బలహీనమైన కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు హాని కలిగిస్తుంది. దేశంలో శాంతిని కాపాడటంలో, కీలకమైన విషయాలను సమన్వయ పరచడంలో విఫలమవుతుంది. అంతర్జాతీయ వేదికలమీద దేశం తరఫున సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహించలేకపోతుంది. మన రాజ్యాంగానికి పటిష్టమైన కేంద్రంతో కూడిన సమాఖ్య విధానమే అత్యంత ఆరోగ్యవంతమైన పద్ధతి అని రాజ్యాగ పరిషత్ భావించింది.
- కేంద్రం, రాష్ట్రం పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడటంలోనే ఈ వ్యవస్థ మనుగడ కొనసాగుతుంది. 'ఒకవేళ రాష్ట్రాలు తమ అభీష్టానికి వ్యతిరేకంగా కేంద్ర శాసనానికి సహకరించాల్సిందే అని ఆశిస్తే మాత్రం అది నెరవేరదు' అని పంత్ పేర్కొన్నారు.
- 1964లో ఉత్తరప్రదేశ్ శాసనసభకు, ఆ రాష్ట్ర హైకోర్టుకు మధ్య వివాదం ఏర్పడింది. శాసన ధిక్కారానికి పాల్పడి జైలుశిక్ష అనుభవిస్తున్న ఒక వ్యక్తిని హెబియస్ కార్పస్ పిటిషన్‌కు ప్రతిస్పందనగా విడుదల చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. శాసన వ్యవస్థకు, న్యాయ వ్యవస్థకు మధ్య తలెత్తిన ఈ అధికారాల వివాదం ఎంతో ఉద్రిక్తతని, ఆసక్తిని కలిగించింది. న్యాయ సలహా కోసం రాష్ట్రపతి ఈ అంశాన్ని సుప్రీంకోర్టుకు పంపించారు. అప్పుడు సుప్రీంకోర్టు హైకోర్టు తీసుకున్న చర్య సరైనదే అని నిర్ధారించింది. ఆ విధంగా రాజ్యాంగమే ఈ సమస్యకు పరిష్కారం చూపింది.

శివరాజం బొట్ల
సీనియర్ ఫ్యాకల్టీ
భారత రాజ్యాంగం
పుస్తక రచయిత
హైదరాబాద్
9908552262





దిల్ రాజు, వంశీపైడిపల్లి, అశ్వనీదత్, ఆద్య, గౌతమ్, సితార, నమ్రత, శ్రీహన్షితరెడ్డి, దేవిశ్రీప్రసాద్,హరి సాల్మన్

మహేష్‌బాబు కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, వైజయంతి మూవీస్ పతాకాలపై తెరకెక్కుతున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వంశీపైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. సి. అశ్వనీదత్, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి మహేష్‌బాబు తనయుడు గౌతమ్ క్లాప్‌నివ్వగా, కుమార్తె సితార కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి దర్శకుడు వంశీపైడిపల్లి కూతురు ఆద్య గౌరవ దర్శకత్వం వహించింది. కె. రాఘవేంద్రరావు, వి.వి.వినాయక్ దర్శకుడు వంశీపైడిపల్లికి స్క్రిప్ట్‌ను అందజేశారు. శిరీష్, లక్ష్మణ్, అశ్వనీదత్ కుమార్తె స్వప్నదత్, దిల్ రాజు కూతురు శ్రీహన్షిత రెడ్డి పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. మహేష్‌బాబు నటిస్తున్న ఇరవై అయిదవ చిత్రమిది. ఈ కార్యక్రమంలో నమ్రతా మహేష్ , జెమిని కిరణ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, సునీల్ నారంగ్, సురేందర్‌రెడ్డి, సతీష్ వేగేశ్న, హరీష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కథ: వంశీపైడిపల్లి, హరి సాల్మన్.